రైతాంగ ప్రయోజనాలను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకపోవటం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెంచటం, ఎరువుల ధరల నిర్ణయ అధికారం ఎరువుల కంపెనీలకే ఇవ్వటం, పోషకాలను బట్టి ఎరువుల సబ్సిడీ ఇవ్వటం, ధాన్యసేకరణ నుంచి ఎఫ్సిఐని తప్పించటం, వ్యవసాయరంగంలోకి బహుళజాతి సంస్థలకు అవకాశం కల్పించటం, ల్యాండ్టైటిల్యాక్ట్రుతో భూముల సర్వేచేయించి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టటం, రైతుల మోటార్లకు కరెంట్మీటర్లు బిగించమని రాష్ట్రాలకు చెప్పటం లాంటి చర్యలు ఇప్పటికే అమలుచేసింది. తాజాగా చెరకు రైతులకు ప్రయోజనంగా ఉన్నవాటిని ఉపసంహరిస్తూ ఆర్డర్జారీ చేసింది. కేంద్రప్రభుత్వ విధానాల వల్ల చెరకు రైతాంగం తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఆ సంక్షోభం ఇంకా ఎక్కువ అయ్యేలా కేంద్రంలోని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార,ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ 1966 షుగర్ (నియంత్రణ) ఆర్డర్మరియు 2018 నాటి చక్కెర నియంత్రణ ఆర్డర్ను కలిపి దిషుగర్ (నియంత్రణ) ఆర్డర్ 2024 ముసాయిదాను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఉత్పత్తిప్రక్రియలో సాంకేతిక పురోగతి, పరిశ్రమలో మార్పులను పేర్కొంటూ 2024 ముసాయిదా విడుదల చేసినట్లు చెప్పింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరపొందటానికి పంచదార రికవరీ రేటును8.5 నుంచి 10కి కొత్త ముసాయిదాలో పెంచటం జరిగింది. భారతదేశంలో రికవరీ రేట్రీడింగ్సు సక్రమంగా తెలిపే మిషన్లులేని కారణంతోపాటు, రికవరీని పెంచే నాణ్యమైన విత్తనం అందకపోవటం వల్ల కొత్తముసాయిదాలో పేర్కొన్న 10 రికవరీ రేటురాని పరిస్థితుల్లో రైతులు మద్దతు ధర పొందలేరు. దేశంలో పంచదార రికవరీ 9కి మించి ఎప్పుడు రాలేదు. 2024 నవంబర్ మొదటివారంలో 8.82 మాత్రమే ఉంది. బ్రెజిల్లాంటి కొన్నిదేశాల్లో 11 నుంచి 14పైగా పంచదార రికవరీ వస్తుంది. షుగర్( నియంత్రణ)ఆర్డర్ 1966 లోని సెక్షన్5ఎ, చక్కెర మిల్లుల ద్వారా వచ్చే లాభాల నుండి అదనపు ధరవాటా పొందేందుకు రైతులకు వీలు కల్పించింది. ఇప్పుడు ఆ నిబంధన తొలగించటంతో లాభాలను పంచకుండా తప్పించుకుంటున్న మిల్లులకు వరంలా దొరికింది. ప్రభుత్వం ప్రకటించిన ధరతోపాటు, రాష్ట్రప్రభుత్వాలు అదనంగా సలహా(ఎస్ఏపీ) ధరను ప్రకటించటానికి 1966 ముసాయిదాలో వీలుకల్పించిన నిబంధనను కూడా కేంద్రప్రభుత్వ కొత్త ఆర్డరు ముసాయిదా తొలగించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక మరికొన్ని రాష్ట్రాలు 2 నుండి5 వందల వరకు సలహాధరను ప్రకటిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కొన్నిసంవత్సరాలు 200 సలహాధరను ప్రకటించింది. కొత్తషుగర్ (నియంత్రణ) ఆర్డరు ప్రకారం రాష్ట్రాలు సలహాధరను ప్రకటించలేవు. చక్కెర మిల్లులు బ్యాంకుల్లో తనఖా పెట్టిన పంచదార అమ్ముకోవటానికి కేంద్రప్రభుత్వ అనుమతి తప్పక కొత్త ముసాయిదాలో పేర్కొన్నారు. ఫలితంగా చెరకు కొనుగోలు చేసిన 14రోజులలోపు మిల్లులు డబ్బులు చెల్లించాలన్న నిబంధన నిరుపయోగంగా మారింది. రైతులకు డబ్బులు ఎప్పుడు చెల్లించాలన్న అధికారం మిల్లులకుదక్కింది. చెరకు విక్రయ డబ్బులు పొందటానికి మిల్లర్ల దయపై రైతులు ఆధారపడాల్సి వస్తుంది. ప్రపంచంలోని 195దేశాల్లో 124దేశాలు చెరకు పండిస్తున్నారు. భారతదేశంలో 50 లక్షల ఎకరాల్లో చెరకు సేద్యం జరుగుతున్నది. చక్కెర



తయారీ పరిశ్రమలకేకాకుండా, కాగితం, మద్యం, పశువుల దాణా,రసాయనాల తయారీకి ముడిపదార్థాల ఉత్పత్తిని చెరకు సేద్యం అందిస్తుంది. ఎకరాకి సగటు దిగుబడి30 టన్నులు వస్తుంది. ఎకరాకు సేద్యానికి అన్నిరకాల సేద్యపు ఖర్చు లక్షదాకాఉంది. కౌలురైతుకు అదనంగా మరో20 వేలు ఖర్చుగాపెట్టాలి. నీతి అయోగ్ నివేదిక ప్రకారం దేశంలోని వ్యవసాయ పరిశ్రమల్లో చక్కెరపరిశ్రమ రెండవ పెద్ద పరిశ్రమ. చక్కెర ఉత్పత్తిలో బ్రెజిల్ మొదటిస్థానంలో ఉండగా, భారత్ రెండవస్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్లో5.60 లక్షల ఎకరాల్లో రైతులు చెరకుసాగుచేస్తున్నారు. దేశంలో లక్షలాది రైతుకుటుంబాలకు జీవనోపాధిగా ఉండి, ఎందరికో ఉపాధికల్పిస్తూ, పెద్దమొత్తంలో విదేశీమారకద్రవ్యాన్ని దేశానికి అందిస్తున్న చెరకు రైతాంగం ఎడలకేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నేడు తీవ్రసంక్షోభంలో ఉంది. కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరచెరకు రైతులకు ఏమాత్రంమేలుచేయ లేదు. దిగుబడి ఎకరాకు30 టన్నులు. ప్రభుత్వం చెప్పే క్వింటాల్ చెరకు ఉత్పత్తిఖర్చు157 రూపాయలు. వాస్తవ ఖర్చు305 రూపాయలు. కేంద్రంప్రకటించినక్వింటాల్ మద్దతుధర350 రూపాయలు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ ఖర్చుపై 50 పెంచితే 450ప్రకటించాలి. 10పంచదార రికవరీ వచ్చేచెరకుకి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది. అంతకన్నా తక్కువ రికవరీ వస్తే తగ్గినదాని ప్రకారం మద్దతుధరలో కోతపడుతుంది. మద్దతుధరప్రకారం 30 క్వింటాళ్లు వచ్చిన రైతుకు లక్షా,ఐదువేల ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం సొంతభూమి రైతులకు ఖర్చులకు సరిపోవటం లేదా నామమాత్రపు మిగులుఉంటుంది. కౌలుకు రెతులకు పెట్టుబడి కూడా రాదు. టన్నుచెరకుద్వారా280 కిలోల పంచదార లభిస్తుంది. కేజీ30 చొప్పున 8680 రూపాయలు వస్తుంది. మద్దతుధర ప్రకారం టన్ను చెరకు ద్వారా రైతుకు లభించేది 3500 రూపాయలు. మిల్లు యజమానులకు మిగులుతున్నది 5,180 రూపాయలు. ఎకరం చెరకుపైన మిల్లుయజమాని 1,60,580 రూపాయలు మిగులు పొందుతాడు. ఫ్యాక్టరీ ఖర్చుల కింద 50 వేలు తీసేసినా లక్షకుపైగా మిగులుతుంది. దేశంలో 453 చక్కెర మిల్లులుంటే, వాటిల్లో 252 సహకార రంగంలో,67 ప్రభుత్వరంగంలో ఉంటే,134 ప్రైవేట్ రంగంలోఉన్నాయి. సహకార, ప్రభుత్వపంచదార మిల్లును ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వాటిని మూసివేయటం లేదా అమ్మివేయటం చేస్తున్నది. చెరకు రంగమంతా నేడు ఎక్కువగా ప్రైవేట్ పరిశ్రమల చేతుల్లోఉంది. రైతులు, ప్రైవేట్ మిల్లులకే 90శాతం చెరకు విక్రయిస్తున్నారు. మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువ ఇస్తూ రైతాంగాన్ని దోచుకుంటున్నారు. సకాలంలో డబ్బులు ఇవ్వకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సంవత్సరాల తరబడి వేలాదిరూపాయలు రైతులకు బకాయిలుపెట్టారు. ప్రస్తుతం 5వేలకోట్ల దాక రైతులకు చెల్లించాల్సిన బకాయిలున్నాయి. కేంద్రప్రభుత్వం రైతాంగానికి మిల్లు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోకుండా మిల్లు యజమానుల ప్రయోజనాల కోసం తానే హామీ ఉండి వేలాది కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించింది. రైతాంగంమాత్రం అప్పుల్లో కూరుకుపోయారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నష్టదాయకంగా మారటంతో చెరకు సేద్యంఎడల రైతుల్లో విముఖత ఏర్పడి లక్షలాది ఎకరాల్లో సాగువిస్తీర్ణం తగ్గింది. ఫలితంగా 2022లో పంచదార ఉత్పత్తి 328.7లక్షల టన్నులుండగా 2023 నాటికి 311లక్షల టన్నులకు తగ్గింది. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి రైతాంగం సాగు నుండి తప్పుకునేలాచేసి, చెరకు పంటను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, పంచదారను విదేశాల నుంచి కేంద్రం దిగుమతి చేసుకోనుంది. ఇప్పటికే మూడు లక్షల టన్నులు దేశంలోకి దిగుమతి అయ్యింది. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా యావన్మంది చెరకు రైతులు ఉద్యమించాలి. 2924 షుగర్ (నియంత్రణ) ఆర్డర్ ముసాయిదాను ఉపసంహరించాలని, టన్నుకు చెరకుకు 4,775రూపాయల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేయాలి. •

# నిశ్శబ్ద విపత్తుగా మారుతున్న ప్యాకెట్ ఫ్రూట్ జ్యూస్!

డా బుర్ర మధుసూదన్ రెడ్డి

బహుళజాతి కంపెనీలు సువిశాల మాల్స్ ఏర్పాటు చేసి, ఆకర్షణీయ ప్రకటనలు కుమ్మరించి యువతను బుట్టలో వేసుకొని తమ ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్‌ను అమ్ముకోవడంతో నేడు ప్రజారోగ్యం గాల్లో దీపం అవుతున్నది. లవణాలు, కొవ్వులు, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్న చిప్స్, కుర్‌కురే లాంటి ప్యాకెట్లతో పాటు పలు రకాల నిల్వ ఉంచిన పండ్ల రసాల ప్యాకెట్లు కూడా వినియోగదారుల ఆరోగ్యాన్ని మరో నిశ్శబ్ద విపత్తు వలె హరిస్తున్నాయి. దీనికి రుజువుగా తాజాగా విడుదలైన శాస్త్రవేత్తల అధ్యయన నివేదికలు నిలుస్తున్నాయి. రోజుకు పలు సార్లు కాఫీ సేవించినా, రెడీమేడ్ ప్రాసెస్డ్ ప్యాకెట్ పండ్ల రసాలు లేదా ఫిజ్జీ డ్రింక్స్ అతిగా సేవించినా తీవ్రమైన అనారోగ్యాలు, ప్రాణాపాయం కూడా కలగవచ్చని తాజాగా విడుదలైన ఇంటర్‌స్ట్రోక్ రిసెర్చ్ ప్రాజెక్ట్ శాస్త్రవేత్తల బృందం అధ్యయనాలు స్పష్టం చేయడం రానున్న ప్రమాదానికి హెచ్చరికగా తీసుకోవాలి. ఒక వ్యక్తి దినసరి సగటున రోజుకు నాలుగు సార్లు కాఫీ సేవిస్తే 37 శాతం స్ట్రోక్ (పక్షవాతం) ముప్పు అవకాశాలు పెరుగుతాయని తేలింది. ఇలాంటి ఫ్రూట్ జ్యూస్ లేదా కాఫీలకు బదులు స్వచ్ఛమైన నీటిని సేవిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని సూచిస్తున్నారు. శీతల పానీయాలతో 22 శాతం, ప్యాకెట్ పండ్ల రసాలతో 37 శాతం వరకు స్ట్రోక్ అవకాశాలు పెరగడం కూడా గమనించారు. బ్లాక్ టీ చప్పరిస్తే 1829 శాతం స్ట్రోక్ అవకాశాలు తగ్గుతాయని కూడా సలహా ఇస్తున్నా పెద్ద అంతర్జాతీయ శాస్త్ర బృంద అధ్యయనం ప్రకారం మెదడుకు రక్తప్రసరణ పూర్తిగా జరగనప్పుడు లేదా ఆగిపోయినప్పుడు ఇస్కిమిక్ స్ట్రోక్ లేదా మెదడులో రక్తం గడ్డకట్టినప్పుడు మెదడు కణజాలం దెబ్బతిని హెమరేజిక్ స్ట్రోక్ వస్తుందని అంటున్నారు. 27 దేశాలకు చెందిన 27,000 మందిని



ఎంపిక చేసుకొని అతి పెద్ద అంతర్జాతీయ అధ్యయన సంస్థ అధ్యయనం చేయడంతో వీరిలో 13,500 మంది తొలి స్ట్రోక్ అనుభవించారని తేలింది. ప్రాసెస్డ్ ఫ్రూట్ ఫిజ్జీ డ్రింక్స్‌లో కృత్రిమ షుగర్స్, ఎక్కువ కాలం నిలువ ఉండడానికి వాడే ప్రిజర్వేటివ్స్ అధిక మోతాదులో ఉంటాయని, ఈ రసాలను రోజుకు రెండు లేదా అంత కన్న ఎక్కువ సార్లు సేవిస్తే 22-37 శాతం స్ట్రోక్ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇలాంటి పానీయాలను మహిళలు సేవిస్తే ప్రమాదం మరింత అధికంగా ఉంటుందని కూడా స్పష్టం చేస్తున్నారు. రోజుకు 7 గ్లాసుల నీరు తాగితే రక్తం గడ్డ కట్టడం వల్ల వచ్చే స్ట్రోక్స్ తగ్గుతాయని కూడా సలహా ఇస్తున్నారు. రోజుకు 3 నుంచి 4 కప్పుల బ్లాక్ టీ తాగిన వారిలో 29 శాతం స్ట్రోక్ అవకాశాలు తగ్గుతాయని, అదే విధంగా రోజుకు 3 నుంచి 4 కప్పుల గ్రీన్ టీ సేవిస్తే 27 శాతం స్ట్రోక్ అవకాశాలు తగ్గుతాయని తేలింది. టీలో పాలను కలిపినపుడు ఆరోగ్య ప్రయోజనాలు తగ్గుతాయని కూడా తేల్చారు. నీటిని క్రమం తప్పకుండా రోజంతా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని కూడా సలహా ఇస్తున్నారు. శీతల పానీయాలు, నిలువ ఉంచిన రెడీ మేడ్ ప్యాకెట్ పండ్ల రసాలు, కాఫీ, పాలతో కూడిన టీల వాడకాన్ని తగ్గిస్తే ఉత్తమమని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పండ్ల రసాల్లో తాజాగా మార్కెట్‌లో లభించే సీజనల్ ఫ్రూట్స్‌ను నేరుగా తీసుకోవడం లేదా ఇంట్లోనే వాటి రసాలను తయారు చేసుకొని వెంటనే సేవించడం అత్యుత్తమ మార్గమని గమనించాలి. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి పునాదులని గమనించి ఉత్తమమైన జీవన విధానంతో నిండు నూరేళ్ల చురుకుగా జీవితాన్ని కొనసాగించడానికి ఉపకరించే సమతుల పోషకాహారం తీసుకుంటూ, పిల్లలు/యువతకు మార్గ నిర్దేశనం చేస్తూ దేశాభివృద్ధికి తోడ్పడదాం, యువ భారతాన్ని వికసిత్ భారత్‌గా మార్చుదాం. •

# వాహనాల స్క్రాప్ పాలసీ కఠిన తరం చేయాలి



మేకిరి దామోదర్

మానవులు మెరుగైన పర్యావరణ పరిస్థితుల్లోనే శారీరకంగా, మానసికం గా, ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధికి తోడ్పడుతారు. ఆధునిక నాగరికత, టెక్నాలజీ సమాజ, పర్యావరణహితాన్ని కోరుకోవాలి. వ్యక్తిగత సౌలభ్యం, సౌక ర్యం కోసమో ఉమ్మడి బాధ్యతలు విస్మరిస్తున్న తీరును చూస్తున్నాం. కాలం చెల్లిన వాహనాలతో వాయు కాలుష్యం, ఫిట్నెస్ లేక జరుగుతున్న ప్రమాదాల ఎన్నో. మన ఆర్థిక స్తోమ తను బట్టి నూతన వాహనాలను ప్రయాణ సౌలభ్యం కోస మో, సమయం ఆదా కోసమో సౌకర్యవంతమైన ప్రయాణం కోసమో బైకులు, కార్లు, ఆటోలు, ఫోర్‌వీల్స్, సిక్స్‌వీల్స్ తదితర వాహనాలను రవాణా కోసం కొనుగోలు చేస్తుం టాం. ఇలా మనం కొత్త వాహనం కొన్నప్పుడు రవాణాశాఖ 15 సంవత్సరాలకే అనుమతిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తుంది. తరువాత కూడా తిరగాలంటే రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవాలి. ఫిట్‌గానే ఉందా! లేదా? నిర్ధారించి రవాణాశాఖ అనుమతిస్తుంది. 15ఏళ్లు దాటిన వాహనాలకు ఫిట్నెస్‌తగ్గి ప్రమాదాలకు ఆస్కారం అధికంగా ఉంటుంది. వీటి నుండి పొగ అధికంగా వస్తూ పర్యావరణంపై తీవ్రప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో జీవితకాలం దాటిన బండ్ల(వాహనాల)కుఫిట్నెస్ పరీక్షలతో పాటు గ్రీన్ టాక్స్‌ను రవాణాశాఖ విధిస్తుంది. పేరుకు నిబంధనలు ఉన్నా ఇలాంటి వాహనాలను తనిఖీలు చేయడం లేదు, రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఫిట్నెస్ సమస్య, కాలుష్యం అధికంగా వెదజల్లే కాలం చెల్లిన వాహనాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో కూడిన (జిహెచ్ఎంసి) పరిధిలో 23,86,641అంటే 57శాతానికి పైగా ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితుల నుంచి బయటపడడానికి ఈమధ్య రవాణాశాఖ 'స్క్రాప్ పాలసీ'ని తీసుకువచ్చింది. కాలం చెల్లిన వాహనాన్ని ఇస్తే కొత్త బండి జీవిత పన్ను, త్రైమాసిక పన్నుపై నిర్ణీత శాతం మినహాయింపు ఇస్తామని పేర్కొంది. అయితే ఈ తుక్కు విధానం స్వచ్ఛందమేనట. ఇలాంటి వాహనాలతో తలెత్తే సమస్యను వీలైనంత తగ్గించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తుందని తెలుస్తోంది. 15ఏళ్లు దాటిన వాహనాల్ని రోడ్లపై తిరగనీయకుండా ప్రత్యేక విధానం తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన (ఏఎంవిఐ)ల నియామకపత్రాల పంపిణీ కార్యక్రమాలు చెప్పారు. కాలం చెల్లిన వాహనాల



విషయంలో ఢిల్లీ ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి విధానంఉందో సాధకబాధకాలు ఏంటో అన్న విషయంపై దృష్టి పెట్టనున్నట్లు రవాణా శాఖలో కీలక అధికారులు అంటున్నారు. గ్రీన్‌టాక్స్ పెంచడంతో సహా పలు ఇతర ప్రతిపాదనలపై చర్చిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రంలో కాలం చెల్లిన వాహనాల సంఖ్య భారీగా పెరిగిపోతుంది. అన్నిరకాలవి కలిపి అక్టోబర్ ఆఖరి నాటికి ఏకంగా 41.86లక్షల వాహనాల జీవితకాలం ముగిసింది. ఇందులో ద్విచక్ర వాహనాలే ఏకంగా 31.36లక్షలు(75.38)ఉన్నాయి. ఆ తర్వాత అన్నిరకాల కార్లు కలిపి 5,53,777 ఉన్నాయి. రాష్ట్రంలో రహదారి ప్రమాదాల్లో నిత్యం 20మంది చనిపోతున్నారు. ఈ ప్రమాదాల్లో ఫిట్‌నెస్ లేని వాహనాల ప్రభావం కూడా ఉంది. ఈ నేపథ్యంలో 15ఏళ్లు దాటిన వాహనాల విషయంలో ప్రభావవంతంగా ఉండేలా తాజాగా నూతన విధానం తీసుకుని రావడంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించింది. ఈ పరిణామం అభినందనీయమే అయినప్పటికీ రవాణా వాహనాలు సాధారణంగా ఎనిమిదేళ్ల వరకే ఫిట్‌గా ఉంటాయి. కానీ రాష్ట్రంలో ఏకంగా 4.15లక్షల రవాణా వాహనాలు 15ఏళ్లు దాటినా రోడ్ల పైన తిరుగుతున్నాయి. రవాణా వాహనాలు 15 ఏళ్లు దాటినవి ఆటో రిక్షాలు: 1,14,933, కాంట్రాక్టు క్యారేజీలు 4,375, బడి,కళాశాల బస్సులు 5,824, గూడ్స్‌క్యారేజీలు 1,81,387, మ్యాక్స్ క్యాబులు 4,609, మోటార్ క్యాబ్లు 24,111, ప్రైవేట్‌సర్వీస్ వాహనాలు 1,542, ఇతర వాహనాలు4,683, స్టేజి క్యారేజీలు 6,869, ట్రాక్టర్లు, ట్రైలర్లు 66,787, జీవితకాలం దాటినవి రవాణా వాహనాలు, 4,15,131, వ్యక్తిగత వాహనాలు 37,71,606, ఇక 15ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాలు ఆటో రిక్షాలు 1,026, కార్లు 5,25,057, మోటార్ సైకిల్ 31,36,599, ఇతర వాహనాలు, 24.904ట్రాక్టర్లు, ట్రాలర్లు 84,020. ఇలా జీవితకాలం దాటిన, 15ఏళ్లు దాటిన వాహనాలపై కాలయాపన చేయకుండా కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరగకుండా గ్రీన్‌టాక్స్ పెంపుతోసహా కాలం చెల్లిన వాహనాల 'స్క్రాప్ పాలసీ' ప్రతిపాదనలు కఠినతరం చేయాల్సిన అవసరంఉంది. మనిషి వస్తు వినిమయ ప్రపంచంలో జీవిస్తున్నప్పటి వాటి జీవితకాల పరిమితి మేరకే వాడుకోవాలి. అంతకంటే ఎక్కువకాలం వాడుకుంటే సభ్యసమాజానికి, పర్యావరణానికి పూడ్చలేని నష్టం చేసినవారవుతారు. నిజ జీవితంలో బాధ్యతగా ఉండటం ప్రధాన కర్తవ్యంగా భావించాలి. కానీ చాలామంది ఇతరుల బాధ్యతలను గుర్తుచేస్తారు. కానీ ఎవరి బాధ్యతలను వారు తూ.చ తప్పకుండా అమలు చేయాలనే సోయి చాలా అవసరం. ఈ నిర్ణయం వల్ల పర్యావరణంలో కాలుష్యాన్నితగ్గించడం. అలాగే ప్రతినిత్యం జరిగే ఫిట్నెస్‌లేని వాహనాల ప్రమాదాలకు అడ్డుకట్ట వేయబడుతుంది. ఈ మానవ నిర్లక్ష్యానికి తోడు ప్రభుత్వాల ఉదాసీనత వీడి వెంటనే పాలకులు, పాలితులు కట్టుదిట్టమైనకార్యాచరణతో కాలం చెల్లిన వాహనాలు రోడ్లపైన తిరగకుండా ఉంటేనే సమాజ పర్యావరణ హితాన్ని కోరుకున్న వారవుతారు. •

గుంటూరు వార్త

## ముక్కోటి ఉత్సవ పోస్టరు ఆవిష్కరణ

**మంగళగిరి,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జనవరి 10వ తేదిన ముక్కోటి ఉత్సవాల వాల్‌పోస్టర్లు ,ఆహ్వాన పత్రికలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆవిష్కరించారు.కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఏ.రామకోటి రెడ్డితో పాటు అర్చకులు,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## పోలి పాడ్యమి పూజల్లో పాల్గొన్న
## ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

**వినుకొండ,డిసెంబర్2,ప్రభాతవార్త:** పట్టణంలోని కొత్తపేటలోని శ్రీ మహాగణపతి దేవాలయం నందు పోలి స్వర్గం పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ



ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాటు చేసిన కొలనులో దీపం వెలిగించి అరటిదొప్పలపై పెట్టి వదిలారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రశాంతతతోపాటు నైతికత పెరుగుతుందని ఆధ్యాత్మిక విజ్ఞానం అలవర్చుకోవడం ప్రతి ఒక్కరికీ చాలా అవసరని ఎమ్మెల్యే జీ.వీ అన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంధం కోటేశ్వరరావు, పి.వి సురేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మనాయుడు ఆశయాలను కొనసాగిద్దాం

- పల్నాటి వీరారాధనోత్సవాల్లో ఘనంగా చాపకూడు - చాపకూడులో ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు

**కారంపూడి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** కులమతాలకు అతీతంగా పల్నాటి బ్రహ్మనాయుడు ఆనాడే చాపకూడు సిద్ధాంతం ద్వారా అందరూ సమానమనే భావనతో చాపకూడు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బ్రహ్మనాయుడు ఆశయాలను నేటికీ కొనసాగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 900 సంవత్సరాలుగా నిరంతరాయంగా చాపకూడు కార్యక్రమం కొనసాగుతుందని, హరిజనులను ఆలయ ప్రవేశం చేయించి సహపంక్తి భోజనలు (చాపకూడు) ఏర్పాటు చేసిన మహోన్నతుడు బ్రహ్మనాయుడు అని అన్నారు. మాల కన్నమదాసును సర్వ సైన్యాధ్యక్షుడిగా చేసిన ఉదాత్తపురుషుడు బ్రహ్మన్న అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ దైవాలకు పూజలు చేయడం ప్రపంచంలో రోమ్ నగరం తర్వాత మనదేశంలోని పల్నాడు ప్రాంతంలో కారంపూడిలో మాత్రమే దైవాలకు పూజలు జరుగుతాయన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పల్నాటి చరిత్ర భావితరాలకు అందించే విధంగా పల్నాటి ప్రాంత ప్రజలు కృషి చేయాలన్నారు. పల్నాడుకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ పల్నాడు పేరు వింటేనే రోమాలు నిక్కపొడుచుకుంటాయన్నారు. ఇక్కడి చరిత్రను పదికాలాల పాటు పదిలంగా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం ఆర్థికంగా వెనుకబడి ఉన్నా విశిష్టతకు మాత్రం పేరుగాంచిందన్నారు. బ్రహ్మనాయుడు- నాయకురాలు నాగమ్మ చరిత్రలో నిలిచిపోయారన్నారు. చెన్నకేశవ స్వామి దేవాలయం వీర్ల అంకాలమ్మ దేవాలయం, వీర్ల దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఆనాడు యుద్ధ వీరుల చిహ్నాలను చూసి కన్నమదాసు భైరవఖడ్గం చేత పట్టుకున్నారు. కులామతాలకు అతీతంగా జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొని భోజనం చేశారు. చాపకూడుకు హాజరైన ప్రజలు వడ్డన చేశారు. అనంతరం వీర్ల దేవాలయ సమీపంలో రైతు సంఘం ఆధ్వర్యంలో మూడోరోజు జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శనలో పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీఎస్పీ జగదీష్, తహశీల్దారు పుల్లారావు, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి ఈఓపీఆర్డీ, కసిన్యానాయక్, సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్సై వాసు, తెదేపా నేతలు మండల పార్టీ అధ్యక్షులు ఉన్నం లక్ష్మీనారాయణ, పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము, గోళ్ల సురేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ రమావత్ నాగులునాయక్, ఇన్‌ఛార్జి సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్, గోరంట్ల నాగేశ్వరరావు, తుపాకుల చినరత్తయ్య, జాస్తి గంగారావు, మునుగోటి సత్యం, చప్పిడి రాము, జనసేన నియోజకవర్గ కన్వీనరు బూసా రామాంజనేయులు, కేసానుపల్లి కృష్ణబాబు, రైతు సంఘం నేతలు బొమ్మిన శేషగిరి, తోట నరసింహారావు, జక్కా నరసింహారావు, మొద్దీన్‌సా తదితరులు పాల్గొన్నారు.



## వర్సిటీ విద్యార్థుల ఫారెస్ట్ స్టడీ టూర్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,డిసెంబర్ 2,ప్రభాతవార్త : వర్సిటీలోని ఎమ్మెస్సీ ఫారెస్ట్ విభాగం విద్యార్థులు ఫారెస్ట్ స్టడీ టూర్‌ను పూర్తిచేశారు. ఈ స్టడీ టూర్‌లో ప్రకృతి పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ అవగాహన పెంపొందించడానికి ఒకప్రత్యేకమైన అవసరాన్ని అందించినట్లు విభాగాధిపతి ఆచార్య మల్లికార్జున తెలిపారు. విద్యార్థులకు ప్రకృతి మార్పులు, పర్యావరణ రక్షణ విధానాలు, సమగ్ర జంతు సంరక్షణపై కొత్త అవగాహనను అందించినట్లు పేర్కొన్నారు. ఈ టూర్‌లో ప్రకృతిని మరింత దగ్గరగా తెలుసుకోవడం, పర్యావరణ మార్పులు, అరణ్యాల రక్షణపై మనపాత్రను అర్థం చేసుకోవడం కోసం ఒక గొప్ప అవకాశం మిగిల్చిందన్నారు.

# నాణ్యమైన రహదారులే కూటమి ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర రోడ్లు రవాణాశాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి

చిలకలూరిపేట,డిసెంబర్2,ప్రభాతవార్త: గుంతలు లేని నాణ్యమైన రహదారులను ఏర్పాటుచేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రవాణాశాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మరమ్మత్తులు జరుగుతున్న రహదారులను పరిశీలించిన అనంతరం ఆయన మండలంలోని యడవల్లి గ్రామం టిడిపి కార్యాలయంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నరసరావుపేట చిలకలూరిపేట రోడ్డు విస్తరణపై మంత్రి దృష్టికి నేతలు తీసుకురాగా ఆయన పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో రూ5కోట్లతో 109 కిలోమీటర్లమేర 10 పనులు చేపట్టినట్లు ఆయన తెలియచేశారు. చిలకలూరిపేట నరసరావుపేట రోడ్డును 4లైన్లుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఈ రోడ్ల విస్తరణ ప్రతిపాదనను తమ దృష్టికి



తీసుకువచ్చారని తెలియచేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట మార్గం అభివృద్ధి చెందితే రాయలసీమ వాసులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కోటప్పకొండను దృష్టిలో పెట్టకుని, ఈ మార్గంలో ట్రాఫిక్ పెరగటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని అన్నారు. దానికి పరిష్కారంలో బాగంగా ఈ రోడ్డును అభివృద్ధి చేయనున్నామని తెలపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా రాష్ట్రంలో రోడ్ల మరమ్మత్తులు నిర్వహించిగుంతల లేని రహదారులను చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ నెల్లూరి సదాశివరావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు ఎస్ఎస్ సుభాని, యర్రమాసు రవి, కక్కెర నాగేశ్వరరావు, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం

**గుంటూరు కలెక్టరేట్,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లక్ష ఇళ్ళు గృహప్రవేశాలకు జిల్లాకు నిర్ధేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ళు డిసెంబర్15 నాటికి పూర్తి చేసేలా పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి



అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి అభివృద్ధి,సంక్షేమ పథకాలపై ప్రత్యేకాధికారులు ,మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడివోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిసెంబర్ మూడవ వారంలో రాష్ట్రంలో పిఎంఎవై ద్వారా నిర్మించిన లక్ష గృహాలు ఒకేసారి ప్రారంభించనున్నారని దీనిలో జిల్లాలో 4,452ఇళ్ళ నిర్మానం పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికే 2400ఇళ్ళు పూర్తయ్యాయన్నారు. మిగతా 2052ఇళ్ళు నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తిచేసేలా కమీషనర్లు, ఎంపిడివోలు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పర్యవేక్షణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రెయిన్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా విద్యాశాఖ, పంచాయితీ అంగన్‌వాడీ వైద్యఆరోగ్యశాఖ సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లో మెగా పేరేంట్స్, టీచర్ మీటింగ్ నిర్ధేశించిన మార్గదర్శకాల ప్రకారం డిసెంబర్ 7వ తేదిన ఘనంగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు .గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం పూర్తిచేసి ఆన్‌లైన్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం రక్షిత నీరు సరఫరా వివరాలు పిఆర్‌యాప్ లో నమోదయ్యేలా ఎంపిడివోలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఓ శేషశ్రీ, హౌసింగ్ పిడి ప్రసాద్, ఐసిడిఎస్ పిడీ ఉమాదేవి, జిల్లా ఉధ్యానవనశాఖాధికారి రవీందర్ బాబు, విభిన్న ప్రతిభావంతుల ఏడి సువార్త, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, డిసిపిఓ విజయకుమార్ పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు నాయుడు పర్యటన
## విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసేలా ఉండాలి
## - కోన శశిధర్

**బాపట్ల, నవంబర్02,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమం విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసేలా ఉండాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్



అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కోన శశిధర్, కమీషనర్ వియరామరాజు, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థుల తల్లి దండ్రులు, టీచర్ల సమావేశం నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశానికి ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాలలో కలియ తిరిగారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతోనూ మాట్లాడారు. విద్యారునదల ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చా కార్యక్రమంపై సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంనరతి హాజరయ్యే విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శశిధర్ అన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు కేవలం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులను మాత్రమే పాఠశాలలోకి అనుమతించాలన్నారు. ఇతరులను అనుమతించరాదన్నారు. తల్లిదండ్రుల సమావేశానికి ఆహ్వాన పత్రికలను విద్యార్థులే సిద్ధం చేస్తున్నారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సృఝునాత్మకతతో విద్యారునదలు తయారుచేసిన ఆహ్వాన పత్రికలను సచివాలయాల సిబ్బంది తలిదండ్రులకు అందజేస్తారని అన్నారు. విద్యార్థులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం జయప్రదం చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంద న్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాట్లను ప్రిన్సిపల్ సెక్రటరీ కి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బుడా చైర్మన్ రాజశేఖర్ బాబు, అన్నిశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిర్యాదులు సక్రమంగా పరిష్కరించకుంటే క్షేత్రాధికారితో పాటు
## జిల్లా అధికారులకు మెమోలు: కలెక్టర్ నాగలక్ష్మీ

**గుంటూరు కలెక్టరేట్,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అందించిన ఫిర్యాదులను సక్రమంగా పరిష్కరించకుంటే క్షేత్రాధికారితోపాటు సంబంధిత జిల్లా అధికారికి కూడా మెమోలు జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి గంగరాజు, గుంటూరు ఆర్డివో కె.శ్రీనివాసరావు ప్రజల నుండి 153ఫిర్యాదులు స్వీకరించారు. ఈ వేదిక ద్వారా ప్రజలనుండి అర్జిలుస్వీకరించి అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జిని నాణ్యతతో పరిష్కరించాలన్నారు. సక్రమంగా పరిస్కరించుకుండా అసమగ్ర సమాచారంతో ఫిర్యాదీకి వివరాలు పంపి పిటిషన్ క్లోజ్ చేస్తే సంబంధిత క్షేత్ర సిబ్బందితో పాటు జిల్లా అధికారికి మెమో జారీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు ప్రతి సోమవారం పిజిఆర్ఎస్‌కు హాజరు కావాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆయా అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరుగుతుందన్నారు. శాఖలవారీగా పెండింగ్ ధరఖాస్తులు సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ సమీక్షించారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయని వారు డిసెంబర్ 5వ తేదీలోపు డ్రాఫ్టు కౌంటర్ సమరి ్పంచాలన్నారు. సమావేశంలో సిపిఓ శేషశ్రీ, డిఆర్‌డిఓ డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు విజయలక్ష్మీ, శంకర్, జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు, గ్రౌండ్‌వాటర్ డిడి వందనం, డిఎస్ఓ కోమలి పద్మ, డిఈఓ రేణుక, డిడి సోషల్ వెలే ్ఫర్ మధుసూదనరావు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## అర్జీలను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలి : బాపట్ల జిల్లా ఎస్పీ

**బాపట్ల, నవంబర్02,ప్రభాతవార్త:** అర్జీలను వేగవంతంగా విచారించి చట్టపరిధిలో నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సమస్యలు, అత్తారింటి వేదింపులు, ఆర్థిక మోసాలు,



భూవివాదాలు ఇతర పలు రకాల సమస్యలను చెప్పుకోవడానికి అర్జీదారులు జిల్లా నలుములల నుండి పిజిఆర్ఎస్ కార్యక్రమానికి విచ్చేశారు. ఎస్పీ వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని అర్జీలను క్షుణంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి అర్జీలను వేగవంతంగా విచారించి చట్టపరిదిలో నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

# హడలిపోతున్న అన్నదాతలు

-ప్రారంభం నుంచి వెంటాడుతున్న వర్షాలు
-పంటలను కాపాడుకునేందుకు రైతన్నల పాట్లు
-క్షణం క్షణం భయంతో వణుకుతున్న కర్షకులు

**పొన్నూరు, డిసెంబర్ 2,ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతి కొస్తుందో...రాదో...తెలియని పరిస్థితిలో రైతున్నలు అల్లాడుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి అన్నదాతలను వర్షాలు వెంటాడుతున్నాయి. విత్తు విత్తిన నాటి నుండి తుఫానులు...అతి వృష్టి....ఒకవైపు వరదలతో రైతులు అల్లాడుతున్నారు. గతంలో తుఫానులు డిసెంబర్, జనవరి నెలల్లో మాత్రమే వచ్చేవి. అయితే ఈ సంవత్సరం ఆరంభం నుంచే తుఫానులు రైతన్నలను అల్లాడిస్తున్నాయి. దీంతో తుఫాన్ అని పేరు వినగానే అన్నదాతలు హడలిపోతున్నారు. పంట చేతికొచ్చే ప్రస్తుత తరుణంలో తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు పంట ఏమైపోతుందోనన్న భయాందోళనలు రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట కోత కొచ్చింది. పొన్నూరు మండలంలో 27వేల ఎకరాల్లో వరిపంట వేశారు. ప్రస్తుతం మూడు వేల ఎకరాల్లో పంట కోత కోశారు. ప్రభుత్వం కూడా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మండలంలో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండలంలో మొత్తం 10రైస్ మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టింది. తేమశాతం 17కన్నా తక్కువ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 3,042క్వింటాళ్ళ ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు గణాంకాలు చెప్తున్నాయి. ప్రస్తుతం రైతులు పొలాల్లో కోతలను కోయవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం తుఫాను ప్రభాంతో వర్షాలు కురుస్తున్న వేళ కోతలు కోస్తే నష్టపోయే ప్రమాదముందని వ్యవసాయాధికారులు రైతులకు హెచ్చరికలు జారిచేస్తున్నారు. అయితే ఇప్పటికే కొంత మంది కోసి వరిని కాపాడుకునేందుకు రోడ్లపైనే పోసి ఆరబెట్టుకొంటున్నారు. ఇదే సమయంలో చిరు జల్లులు పడుతుండడంతో వర్షానికి తడవకుండా టార్పాలిన్ పట్టాలను కప్పి కంటికి రెప్పలా కాపాడుకొంటున్నారు. ఏది ఏమైనా రైతన్నలు మాత్రం వర్షాల ధాటికి హడలిపోతున్నారన్నడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు లేకుండా



కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం రైతులు కష్టపరిస్థితుల్లో ఉన్నారని, వారికి చేయూతనివ్వాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని చెప్తున్నారు.

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక
## హజరత్ సుభాని జెండాపండుగ
### -మాజీ మంత్రి ఆలపాటి

**తెనాలి, డిసెంబర్ 2 (ప్రభాతవార్త) :** భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే మన సంస్కృతిలో హజరత్ మాబు సుభాని గార్మీ పండుగను నిర్వాహకులు, నిర్వహించే తీరు



హర్షనీయమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు అభినందలు తెలిపారు. స్థానిక నందులపేట, టిఎమ్‌సి క్లబ్ రోడ్డులో సోమవారం రాత్రి షేక్ నసీమ్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన హజరత్ మాబు సుభానీ, గార్మీ పండుగలో మాజీ మంత్రి ఆలపాటి ఆత్మీయ అతిధిగా పాల్గొనగా, ముస్లిమ్ సోదరులు ఆలపాటిని సాదరంగా స్వాగతించి వారి సంప్రదాయ టోపీ అలంకరించి తమ ఆనందం చాటుకున్నారు. ఉత్సాహ భరితంగా నిర్వహించిన జెండా పండుగ నిర్వాహకులకు, మాజీ మంత్రి ఆలపాటి తమదైన శైలిలో పండుగ ప్రాధాన్యతు వివరిస్తూ అభినందలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ తోషి, షేక్ తాజ్, షేక్ మునీర్, మిత్ర మండలితో పాటుగా పార్టీ నాయకులు మహ్మద్ ఖుద్దూస్, ఈదర వెంకట పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE
HON'BLE III JUNIOR CIVIL
JUDGE, CITY CIVIL COURTS,
AT: HYDERABAD.
O.S.NO. 2725 OF 2024
BETWEEN:
STATE BANK OF INDIA
...PLAINTIFF
AND
VAMSI KRISHNA GOTTIPATI
...DEFENDANT
To,
VAMSI KRISHNA GOTTIPATI,
S/o. C Laxmaiah, Aged about 33 years, Occ: Self Employed, D.No. 4-59, Pasumarru, Chilakaluripeta, Guntur-522 616. Mob.9052224546
NOTICE
Please take notice that the Plaintiffhad filed the above suit for Recovery for Money against you. The Hon'ble Court had posted the above suit on **20.12.2024** for your appearance.
Hence make it convenient to appear before the Hon'ble Court on **20.12.2024 at 10:30 A.M** either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of law.
Hence, this NOTICE.
[BY ORDER OF THE COURT]
VEERA SHIVA KUMAR
ADVOCATE
Off: # Flat No.104, 1st Floor, Agarwal Towers, H.No.2-3-703/2/A, Thirumala Nagar, Amberpet, Hyderabad-500013.
Mob. No: 9154450333

## వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏఎన్‌యు క్రీడాకారునికి కాంస్య పతకం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** వర్సిటీలో జరుగుతున్నఅంతర్ విశ్వవిద్యాలయాల సౌత్ వెస్ట్‌జోన్ పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మూడవరోజు వర్సిటీ క్రీడాకారుడు కాంస్య పతకం గెలుపొందారు. పోటీల మూడవరోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పిపిఎస్ పాల్‌కుమార్ వెల్లడించారు. 96కేజీల కేటగిరిలో మధురై కామరాజ్ యూనివర్సిటీ క్రీడాకారుడు అశ్లీన్ 300కేజీల బరువులు ఎత్తి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. తిరవల్లూరు యూనివర్సిటీ క్రీడాకారుడు జే.దీర్షన్ 298కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని కైవశం చేసుకున్నాడు. నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడాకారుడ ఏ.అరునేష్‌బాబు 297కేజీల బరువులెత్తి కాంస్య పతకం సాధించాడు. 102కేజీల విభాగంలో సావిత్రిభాయి పూలే యూనివర్సిటీ క్రీడాకారుడు వైష్ణవ్ సాహసి ఠాకూర్ 321కేజీల బరువులెతి బంగారు పతకాన్ని గెలుపొందారు. బెంగళూరు సిటి యూనివర్సిటీకి చెందిన క్రీడాకారుడు 311కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని గెలుచుకున్నారు. కొల్హాపూర్ లోని శివాజీ యూనివర్సిటీ క్రీడాకారుడు రాజేంద్ర 306కేజీల బరువులెత్తి కాంస్యపతకం సాధించాడు.



## రోడ్డు మరమ్మత్తుల పనులు పరిశీలించిన రాష్ట్ర రోడ్లు రవాణాశాఖా మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

**చిలకలూరిపేట, డిసెంబర్2, ప్రభాతవార్త:** చిలకలూరిపేట కోటప్పకొండ రహదారిలో జరుగుతున్న మరమ్మత్తు పనులను సోమవారం రాష్ట్ర రోడ్లు రవాణాశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి మండలంలోని యడవల్లి గ్రామం వద్ద పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులతో సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్‌రెడ్డిని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లాలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యర్రమాసు రవీంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మతిస్థిమితం లేని తమిళనాడు యువకుడిని కుటుంబానికి అప్పగించిన రూరల్ పోలీసులు

నరసరావుపేట క్రైం, డిసెంబర్2 ప్రభాతవార్త : నరసరావుపేట రూరల్ పోలీసులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం రూరల్ ఎస్.ఐ. సి.హెచ్.కిషోర్ వివరాలను తెలియజేశారు. లలితాదేవి కాలనీలో మతిస్థిమితం లేని యువకుడిని గుర్తించడం జరిగిందన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా తెలుసుకొని ఫోన్ నెంబర్ ద్వారా వారి కుటుంబ పెద్దలకు తెలియజేయడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు లోకనాథం పోలీసులు ఇచ్చిన సమాచారంతో నరసరావుపేటకు చేరుకొని సదరు యువకుడిని తమ రాష్ట్రానికి తీసుకెళ్లారు.



## సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన

**వినుకొండ, డిసెంబర్2, ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 15వ వార్డు నందు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.13.71 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే జీ.వీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు సోమవారం శంకు స్థాపనలు చేశారు. భూమి పూజ చేసి శిలాఫలకాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ రాష్ట్రమంతటా క్లీన్ అండ్ గ్రీన్ సాధించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. పట్టణాలు, పల్లెల్లో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. సంపదసృష్టి కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం సమర్ధవంతమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణంలోని ఎన్నెస్పీకాలనీ నందు పార్కు, స్టేడియం, టిటిడి కళ్యాణ మండపం, షాదీఖానా తదితర అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్ పి.వి సురేష్‌బాబు, జనసేన నాయకులు నిశ్శంకరావు శ్రీనివాసరావు, నాగశ్రీనురాయల్, తెదేపా నాయకులు సౌదాగర్‌జానీ, గంధం సుబ్బరావు, రియల్‌ఎస్టేట్ జానీ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి చేతివ్రాత పోటీలలో అవార్డులు సాధించిన వివిఐటి, వికాస్ స్కూల్ విద్యార్థులు

**చిలకలూరిపేట, డిసెంబర్2, ప్రభాతవార్త:** మహ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో జరిగిన చేతివ్రాత పోటీలలో పట్టణానికి చెందిన వివిఐటి వికాస్ స్కూల్ విద్యార్థులు పాల్గొని జాతీయస్థాయి అవార్డులను స్వంతం చేసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయిలో రెండవ బహుమతి పాఠశాలకు చెందిన విద్యార్థిని చరణ్ సివంగికి మాజీ ఐపిఎస్ అధికారి ఎకె ఖాన్ బహుమతితో పాటు ట్యాబ్, బంగారుపతకం, సర్టిఫికెట్‌ను అందచేశారు. ఈ పోటీలలో షుమారు 30వేల మంది విద్యార్థులు పాల్గొనగా వివిఐటి స్కూల్‌నుంచి 12మంది విద్యార్థులు, వికాస్ స్కూల్ పెదనందిపాడు క్యాంపస్‌నుంచి 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలను సాధించారు. వివిఐటి స్కూల్‌కు చెందిన పి సహజ, సిహెచ్ రుత్విక్ శివసాయిగణేష్, చరణ్ సివంగి, యం దివ్యతేజస్విని, కె నిఖిల్, పి సాయిసహస్ర, టి శ్రీవల్లిక, కె శివదీక్షిత, ఎస్‌కె అర్హాన్‌ఉల్‌అయాన్, ఎ భవ్యశ్రీ, ఎస్‌కె షిఫా, షినాథ్, బి కుమారి దుర్గ, వికాస్ పాఠశాలనుంచి వి బాలా డేనియల్‌రాజన్, టి యాజ్ఞిత, వైపావని, డి రమ్య, యం కీర్తి ప్రణతి, వి యాచిక, వై హైందవి, యం సౌమ్య, కె సంజన, యం అక్షర, బి రేవతి, కె తుషారలు బంగారు పతకాలను సాధించారు. నవంబర్ 17నుంచి 20వ తేది వరకు దేశవ్యాప్తంగా మహ అకాడమీ తరుపున చేతి వ్రాత నిపుణులు వై మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో చేతివ్రాత పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాస్ స్కూల్ డైరక్టర్ దండా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్‌కు 6అర్జీలు

**పొన్నూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. అందులో రెండు సర్వేకి సంబంధించినవి కాగా మరో నాలుగు రేషన్ కార్డులు కోరుతూ అర్జీలను ఇచ్చారన్నారు. వచ్చిన అర్జీలను పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు పంపి పరిష్కరించేవిధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుమ్మా చంద్రశేఖరరావు, మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య, ఐసిడిఎస్ సిడిపిఓ ఎస్.వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.




## పల్నాటి వీరుల తిరునాళ్ళలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** పల్నాటి వీరుల తిరునాళ్ళ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పాల్గొన్నారు. సోమవారం జరిగిన మూడవ రోజు వేడుకలకు ఎమ్మెల్యే అరవింద్‌బాబు హాజరయ్యారు. చాపకూడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాటి యుద్ధానికి దేశంలోనే ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. కులాలు, మతాలు లేని సమాజాన్ని చూడాలని అప్పటి చాపకూడు కార్యక్రమం చెప్తుందన్నారు. వీరుల ఉత్సవానికి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు పల్నాటియుద్ధం తెలిపిన స్ఫూర్తిని అందించాల్సిన అవసరం అందరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు.



## అవార్డులు పొందిన సిబ్బందికి అభినందన

**చిలకలూరిపేట, డిసెంబర్2, ప్రభాతవార్త:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకుగాను అవార్డులు పొందిన చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిని సోమవారం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మీకుమారి, నోడల్ అధికారి అమృతవల్లిలు అభినందించారు. ఐసిటిసి కౌన్సిలర్ కె హనుమంతురావు, ఉత్తమ ల్యాబ్‌గా టెక్నీషియన్ వంశీకృష్ణ, ఎఆర్‌టి కౌన్సిలర్ మల్లీశ్వరి, ఎఆర్‌టి డేటా మేనేజర్ అనిత, ఎఆర్‌టి ల్యాబ్ టెక్నీషియన్ జైశ్రీలు అవార్డులు పొందారు.



## శ్రీ దత్త సూపర్‌స్పెషాలిటి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ఈపూరు, డిసెంబర్2, ప్రభాతవార్త:** వినుకొండ పట్టణం నందు గల శ్రీ దత్త సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈపూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణం నందు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈపూరు ఎస్సై ఉమామహేశ్వరరావు, జెడ్పి స్కూలు హెచ్ఎం రామకృష్ణారెడ్డి, మండలంలోని పలువురు నేతలు ఈ కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. 450 మందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, స్త్రీలకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, డాక్టర్ అభిషేక్, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ హరికృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో దేవాలయ 16వ వార్షికోత్సవం

పొన్నూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త: మండల పరిధిలోని తాళ్ళపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ విజయ గణపతిస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి వారి దేవాలయంలో దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. శాశ్విత చందాదారుల పేర్లమీద గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమ న్వయకర్త అంబటి మురళీకృష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి చుండూరు వీరయ్య పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులందరికీ తీర్థప్రసాద్ వినియోగం జరిగింది. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చుండూరు పిచ్చయ్య, యేపూరి వీరబాబు, ఆలయ కార్యవర్గం ఏర్పాట్లు చేశారు.



## కూటమి నాయకులు, పోలీసులు అక్రమ కేసులతో వేధిస్తున్నారు : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, డిసెంబర్2 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో కూటమి నాయకులు, పోలీసులు అక్రమ కేసులతో వేధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికకు హాజరై సమస్యలను పరిష్కరించాలని జేసి సూరజ్‌కు వినతిపత్రాన్ని పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. రామిరెడ్డిపాలెంలో ఆ ఊరికి సంబంధించిన ఆర్చి, స్మశానవాటిక కాంపౌండ్ వాల్ వివాదంలో వైకాపా వారిపై కేసులను పెట్టించడం జరిగిందన్నారు. 2019 నాటి కేసును కోర్టు కొట్టివేయడం జరిగిందన్నారు. అయితే తిరిగి ఇప్పటి ప్రభుత్వ పెద్దలు పోలీస్‌స్టేషన్‌కు పదేపదే పిలిపించి మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. అదే విధంగా కర్లకుంట గ్రామంలో సచివాలయ భవన నిర్మాణానికి పంచాయితీ నుండి నిధులు మంజూరైనప్పటికీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి 5వతేదీన నామి నేషన్లు, 8వతేదీన ఎన్నికలు ఉంటే ఇంతవరకు అధికారులు ఓటర్ లిస్టును తమకు ఇవ్వలేదని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారుల్లో స్పందన లేదన్నారు. రేషన్ బియ్యాన్ని నియోజకవర్గానికి పాటలు పెట్టి మరీ కూటమి నాయకులు దోచుకుంటున్నారని, ఇప్పటికైనా నాటకాలు ఆపి పేద ప్రజలకు నిత్యావసర సరుకులను అందించాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి కోరారు.



## యూటిఎఫ్ జిల్లా కార్యవర్గంలో నూజెండ్ల ఉపాధ్యాయులు

**వినుకొండ, డిసెంబర్2, ప్రభాతవార్త:** యూటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నర్సరావుపేట ఎస్ఎస్ఎన్ కాలేజి నందు జరిగాయి. నూతన కార్యవర్గంలో జిల్లా కోశాధికారిగా నూజెండ్ల మండల ఉపాధ్యాయులు ఎం. రవిబాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అజయ్‌కుమార్‌ను ఎన్నుకోవడం జరిగిందని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో అభినంద సభ నిర్వహించారు.




## ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ప్రతిభావంతుల అధ్యక్షులు

**రాజుపాలెం, డిసెంబర్2 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు షేక్.మహబూబ్ సుభాని కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడారు. దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేల నుండి రూ.6 వేలకు పెంచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మూడు చక్రాల స్కూటర్లు, ఇళ్ళ స్థలాలు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం చక్కగా ఉందని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే మక్కెన ఆధ్వర్యంలో దీక్షాస్వాములకు సద్ది వితరణ

వినుకొండ, డిసెంబర్2, ప్రభాతవార్త: తెదేపా నాయకులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్థానిక పాత శివాలయం నందు అయ్యప్ప, శివ, భవానీమాత దీక్షలు తీసుకున్న స్వాములకు సద్ది వితరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మక్కెన పాల్గొని పూజలు చేశారు. అనంతరం స్వయంగా స్వాములకు, భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ కఠినమైన నియమ,నిష్ఠలతో కొనసాగే అయ్యప్ప, శివ, భవానీమాత దీక్షలు ఎంతో పవిత్రమైనవన్నారు. మాల ధరించిన స్వాములకు భగవంతుని ఆశీసులు మెండుగా ఉండాలని వారి కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో తులతూగాల ని కోరుకున్నారు. అలాగే స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆశించారు. ఈ సందర్భంగా మక్కెనను ఆలయ కమిటీ నిర్వాహక బృందం పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి, సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మక్కెన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




## తెదేపా నేత పేరయ్య సేవలు మరువలేనివి

### -ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

**ఈపూరు, డిసెంబర్2, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి సీనియర్ నాయకులు శాఖమూరి పేరయ్య అందించిన సేవలు మరువలేనివని ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు కొనియాడారు. మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన తెదేపా నేత శాఖమూరి పేరయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా సోమవారం జరిగింది. కార్యక్రమంలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు తదితర నేతలు హాజరై పేరయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

**పొన్నూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాళ్ళపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహా గణపతి దేవాలయంలో సోమవారం ప్రత్యేక హోమ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని అగ్నిదేవునికి హోమద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విఘ్నాలకు అధిపతి గణపతి అని ఆయన్ను పూజించడం వల్ల సర్వ విఘ్నాలు తొలగిపోతాయన్నారు. గ్రామంలో దేవాలయం నిర్మాణం చేసుకొనిప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. లోక కళ్యాణార్థం కూడా ఇలాంటి హోమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ వెంట నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, చలంశెట్టి సీతారామయ్య, గణిపిశెట్టి రామకృష్ణ, పోకల వెంకట శివ, చుండూరు పిచ్చియ్య, మానుకొండ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**పొన్నూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో తోడ్పడుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల గ్రామానికి చెందిన తాటిశేషమ్మకు రూ.70వేలు చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యం చేయించుకొనేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## మల్లయోధుడు సుబ్బారావు చిరస్మరణీయులు

**గుంటూరు విద్య, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** నగరానికి చెందిన మల్లయోధుడు దివంగతులు సుబ్బారావు చిరస్మరణీయులని ఏసుబాబు మాదిగ, పలువురు వక్తలు స్మరించారు. సోమవారం సుబ్బారావు వర్ధంతి కార్యక్రమం ఎమ్మార్పిఎస్ సిటి కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సుబ్బారావు సేవల గురించి మాట్లాడుతూ మనస్సున్న మంచి మనిషి మల్లయోధుడు సుబ్బారావు అని, ప్రజాసేవకు అంకితైన మహోన్నతమైన మానవతా విలువలు ఉన్న సహృయుడని పేర్కొన్నారు. దేశప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ఉన్నప్పుడు బిజెపి దళిత మోర్చాలో రాష్ట్ర నాయకులుగా పనిచేసిన సుబ్బారావు ఎందరో దళితుల స్థానిక సామాజిక ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కొరకు అహర్నిశలు పనిచేశారని గుర్తుచేశారు. గుంటూరు ఆంధ్ర ముస్లిం కళాశాల దగ్గరున్న కొన్ని స్థలాలను అప్పట్లో పేదలకు ఇప్పించిన ఘనత సుబ్బారావు కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఆ కాలనీని సాయిబాబా కాలనీగా పిలుస్తున్నారని గుర్తుచేశారు. పేదలకు ఆర్థిక చేయూతను ఇవ్వడం కొరకు, పేదలు వారి సొంతకాళ్ళపై వాళ్ళు నిలబడేందుకు చిన్న తరహా వ్యాపారాల ప్రోత్సాహం అందించడానికి ప్రభుత్వ పథకాలను వారి దరికి చేర్చి వారిని ఆర్థికంగా నిలబెట్టిన మహనీయమూర్తి దివంగతులు సుబ్బారావు అని కొనియాడారు. అప్పట్లో మల్లయోధుడు అంటే గుంటూరులో గుర్తుకు వచ్చేది సుబ్బారావు అనే విషయాన్ని మరచిపోకూడదన్నారు. ఎంతోమందికి శిక్షణ ఇచ్చి మల్లయోధులుగా తయారు చేసిన ఘనత సుబ్బారావుకే దక్కుతుందన్నారు. గతంలో ఈ పోటీలు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగాయని ఆ పోటీల్లో సుబ్బారావు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పేరు సంపాదించారని వక్తఉ గుర్తుచేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి ఆయన తనయుడు ఏసుబాబు మాదిగ కుటుంబసభ్యులు, వివిధ ప్రజాసంఘాల దళిత పౌర సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కెన ప్రభాకర్ మాదిగ, నగర అధ్యక్షులు సుబ్బయ్య మాదిగ, నగర ఉపాధ్యక్షులు గూడూరు విజయమాదిగ, వన్‌టౌన్ అధ్యక్షుడు బల్లారపు శ్యామ్‌మాదిగ, వన్ టౌన్ ఉపాధ్యక్షులు ఆరుమళ్ళ చెంచు మాదిగ, టూటౌన్ అధ్యక్షులు ఎనుబర్ల సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


అప్పటి కేంద్ర హోమ్‌శాఖ సహాయ మంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తున్న దివంగతులు మల్లయోధుడు సుబ్బారావు.

## ఆర్‌విఆర్ జేసి లో కొలరిడో-2024 పోస్టర్ ఆవిష్కరణ

**గుంటూరు విద్య, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** కళాశాల్లో డిసెంబర్ 27,28తేదీల్లో కొలరిడో-2024 పేరుతో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడల విభాగంలో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర వ్యహిస్తునట్లు ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొలరిడో-2024పోస్టర్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు సంబంధించిన వెబ్‌సైట్‌ను కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల సిబ్బంది, కల్చరల్ కమిటీ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.5లక్షల వరకు నగదు బహుమతులను, జ్ఞాపికలను, సర్టిఫికేట్లను అందించనున్నట్లు కళాశాల సెక్రటరీ, కోశాధికారుల తెలిపారు. విద్యారంగంలో విద్యార్థుల్లో నిత్యం నెలకొన్న పోటీతత్వంలో ఇలాంటి పోటీల్లో విద్యార్థులుపాల్గొనడం వారికి శారీరక మానసిక నూతన ఉత్తేజాన్ని కలుగచేస్తాయని, జాతీయస్థాయిలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు http://rvrjcce.ac.in/colorido2024/ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్‌కొల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం కిషోర్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.



## వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

**పొన్నూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాసం పూర్తి అయిన సందర్భంగా దేవాలయంలో స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. స్వామివారి అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. దేవాలయం అర్చకస్వామి విజితేంద్ర పూజాధికార్యక్రమాలను నిర్వహించారు. మూలవిరాట్‌ను, ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయంలో పెద్ద ఎత్తున కూర్పర జ్యోతి వెలిగించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.



## చిప్స్‌లో జాతీయ పొల్యూషన్ నివారణ దినోత్సవం వేడుకలు

**గుంటూరు విద్య, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** చిప్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పొల్యూషన్ నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర తెలిపారు. కార్యక్రమానికి గుంటూరు రీజనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఎం.డి.నజీనాబేగం ముఖ్యఅతిధిగా హాజరై, ప్రసంగిస్తూ భోపాల్ గ్యాస్ విడుదల సమయంలో జరిగిన నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విధివిధానాలను, దాని ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రకృతిని కాపాడుకోవడం మన ధర్మాల్లో ముఖ్యమైన ధర్మమని అందుకోసం నెలలో ఒకరోజు ప్రకృతి హితమైన కార్యక్రమాల్లో పాల్గొని పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్ధిని విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికేట్లు కూడా అందజేయడం జరిగింది.



## ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి : పల్నాడు జిల్లా కలెక్టర్

**నరసరావుపేట, డిసెంబర్2 (ప్రభాతవార్త):** ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి సూరజ్‌తో కలిసి మొత్తం 39 ఫిర్యాదులను అర్జీల రూపంలో స్వీకరించారు. ప్రతి సమస్యను సావధానంగా విని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిశాఖల అధికారులు వచ్చిన ప్రతి అర్జీపై వారికి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు.



**మాజీ సైనికుల సంక్షేమం కోసం విరాళాలు ఇవ్వండి : కలెక్టర్**

మాజీ సైనికుల కుటుంబాల కోసం విరాళాలను అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వారికి నివాళులర్పించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికుల పునరావాస కార్యక్రమంలో భాగంగా వీరజవాన్లకు, వితంతువులను ఆదుకునేందుకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోర్, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రహదారులకు మహర్దశ : ఆర్‌అండ్‌బిశాఖామంత్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో రహదారులకు మహర్దశ వచ్చిందని ఆర్‌అండ్‌బిశాఖామంత్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు లు అన్నారు. సోమవారం మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామం వద్ద రోడ్ల మరమ్మత్తులను వారు పరిశీలించి మాట్లాడారు. రూ.861 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టామన్నారు. 935 కిలో మీటర్ల మేర మరమ్మత్తు పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని రాజుపాలెం నుండి అమరావతి వరకు ఉన్న 44.60 కిలో మీటర్ల రహదారిని వేగంగా నిర్మిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోడ్లు మొత్తం గుంటలమయంగా మారాయన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు పనులను ఆపివేయడం జరిగిందన్నారు. నరసరావుపేట - చిలకలూరిపేట మధ్య ఉన్న రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి వలన రాయలసీమకు దూరం తగ్గుతుందన్నారు. ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రోడ్ల అభివృద్ధిని చేపట్టినట్లు మంత్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబులు వివరించారు. వారి వెంట ఆర్డీవో మధులత, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదులను స్వీకరించిన పల్నాడు జిల్లా ఎస్పీ

**నరసరావుపేట క్రైం, డిసెంబర్2 (ప్రభాతవార్త):** పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వీకరించారు. మొత్తం 62 ఫిర్యాదులు తమకు వచ్చినట్లు అధికారులు తెలియజేశారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. సత్తెనపల్లికి చెందిన నజియాబేగం తమకు విడాకులు ఇవ్వకుండా తన భర్త మరొక వివాహం చేసుకుంటున్నాడని తెలిపారు. రామాంజనేయపురం గ్రామానికి చెందిన ఏలమ్మ తాను ఇంట్లో ఒంటరిగా ఉండగా దాడి చేయడంత పాటు తనకు చెందిన పొలంలోని పైరును నాశనం చేశారని ఫిర్యాదు చేశారు. పులిపాడు గ్రామంలో తమకున్న స్థలాన్ని మర్యాద బాబాయి కాజేశారని వడ్లమూడి భూలక్ష్మి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదును ఖచ్చితంగా పరిష్కరిస్తామని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలియజేశారు.



## విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల,నవంబర్02,ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు.స్థానిక బాపట్ల ఉన్నత పాఠశాలలో స్టూడెంట్స్ అసెంబ్లీకి కలెక్టర్ సోమవారం హాజరయ్యారు.అసెంబ్లీ కార్యక్రమంలో జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ ఎగరవేశారు.విద్యార్థుల నుంచి గౌరవ వందనం ఆయన స్వీకరించారు.తదుపరి విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగమును కష్టపడే చదివి క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు.మంచి పౌరులుగా ఎదిగే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు.ప్రతి మనిషికి బాల్యం బంగారం లాంటిదని అన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశం డిసెంబర్ 7వ తేదిన బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్,ఆర్డీవో,జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల నుండి వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

**బాపట్ల,నవంబర్02,ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులు ఆదేశించారు.సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ ఆక్రమణలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిశీలించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు.భూ ఆక్రమణలపై మండల స్థాయిలో అధికారులు ప్రతి గురువారం ప్రజలు అర్జీలు తీసుకొని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి గంగాధర్ గౌడ్,జిల్లా సహకార శాఖ అధికారి శ్యామ్ సన్,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా,జిల్లా ఉద్యాన శాఖ అధికారి జెన్నెమ్మ,మార్కెటింగ్ శాఖ ఏడి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## సెమీ క్రిస్మస్ కరపత్రమును ఆవిష్కరించిన వేగేశన నరేంద్ర వర్మ

**పిట్టలవానిపాలెం,నవంబర్02,ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మండలం నంగమానిపాలెం గ్రామం నందు క్రీస్తు నిరీక్షణ ప్రార్ధన మందిరము నందు సెమీ క్రిస్మస్ వేడుకలను మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సోపాటి ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదిన నిర్వహించనున్నారు.ఈ సెమీ క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన కరపత్రములను సోమవారం నాడు స్థానిక శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ ఈ కార్యక్రమమునకు శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మను ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు ఎల్ వెంకటపతి రాజు,సాంబమూర్తి రాజు మరియు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సర్పంచి వీరరాఘవమ్మ మృతిపార్టీకి తీరనిలోటు

**-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్**

**పొన్నూరు, డిసెంబర్ 2,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, నారాకోడూరు గ్రామ సర్పంచి తోట వీర రాఘవమ్మ అకాల మరణం పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. తోట వీరరాఘవమ్మ మృతి వార్త విన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ నారాకోడూరు వెళ్ళి వీర రాఘవమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.



## 8న విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు

**గుంటూరు కల్చరల్,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** స్థానిక సంపత్ నగర్ శ్రీరామనామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 8వ తేది ఉదయం 9గంటల నుండి పాఠశాల స్థాయి విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ఆర్.వి.లీలాసుందరి,మస్తాన్‌రావులు తెలిపారు.10సంవత్సల్లోపు విద్యారు ్థలకు దాశరథి శతకంలోని 46 నుంచి 60పద్యాల వరకు కంఠస్థ పాఠవ పోటీ 10నుంచి 15సంవత్సరాల వయస్సు కలిగిన విద్యారు ్థలకు భగవద్గీత మూడో అధ్యాయంలోని (కర్మయోగం) 1నుంచి 21వ శ్లోకాల వరకు,తులసీదాసు విరజిత హనుమాన్ చాలీసా కంఠస్థ పోటీలు,15సంవత్సరాల్లోపు విద్యార్థులకు భక్తి పాటల పోటీ,చిత్రలేఖనం పోటీలు జరుగుతాయన్నారు.ఇతర వివరాలకు నిర్వాహకులు బి.జయశంకర్ సెల్ నెంబర్ 9885790942లో సంప్రదించాలన్నారు.

## ఇందిరమ్మ కాలనీకి దారి చూపాలని తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేత

**దుర్గి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** దుర్గి పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారి చూపాలంటూ కాలనీ వాసులు సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వినపత్రాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే.. దుర్గిలోని సాయి బృందావనం అపార్ట్‌మెంట్ వెనుక భాగంలో కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, 80 అడుగుల బాట ఆక్రమణకు గురైందన్నారు. ఇందిరమ్మ కాలనీకి వెళ్లేందుకు బాట లేకుండా చేశారని, సర్వే చేయించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని, బాటను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో బీమా అంజయ్య, వి.శ్రీనివాసరావు, టి.కోటేశ్వరరావు, పి.నరసింహ తదితర కాలనీ వాసులు ఉన్నారు.



## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయకేంద్రం ఏర్పాటు

**దుర్గి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** రైతు సాధికార సంస్థ, ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయకేంద్రాన్ని స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ శాఖ ఏఓ అమీర్‌రెడ్డి తెలిపారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన పంటలతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. మందులు, రసాయనాలు వాడకుండా ప్రకృతి సేద్యంతో పండించిన పంటలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు, ఎంపీడీఓ పి.శివప్రసాద్, డివిజన్ ఎంటీ ఎం.వినోద తదితరులు పాల్గొన్నారు.



## పీఎస్ఆర్ ఆంజనేయులు సేవలు అభినందనీయం : యాగంటి

**మాచర్ల, డిసెంబరు 2 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలో మీనాక్షి నేత్రవైద్యశాల వ్యవస్థాపకులు పీఎస్ఆర్ ఆంజనేయులు సేవలు అభినందనీయమని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. స్థానిక పీఎస్ఆర్ కంటి వైద్యశాలలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతం అమృతలూరుకు చెందిన పీఎస్ఆర్ ఆంజనేయులు వైద్యరీత్యా అమెరికాలో స్థిరపడ్డారన్నారు. ఎంతో వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పలుమార్లు ఉచితంగా కంటి వైద్యశిబిరాలు నిర్వహించారన్నా రు. వైద్యం కోసం మాచర్ల, పరిసర ప్రాంతాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లలేక నానా ఇబ్బందులు పడేవారని, అలాంటి పరిస్థితుల్లో ఈ ప్రాంతంలో పేద ప్రజలకు ఆధునిక వైద్యాన్ని అందించేందుకు సుమారు రూ.2.5 కోట్లతో వైద్యశాలను మాచర్ల పట్టణంలోని నిర్మించారన్నారు. ఈ వైద్యశాలలో ఏడాదికి 5000 మందికి కంటి శుక్లాలకు వైద్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పేదల కోసం నిత్యం పాటుపడే పీఎస్ఆర్ ఆంజనేయులు సమాజానికి ఎంతో అవసరమన్నారు. వైద్యశాల ఏర్పాటు చేసిన నాటి నుంచి దాని అభివృద్ధి కోసం ఈ ప్రాంతానికి చెందిన చిరుమామిళ్ల కిష్టయ్య, చెరుకూరి నరసింహారావులు అహర్నిశలు చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఇప్పటికే అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని, వైద్యశాలలో ఇంకా మెరుగైన సేవలను ఈ ప్రాంత ప్రజలకు అందించేందుకు పట్టణ పరిధిలోని దాతలు ముందుకు వచ్చి వైద్యశాల అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, సంతోష్, ప్రసాద్, శ్రీనివాసరావు, సిండికేట్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి :ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు

**మాచర్ల, డిసెంబరు 2 ప్రభాతవార్త:** కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ మాచర్ల నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాచర్ల చిన విజయ్‌కుమార్ (రూబేను) అన్నారు. కులాన్ని కించపరిచేలా మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న యేసురాజును మాదిగ కులం వాడనుకొని చెప్పులు శుభ్రం చేయాలంటూ, మాదిగ కులాన్ని కించపరుస్తూ ఆవుల వెంకట్రామయ్య మాట్లాడారని ఆరోపించారు. అదేవిధంగా యేసురాజు యాదవ కులానికి చెందినవాడై మాదిగ కులం గురించి తక్కువగా మాట్లాడారని, ఇరువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు.

## కులమతాలకు అతీతం జనసేనపార్టీ

**- జనసేన నియోజకవర్గ సమన్వయకర్తలు**

**కారంపూడి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** కులమతాలకు అతీతంగా ఉంటూ అందరూ ఐక్యతతో ఉండాలని జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలు తూచ తప్పమని జనసేనపార్టీ సమన్వయకర్తలు అన్నారు. మందపోరు రోజున కారంపూడిలో జరుగుతున్న చాపకూడు కార్యక్రమానికి విచ్చేశారు. స్థానిక వీర్ల దేవాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మతసామరస్యం లేని పార్టీ జనసేన పార్టీ అని పవన్ కల్యాణ్ సూచనల మేరకు పనిచేస్తామని అన్నారు. సమసమాజ స్థాపన కోసం బ్రహ్మనాయుడు ఏర్పాటు చేసిన చాపకూడు ప్రతియేటా నిరంతరాయంగా కొనసాగాలన్నారు. కులమతాలకు అతీతంగా జరుగుతున్న పల్నాటి వీరారాధనోత్సవాలకు రావడం ఆనందించదగ్గ విషయమన్నారు. పల్నాటి వీరారాధనోత్సవాల విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కారంపూడి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, సత్తెనపల్లి సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు, గురజాల నియోజకవర్గం సమన్వయకర్త అంకారావు, వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, చిలకలూరిపేట నియోజకవర్గం సమన్వయకర్త తోట రాజారమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఫోటో గ్రాఫర్లకు వేతనం ఇవ్వండి సారు..

**తెనాలి, డిసెంబర్ 2 (ప్రభాతవార్త) :** సార్వత్రిక ఎన్నికల విధుల్లో సేవలందించిన ఫోటో, వీడియో గ్రాఫర్స్‌కు ఎన్నికల డ్యూటీ నిమిత్తం చెల్లించ వలసిన నగదును వెంటనే చెల్లించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎన్నికల డ్యూటీ చేసిన ఫోటోగ్రాఫరు్లు, వీడియోగ్రాఫర్లు, తమ సమస్యను తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణకు వినతిపత్రం రూపంలో వెల్లడించారు. అనంతరం తమ సమస్య మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఫోటో, వీడియో గ్రాఫర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ 2024సాధారణ ఎన్నికల సమయంలో 39మంది ఫోటో, వీడియో గ్రాఫర్లను ఎన్నికల విధుల్లో వినియోగించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఏడు నెలల గుడస్తున్నా ఎన్నికల్లో పాల్గొన తమికి చెల్లింపులు చేయలేదని, తమకు వెంటనే తగిన చెల్లింపులు చేసేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో పి.కిరణ్‌కుమార్, పి.నాగేశ్వరరావు, పి.తిరుపతిరావు, రమేష్, వినయ్‌కుమార్, నరేష్, పలువురు ఫోటో, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

## ఆలయ హుండీ లెక్కింపు

**నందిగామ డిసెంబర్2 ప్రభాతవార్త:** నందిగామ పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం హుండీ కానుకలు లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా తొమ్మిది నెలలకు 579880/- రూపాలయ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో గంగాధర తెలిపారు. ఈ హుండీ కానుకల లెక్కింపులో ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్, ఏ ఎస్ ఐ పి వి రమేష్ బాబు వీఆర్వో ముకుందాదేవి, రామాలయం ఈవో మూర్తి , సుధీర్ . పరిటాల శివ సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



## స్థానిక స్టోరేజ్ సొల్యూషన్స్ కోసం రామ్, ఎస్ఎస్డీలు ప్రారంభం

**అమరావతి, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** ప్రముఖ కంప్యూటింగ్, మొబిలిటి ఉత్పత్తుల విక్రయదారుగా పేర్గాంచిన హుండియా ఇన్ఫో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కుచెందిన ఐటి స్టోరేజ్ సొల్యూషన్స్‌లో అగ్రగామి ఈవిఎం బ్రాండ్ తాజాగా మేడిన్‌ఇండియా స్టోరేజ్ ఉత్పత్తులను లాంచ్ చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి విశాల్‌హుండియా ప్రకటించారు. ఇందులో రామ్, ఎస్ఎస్డి ఇతర కట్టింగ్ ఎడ్జ్ సొల్యూషన్స్ ఉంటాయని, స్థానికంగా వృద్ధి చేసిన, ఇక్కడే తయారైన మేడిన్‌ఇండియా స్టోరేజ్‌సొల్యూషన్స్‌ను మొదటి భారతీయ బ్రాండ్‌గా ఈవిఎం నిలుస్తుందన్నారు. స్టోరేజ్‌సొల్యూషన్స్‌లో 25కోట్లకు పైగా ఉత్పత్తుల మైలురాయిని అధిగమించామన్నారు.

## బోసుబొమ్మ సెంటర్లో ముమ్మర తనిఖీలు

**తిరువూరు, డిశంబరు 2, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణం బోసుబొమ్మ సెంటర్లో సిఐ కె గిరిబాబు ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. కాలేజీ వదిలిన సమయంలో కొంతమంది



ఆకతాయిల ఆటలను అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు సరిగా లేని వాహనాలను సీజ్ చేశారు. లైసెన్స్ లేకుండా వాహనదారులను మరియు వాహనాలు నడుపుతున్న మైనర్‌లకు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ మరియు త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వాహనదారులకు సిఐ గిరిబాబు కౌన్సిలింగ్ చేశారు. తనికీల్లో సెక్టార్ ఎస్సై కె వెంకట్రావు హైవే పెట్రోలింగ్ సిబ్బంది వున్నారు.

## చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే వేగేశన రూ.5లక్షలు సాయం

**కర్లపాలెం,నవంబర్02,ప్రభాతవార్త:** కర్లపాలెం దాస్ నగర్‌లో గ్రామస్తుల సహకారంతో నిర్మాణం అవుతున్న లూథరన్ ప్రార్థన మందిరమును శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సోమవారం సందర్శించారు. సింహద్వారం నిలబెట్టే ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటీసి గుంపుల కన్నయ్య మాట్లాడుతూ ప్రార్థన మందిరం నిర్మాణంకు 5లక్షలు విరాళం ఇవ్వనున్న శాసన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఏపూరి భూపతి రావు,వెంకట స్వామి,పిట్ల వసంతరెడ్డి,షేక్ బాజీ,ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష,సయ్యద్ రఫీ,పులుగు రాంబాబు రెడ్డి,పిట్టు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నామ మాత్రంగా ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం

**కర్లపాలెం,నవంబర్02,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల



పరిష్కార వేదిక కార్యక్రమం నామమాత్రంగా జరుగుతుంది. ఫిర్యాదులు చేయటానిక వస్తున్న వారి ఫిర్యాదులను వినటానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదు. కొన్నిశాఖలు వారి క్రింది స్థాయి ఎవరో ఒక సిబ్బందిని పంపించి చేతులు దులుపుకుంటున్నారు. అసలు ఈ విధంగానేనా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించేది అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒకసారి అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రతిసారి ఈ కార్యక్రమానిక హాజరు కావాల్సిన ప్రధాన అధికారులు తరచూ గైర్హాజరవ్వటం పట్ల ఫిర్యాదు దారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కర్లపాలెం మండలంలో ఇద్దరు ఎంఈవోలు ఉన్నారు. వారు ఇద్దరు కూడ సోమవారం హాజరు కాలేదు వారి స్థానంలో ఒక పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని పంపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి అని ప్రజలు కోరుతున్నారు. అన్ని శాఖల వారు తప్పకుండా హాజరు అయ్యేలా చర్యలుతీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై తాహాశీల్దారు సుందరమ్మను వివరణ కోరగా అన్ని శాఖల వారు తప్పకుండా హాజరు కావాలని హాజరు కాని శాఖల వారికీ నోటీసులు పంపుతామని ఆమె తెలిపారు.

## సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణలో అధికారులు సహకరించాలి

**బాపట్ల,నవంబర్02,ప్రభాతవార్త:** సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణలో అధికారులు సహకరించాలని జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ తెలిపారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సంబంధించి రూపొందించిన గోడపత్రాన్ని సోమవారం కలెక్టరేట్ నందు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణలో జిల్లా అధికారులందరూ సహకరించాలని ఆయన తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ వారు రూపొందించిన స్టిక్కర్లను జిల్లా అధికారులందరూ వారి సిబ్బందిచే కొనుగోలు చేయించాలన్నారు. అధిక మొత్తంలో విరాళాలు సేకరించడం ద్వారా సైనిక కుటుంబాలను ఆదుకోవచ్చన్నారు. ఆ నిధిని జిల్లా సైనిక సంక్షేమ శాఖ వారికి అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్యామ్‌సన్, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**బాపట్ల,నవంబర్02,ప్రభాతవార్త:** జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు ఈనెల 8వ తేదిన జిల్లాలో జరుగుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పది పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. 2,319 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈనెల 8వ తేదిన ఆదివారం ఉదయం10గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయని అన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. పదిమంది చీఫ్ సూపరిడెంట్లు,మరో 10మంది అధికారులు,99మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రాథమిక వైద్యం అందించడానికి 20మంది ఏఎన్ఎంలను నియమించామన్నారు. పరీక్షలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలన్నారు. పోలీసుల బందోబస్తు నిర్వహించడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్,జిల్లా రెవిన్యూఅధికారి జి గంగాధర్ గౌడ్,డిఈవో పురుషోత్తం,అనుబంధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపిలో మౌలిక సదుపాయాల వృద్ధికి టాటా ట్రక్కుల మద్దతు

**విజయవాడ, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** ఏపిలో మౌలిక సదుపాయాల వృద్ధికి టాటా ట్రక్కుల మద్దతుఅందిస్తుందని టాటా మోటార్స్ ట్రక్స్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ రాజేష్‌కల్ ప్రకటించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రాజక్టులు, కీలక పరిశ్రమలకు ఉత్పాదక శక్తి కేంద్రంగా మారడంతో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన మౌలిక సదుపాయాల వృద్ధిని సాధిస్తోందని, కార్గో, నిర్మాణ సామాగ్రి తదితరాలకు మొబిలిటీ డిమాండ్‌కు మద్దతునందించడానికి టాటా ట్రక్కులు సిద్ధంగా వున్నాయన్నారు.

MN 8 PAGE-GNT :MN 8 PAGE-GNT 01/01/01 10:03 AM Page 1



# ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ 2024లో లక్ష్మీసామ్రాజ్యానికి మొదటి బహుమతి

**గుంటూరు కలెక్టరేట్,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో జరిగిన 43వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ 2024లో పాల్గొని మొదటి బహుమతి సాధించిన మంగళగిరికి చెందిన లక్ష్మీ సామ్రాజ్యం కు సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ తో కలసి మెమెంటో అందజేశారు.న్యూఢిల్లీ లో నవంబర్



14నుంచి 27వ తేది వరకు జరిగిన సారస్‌మేళాలో స్వయం సహాయక సంఘ సభ్యుల చేత తయారుచేయబడిన ఉత్పత్తులను అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చిన అవకాశం వినియోగించుకొని జిల్లాలోని మంగళగిరి,కొల్లిపర మండలాల నుండి ఇద్దరు ద్వారా మహిళలను వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి పంపడం జరిగింది.అందులో మంగళగిరి చేనేత వస్త్రాలు,మేళాలోని 15రోజుల్లో పాల్గొన్న మహిళ లందరికంటే ఎక్కువ అమ్మకాలు చేసినందుకు మొదటి బహుమతి ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి,గంగారాజు,డిఆర్‌డిఏ ఖాజావలి,ఆర్డీవో కె.శ్రీనివాసరావు,పిడి డిఆర్‌డిఏ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వర్సిటీ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన వికాస నూతన కార్యవర్గం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** వర్సిటీలోని ఉద్యోగ సంఘం వికాస నూతన కార్యవర్గం సోమవారం వర్సిటీ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసింది.వికాస సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వీసి ఆచార్య కె.గంగాధరరావు,రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి,రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.అధ్యక్షుడు నీలపు ప్రసాద్,ఉపాధ్యక్షుడు దాసరి విజయప్రకాష్‌బాబు,ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు,సంయుక్త కార్యదర్శులు తోట



వెంకటేష్,నెలపాటి నాగేశ్వరరావు,కోశాధికారి కొలికపూడి యేసయ్య,కార్యవర్గ సభ్యులు విమల ఆనంద్‌కుమార్,పి.నాగరాజు,సిహెచ్ సాంబశివరావు,కేతావత్ శేఖర్,జె.శ్రీను ,నల్లగర్ల శ్రీనివాసరావు, ఈ.శ్రీనివాసరెడ్డి,టంకాల వెంకటేశ్వరరావు,సూతక్కి వెంకటేశ్వర్లు ఉన్నారు. ముందుగా వికాస కార్యవర్గ ం ఆచార్య నాగార్జున,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్,మహాత్మా జ్యోతిరావు పూలే,బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మాగాంధీ,అబ్దుల్‌కలామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్సిటీ విభాగాల్లో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

# ఎర్రబాలెంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**మంగళగిరి,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబసభ్యులకు టిడిపి నాయకులు సోమవారం ఉదయం అందించారు.స్థానిక



మండల పరిధిలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన గద్దం నాగమల్లేశ్వరికి రూ.37,539,భీమా పద్మావతి కి రూ.69,782,సీఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి.చెక్కులను లబ్ధిదారులు కుటుంబ సభ్యులకు టిడిపినాయకులు పంపిణీచేశారు.చెక్కులు అందుకున్న బాధితులు మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోటపార్థసారధి,రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ ఆపదలు వేస్తే వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తున్నదన్నారు.ఆన్‌లైన్ ప్రతి ఒక్కరికి మంత్రి నారా లోకేష్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో మండల కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్,కట్టెపోగు ఉదయభాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు

**తాడేపల్లి,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** తాడేపల్లి మండలంలో సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు.గంజాయి పూర్తి నిర్మూలనే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధంచేస్తున్న పోలీసు అధికారులు.తాడేపల్లి మండలంలో డోలాస్ నగర్,ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించిన పోలీసు బలగాలు అనుమానం ఉన్న ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు.సరైన పత్రాల్లేని 34ద్విచక్ర వాహనాలు



స్వాధీనం చేసుకున్న అధికారులు.గంజాయి అమ్మేవారితో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రతి వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపిన అడిషనల్ ఎస్పీ రవికుమార్,కార్డన్ సెర్చ్‌లో డిఎస్పీ మురళీకృష్ణ,తాడేపల్లి సిఐ కళ్యాణ్‌రాజు,మంగళగికరి టౌన్ సిఐ వినోద్‌కుమార్,మంగళగిరి రూరల్ సిఐ శ్రీనివాసరావుతోపాటు ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతిని ప్రేమించండి ఆనందంగా జీవించండి

**గుంటూరు,డిసెంబర్ 2,ప్రభాతవార్త :**ప్రకృతిని ప్రేమించి ఆనందంగా జీవించండని చిప్స్ ప్రొఫెసర్ డాక్టర్ పి విజేత అన్నారు.శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్, చేతన చౌడవరంలో క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన చిప్స్ ప్రొఫెసర్ డాక్టర్ పి విజేత మాట్లాడుతూ క్రీడలకు ప్రాదాన్యత ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమానికి గౌరవ అతిధిగా విచ్చేసిన బాలకుటీర్ పూర్వ విద్యార్థిని చిప్స్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ సింధు వైష్ణవి మాట్లాడుతూ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని గెలుపు కోసం ప్రయత్నించాలని ఆత్మవిశ్వాసంతో విజయపథంలో ముందుకు సాగాలని సూచించారు.పూర్వ విద్యార్థి మెర్క్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఏరియా బిజినెస్




మేనేజరు పి.రాజేష్ మాట్లాడుతూ మనం నేర్చుకున్న విలువలే మన విజయానికి పునాదులని దృఢమైన సంకల్పం ఉంటే అసాధ్యమనేది ఏదీ ఉండదని కథ ద్వారా విద్యార్థులకు వివరించారు. బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్ మంగాదేవి మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించడంలో క్రీడలు ప్రముఖ పాత్రను పోషిస్తాయని అటువంటి క్రీడలనూ ఆడటం ద్వారా ఆత్మవిశ్వాసం, మానసికధైర్యం ,సహనం, పట్టుదల,ఏకాగ్రత వంటి గొప్పలక్షణాలు అలవాడతాయిని తెలియజేశారు.గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పినిసిపల్ ఎండి నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు,లక్ష్మీప్రసన్న,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములు కండి

## -సిపి రాజశేఖరబాబు

**విజయవాడ క్రైం,డిసెంబరు 2,ప్రభాతవార్త:** ట్రాఫిక్ అంబాసిడర్స్‌గా పనిచేయడం సైతం సామాజిక భాధ్యత అని గుర్తించి ఎన్టీఆర్ ట్రాఫిక్ విభాగానికి చిన్న సమాచారం ఇచ్చి అంతరాయం లేని ట్రాఫిక్ నగరంగా చేయడంలో భాగస్వాములు అవ్వాలని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు.జ్యోతి కన్వెన్షన్ హాలులో ట్రాఫిక్ అధికారులకు,ట్రాఫిక్ అంబాసిడర్లకు నిర్వహించిన సమన్వయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగరంలో వివిధ కారణాల వలన ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, దాని వలన సామన్య ప్రజలు ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని వారికి వివరించారు. దానిని అధిగమించడానికి గాను ట్రాఫిక్ సిబ్బంది సేవలతో పాటు సాంకేతికంగా అస్త్రం యాప్ వినియోగం లోకి తీసుకువచ్చి తద్వారా అక్టోబర్ నెలలో ట్రాఫిక్ అంతరాయాల మీద నవంబరు నెలలో బాగా తగ్గడం గుర్తించామన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజల సహాయ సహకారాం కూడ పోలీసు వారికి అవసరమని గుర్తించి దానిలో భాగంగా ట్రాఫిక్ అంబాసిడర్స్ సేవలు వినియోగించటాకి కమాండ్ కంట్రోల్ రూంలో ట్రాఫిక్ సిబ్బందితో వాట్స్ అప్‌లో ఫొటో ద్వారా గాని,ఫోన్ ద్వారా గాని లేదా సంక్షిప్త మెసేజ్ ద్వారా కాని నగరంలో ప్రానించేటపుడు ఏదైనా వాహనం బ్రేక్‌డౌన్ అయినా గాని రోడ్డు ప్రమాదం జరిగినా కాని ధర్నా,ర్యాలీ, ఊరేగింపులు,ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు, ట్రాఫిక్ అన్తరాయం ఏర్పడినప్పుడు ప్రజలు స్పందించి వెంటనే వాట్స్ అప్ నెంబరుకు సమాచారం పంపితే వెంటనే అక్కడ సిబ్బంది సంబంధిత ట్రాఫిక్ అధికారులను అప్రమత్తం చేసి సత్వరమే ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగటించి ప్రజలకు కల్గిన అసౌకర్యాని నివారిస్తామన్నారు.ప్రజల సహకారం వలన ఒక్కొక్క సారి అత్యవసర చికిత్స అవసరమైన వారి ప్రాణాలు కాపాడబడతాయని, ఏదైనా అత్యవసర పనిమీద వెళ్ళేవారు సకాలంలో వారి గమ్యస్థానాలకు చేరుకొని వారి పనులు పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ డిసిపి గౌతమి శాలి,డిసిపి ట్రాఫిక్ కృష్ణమూర్తి నాయుడు,క్రైం డిసిపి తిరుమలేశ్వరరెడ్డి,ట్రాఫిక్ అడిషనల్ డిసిపి ఏవియల్ ప్రసన్నకుమార్,లా అండ్ ఆర్డర్ ఎడిసిపి జి.రామకృష్ణ,ఫోర్సు అడిషనల్ డిసిపి శ్రీనివారావు,ట్రాఫిక్ ఎసిపిలు,లా అండ్ ఆర్డర్ ఏసిపిలు,సిఐలు,యస ఐలు,సిబ్బంది,ట్రాఫిక్ అంబాసిడర్లు పాల్గొన్నారు.




# నారా లోకేష్‌బాబును కలిసిన వాసం మునియ్య

**ఎ కొండూరు, డిశంబరు 2, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబును ఎ కొండూరు మండలం ఎ కొండూరు మాజీ ఎంపిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య సోమవారం ఉండవల్లిలోని సిఎం నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మంత్రి నారా లోకేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి వాసం మునియ్య కృతజ్ఞతలు తెలిపారు.




# సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**జగ్గయ్యపేట, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని రెండో వార్డులో రూ.5 లక్షల నిధులతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు.



ఈసందర్భంగా రాఘవేంద్ర మాట్లాడు తూ పట్టణంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు, నిర్వహణలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. గతంలో పోలిస్తే పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగైందన్నారు.ప్రజలనుండి కూడా ఫిర్యాదులు తగ్గాయన్నారు. పట్టణాన్ని రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా నడుపుతున్నా మన్నారు. కాగా కార్యక్రమంలో పలువురు టిడిపి, జనసేన నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో సమస్యలు పరిష్కరించాలి:** జగ్గయ్య పేట పట్టణంలోని ఏపిఎస్ ఆర్టీసి డిపో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుకు వినతిపత్రం సమర్పించారు. విజయవాడ ఆర్టీసి చైర్మన్ కార్లాయంలో సోమవారం నారాయణను ఆయన కలుసుకున్నారు. కొత్త బస్సు సర్వీసులు ఏర్పాటుచేయాలని, మెరుగైన సేవలు అందింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు గింజుపల్లి రమేష్, కళ్యాణం కృష్ణారావు, కళ్యాణం మురళి, కాసరగడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఉప ఖజానా కార్యాలయం ఏర్పాటు చేయాలి

**నందిగామ డిసెంబర్ 2 ప్రభాతవార్త:** నందిగామ ఉప ఖజానా కార్యాలయానికి సొంత భవనములు లేకపోవటం వలన అనేకముంది ఉద్యోగస్తులు పెన్షన్ దారులు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికముగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఉప ఖజానా కార్యాలయము నిర్వహిస్తున్నప్పటికీ వారి అవసరాల నిమిత్తం ఖాళీ చేయవలసినదిగా పదే పదే కోరుతున్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో 5 సెంట్ల ఖాళీ స్థలము కేటాయించటం జరిగింది. ఖజానా కార్యాలయము నిర్మించుటకు కావలసిన అనుమతులను వెంటనే విడుదల చేయించి ప్రజలకు ఉద్యోగస్తులకు కలుగుతున్న అసౌకర్యాలను తీర్చవలసినదిగా కోరుతూ సంబంధిత అధికారులకు విశ్రాంత ఉద్యోగస్తుల తరపున విన్నవించుకొనడం జరిగింది.

# వృద్ధాప్యంలో ఇబ్బందిపెట్టే ఆస్టియో పోరోసిస్ వ్యాధిపట్ల జాగ్రత్త వహించాలి

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 2,ప్రభాతవార్త : వృద్ధాప్యంలో చాలామందిని ఇబ్బందిపెట్టే ఆస్టియో ఫోరోసిస్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ వ్యాధి ఉన్నప్పటికీ పైకి ఏ బాధలుతెలియవని కాని చిన్న దెబ్బకే ఎముకలు విరిగిపోతాయని అవగాహన ఆరోగ్యసభలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కార్తిక్ మాట్లాడుతూ అన్నారు. అవగాహన సంస్థ కార్యాలయంలో ఎముకలు కీళ్ళు సంబంధిత వ్యాది పై జరిగిన ఆరోగ్యసభకు విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ఆర్. రామచంద్రరావు అధ్యక్షత వహించారు.డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ



ఎముకలకు సంబంధించిన వ్యాధుల్లో ఆస్టియో ఫోరోసిస్ ప్రధానమైందని ఈ వ్యాధిలో బోన్ మినరల్ డెన్సిటీ తగ్గిపోతుందని ఎముకలు అతి తేలికగా విరిగిపోతాయని వెన్నుపూసలు,పక్కటెముకలు,మణికట్టు దగ్గర ఎముకలు ఆస్టియోఫోరోసిస్ వల్ల విరగటం జరుగుతుందన్నారు.సభకు హాజరైనవారు అడిగిన సందేహాలను డాక్టర్ కార్తీక నివృత్తిచేశారు.అనంతరం డాక్టర్ కార్తిక్‌ను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో డాక్టర్ రత్నారావు,సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మజీద్ పున:నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** మజ్జిద్ -ఏ-బిలాల్-హుదా పున:నిర్మాణ కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మజ్జిద్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించి ప్రార్ధనలు చేసుకునే మస్జిద్ నిర్మాణం జరగడం సంతోషకరమన్నారు. అల్లా ఆశీస్సులు రాష్ట్ర ప్రజలకు ఉండాలని ఆయన కోరుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా వెంట ముస్లిం పెద్దలు, తెలుగుదేశంపార్టీ నాయకులు ఉన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

**రాజుపాలెం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** గుంటూరు - మాచర్ల రహదారిపై మండల పరిధిలోని రాజుపాలెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన తురకా ప్రసాద్ (32) తన ఆటోలో స్వగ్రామం నుండి సత్తెనపల్లికి బయల్దేరాడు. మార్గం మధ్యలోని రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న కోళ్ళ ఫారం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ అతివేగంతో ఢీ కొంది. ఈ సంఘటనలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో సత్తెనపల్లికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. చికిత్సపొందుతూ ప్రసాద్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎస్.ఐ. వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆనందోత్సాహాలతో డ్రీమర్ స్విమ్మర్స్ కార్తీక వనసమారాధన

**జగ్గయ్యపేట, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట డ్రీమర్ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఆబాలగోపాలం పాల్గొని ఆనందోత్సాహాలతో అలరించారు. జగ్గయ్యపేట పట్టణ శివారులోని మాజీ నగర పంచాయితీ చైర్‌పర్సన్ హనుమంతు రత్నాకుమారి మామిడితోటలో బాలలు, మహిళలు, పురుషులకు కూడా రకరకాల ఆటల



పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ (డిఎస్ఏ) వ్యవస్థాపకులు, కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మీ, యువకోచ్ సందీప్ పర్యవేక్షణలో జరిగిన ఈవేడుకలో పెద్ద సంఖ్యలో స్విమ్మర్లు పాల్గొన్నారు. ఖమ్మం, కోదాడ పట్టణాల నుండి కూడా పలువురు స్విమ్మర్లు విచ్చేసి వేడుకలో భాగస్వాములయ్యారు. కృష్ణాస్విమ్మర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు చెరుకూరి రమేష్, పిన్నెల్లి పాండురంగారావులను డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఈతలపోటీల్లోపాల్గొని ఓవరాల్‌ఛాంపియన్‌షిప్‌తో పాటు పతకాల పంట పండించిన స్విమ్మర్లను సభలో ఘనంగా సత్కరించారు. రాంకో సిమెంట్స్ వైద్యులు, జగ్గయ్యపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కేశవప్రసాద్ పాల్గొని స్విమ్మర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

# ప్రత్యేక పూజలు నిర్వహించిన సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** కార్తీక మాస ముగింపు సందర్భంగా గౌరీ పాడ్యమి పురస్కరించుకుని జనసేన ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను సోమవారం పట్టణంలోని శ్రీచంద్ర మౌళీశ్వరస్వామి (పెద్ద శివాలయం) వారి ఆలయానికి వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు స్వామివారి తీర్ధప్రసాదాలను, ఆశీర్వచనాలను ఉదయభానుకు అందజేశారు.



# అమ్మవారికి సాముహిక కుంకుమార్చనలు

**వీరులపాడు డిసెంబర్ 02 ప్రభాతవార్త:** కార్తీక మాసానంతరం వచ్చే పాడ్యమి హిందూ మహిళలకు ఎంతో పవిత్రమైనదని, దీంతో సోమేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల మహిళలు కూడా పెద్ద ఎత్తున ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని ఆలయ ప్రధాన అర్చకులు



ఎనమదల సాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# యువతకు శిక్షణ

**గుంటూరు కలెక్టరేట్,డిసెంబర్ 2,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు ఆయా శిక్షణ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవలసిందిగా తెలిపారు.

# వేదోక్తంగా సహస్ర లింగార్చన

**ఇంద్రకీలాద్రి, డిసెంబరు 2, ప్రభాతవార్త :** దుర్గమ్మ వారి ఆలయంలో వేంచేసియున్న శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయంలో సహస్ర లింగార్చన సేవలను వేదోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసం ముగింపుసందర్భంగా చివరిరోజైన సోమవారం జరిగిన ఈ పూజలో ఆలయ ఇఓ కెవిస్ రామారావు పాల్గొన్నారు.

**దుర్గమ్మసేవలో విఐపిలు :**దుర్గమ్మ ను సోమవారం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుమిత్ర దావ్రా, తెలంగాణ స్పెషల్‌ఛీఫ్ సెక్రటరి రవిగుప్తా, సినీ దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఎఎం రత్నం, తెలంగాణ ఛీఫ్ సెక్రటరి ఎ శాంతి కుమారి, వి శేషగిరి, ఇతర అధికారులు దుర్గ మ్మను సోమవారం దర్శించుకున్నారు. **అలరించిన నృత్యసౌరభం:** దుర్గమ్మవారి ఆల యంలో సోమవారం నృత్యసౌరభాలు భక్తులను అలరించాయి. గన్నవరంకుచెందిన ప్రతిన్ కూచి పూడి నాట్య అకాడమికి చెందిన నాట్యా చార్యు లు కొలచిన కమలనిధి నేతృత్వంలో తాండవ నృత్యకరీ, వినాయకకవుతం, అయిగిరి నందిని, క్షీరాబ్ధి కన్యకకు, మహాగణపతి, ఓం శర్వాణి, జనుత శబ్దం, వీణాపుస్తక ధారిణీం, నాగేంద్ర హారాయ, పలుకే బంగారమాయెనా అంటూ సాగిన కీర్తనలకు దివిజ సాయి, జోస్న, లాస్య, భావన,ఎస్ఎన్‌వి, కీర్తన,కస్తూరి, ఓస్న, చరణ్య, ఖుషి, సుస్మిత,ఐతిహ్య, అశ్వినిలు కూచిపూడి నాట్యరీతులను పలికించి అబ్బురపరిచారు.

# అమరావతిలో ఇఎస్ఐ ఆసుపత్రి

## స్థలాలను పరిశీలించిన అధికారులు

**విజయవాడ, డిసెంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ కళాశాల ఏర్పాటుకు 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని మంత్రి పి,నారాయణ నేతృత్వంలోని కేబినేట్ ఉపసంఘం ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో నెక్కల్లు సమీపంలో ఈ -8 రహదారి పక్కన సర్వే నంబరు 20లో ఉన్న స్థలాన్ని ఈఎస్ఐ సీఆర్డీఏ అధికారులు ఆదివారం పరిశీలించారు. నాన్ పొల్యూషన్ ఇండస్ట్రియల్ జోన్ పక్కన 20 ఎకరాలను ఈఎస్ఐకి సీఆర్డీఏ కేటాయించింది. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు రహదారి పక్కన ఈ ప్రాంతం ఉంది. జాతీయ రహదారికి అనుసంధాన మార్గలు, భవిష్యత్తులో అభివృద్ధి చేసే విధానం, దగ్గరలో స్థలాలు కేటాయించిన సంస్థల వివరాలను సీఆర్డీఏ అధికారులు వివరించారు. ఆ ప్రాంతానికి సమీ పంలోనే అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతుందని వారు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం రాజధాని సెంట్రల్ పాయింట్‌గా ఉండనుందని చెప్పారు. ప్రభుత్వం కేటాయిం చిన స్థలంలో 100 పడకల ఈఎస్ఐ ఆసు పత్రి, వైద్య, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలు నిర్మించాల్సి ఉన్నందున భవిష్యత్ అవసరాల కోసం మరో 20 ఎకరాలు కేటాయిస్తూ బాగుంటుందనే విషయమై వారు చర్చించారు. కార్యక్రమంలో బీమా , వైద్య సేవల డైరెక్టర్ వి.ఆంజనేయ, ఈఎస్ఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ ,జాయింట్ డైరెక్టర్ జి జగదీప్ గాంధీ,తహసీల్దారు రవిబాబు, సీఐఎస్ ప్లానింగ్ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

3-12Pg5fAP.qxd:3-12Pg5fAP.qxd 01/01/01 7:36 AM Page 1



# అత్యంత ఎత్తులోకి ఉపగ్రహ ప్రయోగం



ప్రోబా-3 మిషన్ వద్ద శాస్త్రవేత్తలు

## పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్ ద్వారా రేపు మధ్యాహ్నం శ్రీహరికోట నుంచి...

### యూరోపియన్ స్పేస్ ఏజన్సీకి ఇస్రో సహకారం

### నేటి మధ్యాహ్నం నుంచే కౌంట్‌డౌన్

**శ్రీహరికోట (తడ), డిసెంబరు 2 ప్రభాతవార్త:** అంతరిక్ష పరిశోధనలో భారత్ మరో ప్రతిష్టాత్మక రాకెట్‌ను నింగిలోకి పంపించేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 4న సాయంత్రం 4.08 గంటలకు శ్రీహరికోట నుంచి పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్ ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు తుది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇటీవల బంగాళా ఖాతంలో ఫెంగల్ తుపాను కారణంగా మారిన వాతావరణ పరిస్థితులు రాకెట్ ప్రయోగానికి తాత్కాలిక అంతరాయం కలిగిస్తాయని పలు సందేహాలు ఉన్నప్పటికీ సోమవారం సాయంత్రానికి గాలులు తగ్గిపోవడంతో రాకెట్ ప్రయోగం నిర్ణీత సమయానికి జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం ఎంఆర్ఆర్ సమావేశం, అనంతరం ఎల్ఎబి సమావేశాలు సీనియర్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పటికే లాంచ్ రిహార్సల్స్ పూర్తయ్యాయి. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రిహార్సల్స్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఇదిలావుంటే ఈ రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్‌ఏజన్సీకి చెందిన ప్రోబా-3 మిషన్‌ను ప్రయోగిస్తున్నారు. సూర్య పరిశోధనల కోసం ఇందులో రెండు ఉపగ్ర హాలను అమర్చారు. ఈరాకెట్‌ను ఇస్రో రూపొందించింది. ఉపగ్రహం ఇతర దేశాల సౌకర్యం కోసం మన ప్రయోగ వేదిక నుంచి ప్రయో గిస్తున్నారు. పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్ ప్రయోగ సమయంలో 44.5 మీటర్ల ఎత్తు ఉండగా, నాలుగు దశలు కలిపి 320 టన్నుల బరువు కలిగి ఉంది. షార్‌కు పిఎస్ఎల్‌వి ప్రయోగాలు కొత్త కాకపోయినప్పటికీ ఒకే మిషన్‌లో రెండు ఉపగ్రహాలను దాదాపు ఒకే కక్ష్యలోకి చేర్చడం ఇది ప్రథమం. దీనికితోడు గతంలో ఎన్నడూ లేని విధంగా భూమికి 60,530 కిలోమీటర్ల అపోజి కక్ష్యలో ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంది. భూమికి 600 కిలోమీటర్ల పెరిజి, 60,530 కిలోమీటర్ల అపోజి కక్ష్యలో ఈ ఉపగ్రహం పరిభ్రమించి యూరోపియన్ దేశాలకు అవసరమైన సమాచారం అందిస్తుంది. 550 కిలోగ్రాముల బరువు ఉన్న ప్రోబా3లో అత్యంత ఆధునిక సాంకేతిక ఉపకరణాలను ప్రవేశపెట్టారు. మన దేశీయఉపకరణాలుకూడా ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది. రాకెట్ ప్రయోగానికి సంబంధించి ఇస్రో, యూరోపియన్ శాస్త్రవేత్తలు పనులు చేసుకు పోతున్నారు.

**61వ పిఎస్ఎల్‌వి**

శ్రీహరికోట నుంచి ఇప్పటికి 60 పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ప్రయోగాలు జరిపి ఉన్నారు. ఇది 61వ ప్రయోగం కాగా, ఎక్స్ఎల్ తరహాలో 26వ ప్రయోగంగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ ప్రయోగం 1615 సెకన్లకు పూర్తవుతుందని ఇస్రోప్రకటించింది. ప్రోబా3 విజయవంతంగా కక్ష్యకు దూసుకెళితే మరిన్ని విదేశీ ఉపగ్రహాలు కూడా మన పిఎస్ఎల్‌వి రాకెట్ల ద్వారా షార్ నుంచి ప్రయోగించుకునే అవకాశం కలుగుతుందని శాస్త్రవేత్తలు ధీమాగా ఉన్నారు.



# భారత్‌కు రండి..

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోడీ ఆహ్వానం

**మాస్కో, డిసెంబరు 2:** భారత్‌లోపర్యటించాలని మాస్కో అధ్యక్షుడిని ప్రధాని నరేంద్రమోడీ ఆహ్వానించారు. 2025 తొలినాళ్లలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్‌పర్యటన తేదీలు కూడా ఖరారు చేయాలని ఆహ్వానం పంపించారని క్రెమ్లిన్ ప్రతినిధి యూరి ఉషకోవ్ తెలిపారు. ఏడాదిలో ఒకసారి రష్యా, భారత్‌లు చర్చలు జరపాలని సమావేశం కావాలని నిర్ణయించాయని ఇందులో భాగంగానే ఈసారి రష్యా వంతు వచ్చిందని ఉషకోవ్ తెలిపారు. ప్రతిఏటా ఒకసారి మా నాయకులు సమావేశం నిర్వహణకు అంగీకరించారని, ఈసారి మావంతు వచ్చినందున భారత్‌లో పర్యటనకు వస్తారని అన్నారు. ప్రధానిమోడీ నుంచి మాకు ఆహ్వానం అందిందని తప్పకుండా అమలుకు తెస్తామని అన్నారు. వచ్చే ఏడాది తొలినాళ్లలోనే మా అధ్యక్షుడి పర్యటనను ఖరారుచేస్తామన్నారు. భారత్ పర్యటనకు పుతిన్‌వస్తే ఈ పర్యటన ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభం అయిన తర్వాత జరుపుతున్న మొట్టమొదటిపర్యటన అవుతుంది. రెండుదేశాలమధ్య ఉద్రిక్తతలు కేవలం చర్చలు, సంప్రదింపులు శాంతి మార్గంలోనే పరిష్కారం అవుతాయని ఆయన చెప్పారు.

ప్రతిరెండు నెలలకోపర్యాయం పుతిన్, మోడీల మధ్య టెలిఫోన్ సంభాషణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇద్దరు నాయకులు కూడా వ్యక్తిగతంగా భేటీ అయిన సందర్భాలున్నాయి. జులైలో ప్రధానిమోడీ మాస్కో పర్యటనలోను, 22వ రష్యా భారత్ సదస్సు సందర్భంగాను వీరి భేటీ జరిగింది.

ప్రధానిమోడీ మూడోసారి ఎన్నికయినతర్వాత మొదటిసారిగా రష్యాలోపర్యటించారు. అంతేకాకుండా రష్యాకు సంబంధించిన అత్యున్నత పురస్కారం ది ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టిల్ అవార్డు ఇచ్చి ప్రధానిని గౌరవించారు. అలాగే అక్టోబరులో ప్రధానిమోడీ రష్యాలోని కజన్ పర్యటనకు వెళ్లారు. బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు.

## పంజాబ్ మాజీ సిఎంకు అఖల్‌తక్త్ శిక్ష

**చండీఘర్, డిసెంబరు 2:** పంజాబ్‌మాజీ సిఎం సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌కు సిక్కుల అత్యున్నత సంస్థ అఖల్‌తక్త్ శిక్ష విధించింది. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంతోపాటు మరికొన్ని గురుద్వారాల్లోని బాత్‌రూమ్‌లు, వంటశాలలను శుభ్రం చేయాలని ఆదేశించింది. 2015లో డేరా సచ్చాసౌదా చీఫ్ గుర్మీత్‌రామ్ రహీమ్‌కు అనుచిత లబ్దిని చేకూర్చి పవిత్ర గురుగ్రంథ్ సాహిబ్‌ను అపవిత్రం చేసారని అఖల్‌తక్త్ అభిప్రాయపడింది. ఆయన తండ్రి దివంగత ప్రకాశ్ సింగ్ బాదల్ కూడా పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసారు. ఆయనకు సైతం గతంలో ఇదేవిధంగా శిక్షలుపడ్డాయి. ప్రస్తుతం సుఖ్‌బీర్ బాదల్ వీల్‌చైర్‌లో ఉన్నారు.

# అదానీ అంశం కాంగ్రెస్‌కు అవసరం



### ఒక్క అంశంపై పార్లమెంటుకు అంతరాయం మా అభిమతం కాదు

### అదానీపై ఇండియా కూటమి సమావేశానికి టిఎంసి గైర్హాజర్

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** అదానీ కేసు వ్యవహారంపై పార్లమెంటులో విపక్ష కూటమి లేవనెత్తుతున్న అంశాలు కాంగ్రెస్ పార్టీకి అవసరం కాని మాకు అవసరం లేదని తృణమూల్ కాంగ్రెస్ స్పష్టమైన సంకేతాలిచ్చింది. ఇండియా కూటమి నేతలు కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గే ఛాంబర్‌లో జరిగిన సమావేశానికి టిఎంసి హాజరుకాలేదు. టిఎంసి వర్గాలకథనం ప్రకారం తాము ఆరు కీలక అంశాలను పార్లమెంటులో లేవనెత్తామని, ధరల పెరుగుదల, నిరుద్యోగం, నిధుల కొరత మణిపూర్ హింస వంటి వాటిపై చర్చజరగాలని పట్టుబట్టామని, అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం కేవలం ఆదాని అంశాన్నే పట్టుబడుతోందని అందువల్లనే తృణమూల్ కాంగ్రెస్ ఇండియా కూటమి పార్లమెంటరీ పార్టీనేతల సమావేశానికి హాజరుకాలేదని తెలిపారు. మేం లేవనెత్తిన పాయింట్లు అజెండాలో లేనపుడు ఇండియా కూటమి సమావేశాలకు మేం హాజరుకానవసరం లేదని టిఎంసి నాయకుడు అన్నారు. అమెరికా జస్టిస్ డిపార్టుమెంట్ ఆదానిగ్రీన్ డైరెక్టర్లపై మోపిన అభియోగాలపై చర్చజరపాలని, సభలో ఇతర అంశాలన్నింటినీ పక్కనపెట్టి ఆదాని అంశాన్ని చర్చించాలని పట్టుబడుతున్నదన్నారని టిఎంసి ఆరోపించింది.

కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగోర్ ఇందుకు సంబంధించి వాయిదా తీర్మానం ఇచ్చినప్పటికీ స్పీకర్ అనుమతించలేదు. కాంగ్రెస్‌తోపాటు వివిధ పార్టీలెంపిలు కూడా వివిధ అంశాలపై చర్చకు లేవనెత్తారు. అలాగే పంజాబ్‌లో ధాన్యం కొనుగోలు జాప్యాన్ని కూడా నివారించాలన్నారు. అదానీ అంశానికి సంబంధించి ఛైర్మన్ గౌతమ్ అదానీ స్పందించారు. ఇలాంటి సమస్యలు తమకు కొత్తకాదని, మరింత బలపడేందుకు ఇలాంటివి సవాలుగా మారతాయని స్పష్టం చేసారు.

న్యాయపరంగానే పోరాడతామని చెప్పారు. పార్లమెంటు సమావేశాలుప్రారంభం అయినప్పటి నుంచి ఈ వారంరోజులు పదేపదే వాయిదా పడుతూనే వస్తుండటం గమనార్హం. శీతాకాల సమావేశాలు 20వ తేదీతో ముగుస్తాయి. బెంగాల్‌వరకూ తమ రాష్ట్రానికి సంబంధించిన సమస్యలనే ప్రస్తావిస్తామని సెక్రటరీ జనరల్ అభిషేక్ బెనర్జీ చెప్పుకొచ్చారు. మా వైఖరి స్పష్టంగా ఉందని, బెంగాల్ సమస్యలకే మా మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. బెంగాల్ బకాయిలను కేంద్రం బ్లాక్‌చేసిందని, ఇలాంటి వాటిపైనే మేం చర్చిస్తామని ఆయన అన్నారు. టిఎంసి ఎంపి కాకోలిఘోష్ దస్తీదార్ మాట్లాడుతూ పార్లమెంటుకు పదేపదే అంతరాయాలు సృష్టించడం మా ధర్మంకాదని, కేవలం ఒక్క అంశంపై పదేపదే వాయిదాలు పడకూడదని అన్నారు. చర్చించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయన్నారు.

## పార్లమెంటు ఆవరణలో ప్రధాని మోడీ షాతో భేటీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** శీతకాల సమావేశాల సందర్భంగా సోమవారం పార్లమెంటు ప్రాంగణంలో ప్రధానిమోడీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు భేటీ అయ్యారు. గతవారమే ప్రారంభం అయిన ఈ సమావేశాల్లో ఒక్కటి కూడా సజావుగా సాగలేదు. వాయిదాలు కొనసాగుతున్నాయి. విపక్షాల డిమాండ్‌తోరోజూ సభ ప్రారంభం కావడం వాయిదా పడటం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో అగ్రనేతల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. వారిద్దరూ పలు కీలక అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటు అంశంకూడా వారిమధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. మరోవైపు అదేక్రమంలో ఇండియా కూటమి ఎంపిలు కూడా ఖర్గే ఛాంబర్‌లో సమావేశం అయ్యారు. ఉభయసభల్లో ఎన్డీయేను ఎదుర్కొనే వ్యూహంపై చర్చించారు. అయితే ఈభేటీకి తృణమూల్‌కాంగ్రెస్ హాజరుకాలేదు. బెంగాల్‌కు సంబంధించిన అంశాలకే తాము మొదటి ప్రాధాన్యం ఇస్తామని ఆపార్టీనేతలు పేర్కొన్నారు. ఈ సమావేశాలుప్రారంభానికి ముందే ఆదాని వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో అభియోగాలు నమోదయిన వ్యవహారంపై చర్చజరపాలని విపక్షాలు డిమాండ్‌చేస్తున్నాయి. అలాగే మణిపూర్‌లో ఇటీవల మళ్లీ వెలుగుచూసిన హింసాత్మక ఘటనలపై సమా ధానం ఇవ్వాలని పట్టుబడుతున్నాయి. దాంతో ఉభయ సభలు వాయిదాపడుతూనే ఉన్నాయి. ఈ సమావేశాల్లో 17 బిల్లులు చర్చకు రావాల్సి ఉండగా సోమవారంకూడా ఉభయసభలు వాయిదాపడ్డాయి.

## ఉత్కంఠ రేపిన అజిత్‌పవార్ ఢిల్లీ పయనం

**ముంబయి,డిసెంబరు 2:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపికపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఫలితాలు వెలువడి తొమ్మిది రోజులవుతున్నా ఇప్పటికీ సీఎం ఎవరనేది తేల్చలేకపోయారు. ఈ అంశం పరిశీలించేందుకు కేంద్ర మంత్రి నిర్మల, గుజరాత్ మాజీ సిఎం విజయ్‌రూపానీలు మహారాష్ట్రకు వస్తున్నారు. ఇలాంటిపరిస్థితుల్లో డిప్యూటి సిఎం అజిత్ పవార్ హటాత్తుగా ఢిల్లీ పయనం సర్వత్రా చర్చకు దారితీసింది. హటాత్తుగా ఆయన దేశరాజధానికి వెళ్లారు. కొత్తప్రభుత్వం ఏర్పాటుపై హైకమాండ్‌తో చర్చించేందుకు ఢిల్లీ వెళ్లినట్లు వార్తలొస్తున్నాయి. ముంబయిలో సోమవారం జరగాల్సిన ఎల్పీ సమావేశం షిండేకు అనారోగ్యం కారణంగా రద్దయింది. కీలక సమావేశాలన్నీ కూడా షిండే రద్దుచేసుకున్నారు. ఈపరిస్థితుల్లో పవార్ ఢిల్లీపయనం చర్చకు దారితీసింది.

## సుప్రీంకోర్టులో అగ్నిప్రమాదం

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 11,12 కోర్టుమధ్య ఉన్న వెయిటింగ్ ఏరియాలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీనితో అప్రమత్తం అయిన సుప్రీంకోర్టు సెక్యూరిటీ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని ఈప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని సిబ్బంది వెల్లడించారు.

# రైల్వే ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం!

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 2,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలతో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఈ నెల 4నుంచి 06వరకు జరుగనున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలకు సంబంధించి రైల్వే శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జోన్ పరిధిలో మొత్తం 78,434మంది ఓటర్లను దృష్టిలో ఉంచుకుని 170పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు,ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారితో సహా మరో నలుగురు సిబ్బందిని చొప్పున మొత్తం 850మంది పోలింగ్ సిబ్బందిని భద్రతా,రక్షణ సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని గమనిస్తూ, పరిశీలిస్తూ, పర్యవేక్షిస్తూ తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు. జోనల్ ప్రధాన కేంద్రమైన జిఎం కార్యాలయంలో పనిచేస్తున్న 2,941మంది సిబ్బంది/ ఓటర్లకై 5పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే సికింద్రాబాద్ డివిజన్‌లో 20,876మంది ఓటర్లకు గాను 39పోలింగ్ కేంద్రాలను 195మంది సిబ్బందిని,హైదరాబాద్ డివిజన్‌లో 6,775మంది ఓటర్లకు గాను 19పోలింగ్ కేంద్రాలను,95మంది సిబ్బందిని,విజయవాడ డివిజన్‌లో 17,577మంది ఓటర్లకు గాను 37పోలింగ్ కేంద్రాలను,185మంది సిబ్బందిని, గుంతకల్లు డివిజన్‌లో 14,359మంది ఓటర్లకు గాను 34పోలింగ్ కేంద్రాలను,170మంది సిబ్బందిని, 185ప్రత్యేక సిసి టివి కెమెరాలను, గుంటూరు డివిజన్‌లో 4,497మంది ఓటర్లకు గాను 13పోలింగ్ కేంద్రాలను,65మంది సిబ్బందిని ,నాందేడ్ డివిజన్‌లో 5,245మంది ఓటర్లకు గాను,15పోలింగ్ కేంద్రాలను,75మంది సిబ్బందిని, తిరుపతి రైల్వే వర్క్‌షాపులో 1,336మంది సిబ్బందికి గాను రెండు పోలింగ్ కేంద్రాలలో పదిమందిని, గుంటుపల్లి(రాయనపాడు) వర్క్‌షాపులో 1,999మంది ఓటర్లకు గాను మూడు పోలింగ్ కేంద్రాలను,15మంది సిబ్బందిని లాలాగూడ వర్క్‌షాపులో 2,829 మంది ఓటర్లకు గాను 3పోలింగ్ కేంద్రాలను, 15మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వెరసి దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మొత్తం 78,434మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జోన్‌వ్యాప్తంగా 170పోలింగ్ కేంద్రాలను,మరో 850మంది పోలింగ్ సిబ్బందిని,సిసి టివి కెమెరాలను భద్రతా,రక్షణకై రైల్వే,స్థానిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**సీమలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు :** రాయలసీమ జిల్లాల్లో మొత్తం 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక బలగాలను మోహరించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. గుంతకల్లులో ఆరు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. గుత్తి-3, చిత్తూరు-1, తిరుపతి-1, రేణిగుంట-1, కడప-1, డోన్-1చొప్పున మొత్తం 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక బలగాలను మోహరించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## డిప్యూటీ రేసులో లేను: శ్రీకాంత్‌షిండే

### కేంద్రపరిశీలకులుగా నిర్మలా సీతారామన్, విజయ్‌రూపానీ

### మహాయుతి శాసనసభా పక్ష సమావేశం రద్దు

### ఐదోతేదీ ప్రమాణ స్వీకారం ఖాయం అంటున్న బిజెపి



**ముంబయి, డిసెంబరు 2:** డిప్యూటి ముఖ్యమంత్రి పదవికోసం జరుగుతున్నరేసులో తాను లేనని, అసలు తన పేరు పరిశీలనలో కూడా లేనేలేదని కల్యాణ్ ఎంపిసీఎం ఏక్‌నాథ్‌షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే స్పష్టంచేసారు. గడచిన కొద్దిరోజులుగా డిప్యూటి సిఎంగా శ్రీకాంత్‌షిండే పేరును పరిశీలిస్తున్నట్లు తన తండ్రే స్వయంగా సిఫారసులు చేసినట్లువస్తున్న వార్తలను కొట్టివేసారు. ముఖ్యమంత్రి ఎంపిక జరిగి పోయిందని, అధికారికంగా ప్రకటించడమే తరువాయి అని బిజెపి రాష్ట్రఛీఫ్ చంద్రశేఖర్ భవాంకులే ఇప్పటికే ప్రకటించారు. అదేవిధంగా విపక్ష పార్టీల నాయకులుసైతం ముఖ్యమంత్రి ఎవరన్నది రాష్ట్రప్రజలకు తెలిసిపోయిందని కూడా విమర్శలుచేసారు. ఈక్రమంలోకేంద్ర పరిశీలకులుగా ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్, గుజరాత్‌మాజీ సీఎం విజయ్‌రూపానీలను కేంద్ర పరిశీలకులుగా మహారాష్ట్రకు పంపించింది. వీరంతా కూడా మహాయుతి శాసనసభా పక్ష సమావేశం నిర్వహించి ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కృషిచేస్తారు. వాస్తవానికి సోమవారం మధ్యాహ్నం మహాయుతి ఎల్పీ సమావేశం జరగాల్సి ఉండగా రద్దయింది. పరిస్థితులు ఎలాఉన్నా ఐదో తేదీ సాయంత్రం ఆజాద్ మైదానంలో ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం తప్పదన్న అంచనాలున్నాయి. ఇప్పటివరకూ కొనసాగిన ఫార్ములానే అనుసరించినా మాజీ సీఎంవైపు మొగ్గుచూపించడంతో షిండేసేనవర్గం ఎదురుతిరిగింది. 132 సీట్లు సాధించిన బిజెపికే ముఖ్యమంత్రి పదవి ఉండాలని బిజెపి మహా నేతలుపట్టుబడుతున్న సంగతి తెలిసిందే. షిండేసేనకు 57, ఎన్సీపీ 41స్థానాలు గెలిచాయి. హైకమాండ్ షరతులతో అలకవహించిన షిండే స్వగ్రామానికి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే తాను అస్వస్థతగా ఉండటంతో స్వగ్రామానికి వెళ్లాలని సోమవారం ముంబయికి వచ్చిన షిండే ప్రకటించారు. అంతేకాకుండా ప్రధానిమోడీ, అమిత్‌షాల నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు.

# అక్రమ ఆయుధం కొనుగోలు కేసులో కుమారుడికి క్షమాభిక్ష



## అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ సంచలన నిర్ణయం

**వాషింగ్టన్, డిసెంబరు 2:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్‌కు భారీ ఊరట లభించింది. మరికొద్ది రోజుల్లో అధ్యక్ష పీఠం నుంచి దిగిపోనున్న జో బైడెన్.. తన కుమారుడికి కేసుల నుంచి పూర్తి ఉపశమనం కల్పించారు. అక్రమంగా ఆయుధం కొనుగోలు సహా రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని ఈ సందర్భంగా జో బైడెన్ ఆరోపించారు.

'అమెరికా ప్రజలకు నిజాన్ని చెప్పాలి - నా జీవితం మొత్తంలో నేను పాటిస్తున్న సూత్రం ఇదే..! న్యాయశాఖ తీసుకునే నిర్ణయాల్లో జోక్యం చేసుకోబోనని అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే చెప్పా. ఆ మాటకు నేను కట్టుబడి ఉన్నా. నా కుమారుడు హంటర్‌ను అన్యాయంగా విచారించే సమయంలోనూ నేను చూస్తూ ఉండిపోయా. రాజకీయ కుట్రలో భాగంగానే అతడిపై కేసులో పెట్టారు. ఇక జరిగింది చాలు. ఈ కేసుల్లో అతడికి క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించుకున్నా. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానో అమెరికా ప్రజలు అర్థం చేసుకుంటారని భావిస్తున్నా' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. హంటర్ దోషిగా తేలిన సమయంలో క్షమాభిక్షకు యత్నించబోనని స్పష్టంగా పేర్కొన్న బైడెన్.. తాజాగా ఈనిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది.

**హంటర్‌పై ఉన్న కేసులు ఇవే..**

2018లో తుపాకీ కొనుగోలు సందర్భంగా ఆయుధ డీలరుకు ఇచ్చిన దరఖాస్తు ఫారంలో హంటర్ తప్పుడు సమాచారం ఇచ్చారు. తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని, వాటికి బానిస కాలేదని, తన వద్ద అక్రమంగా ఆయుధం లేదని వెల్లడించారు. అయితే అది తప్పని తేలింది. అప్పటికే హంటర్ డ్రగ్స్ అక్రమంగా కొనుగోలు చేశారు. వాటికి బానిసగా మారారు. 11 రోజులపాటు అక్రమంగా ఆయుధం కలిసి ఉన్నారు. ఇక, కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేత ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది.అక్రమ ఆయుధం కొనుగోలు వ్యవహారంలో హంటర్‌పై నమోదైన కేసులో ఈయేడాది జూన్‌లో న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. అయితే ఇప్పటివరకు శిక్ష ఖరారు చేయలేదు. దీనిపై అప్పట్లో జో బైడెన్ స్పందిస్తూ.. తీర్పును అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో తాను కుమారుడి తరఫున క్షమాభిక్ష కోరబోనని అప్పట్లో వెల్లడించారు. ఇప్పుడు అధ్యక్షపీఠం నుంచి దిగిపోయే సమయంలో కుమారుడికి ప్రసాదించే అవకాశాన్ని బైడెన్ వినియోగించుకున్నారు.

## బెయిల్ వచ్చిన మరుసటిరోజే మంత్రిగా ప్రమాణమా?

### సెంథిల్ బాలాజీపై సుప్రీం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** బెయిల్‌పై విడుదల అయిన తమిళనాట డిఎంకె నేత సెంథిల్ బాలాజీకి కొన్ని గంటల్లోనే తమిళనాడు ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలుచేపట్టడంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. అసలు అక్కడ ఏంజరుగుతోందని ప్రశ్నించింది. బాలాజీకి బెయిల్‌మంజూరుచేస్తూ ఇచ్చిన తీర్పును రీకాల్‌చేయాలంటూ దాఖలయిన పిటిషన్‌ను న్యాయస్థానం విచారిస్తూ ఈ వ్యాఖ్యలుచేసింది. డిఎంకెనేత సెంథిల్‌బాలాజీ బెయిల్‌పై విడుదలయిన మరుసటిరోజే కేబినెట్‌మంత్రిగా ప్రమాణంచేసారు. ఈ నిర్ణయం సాక్షులను ప్రభావితంచేసేదిగా ఉదని పిటిషన్ దాఖలు అయింది. దీనిపై సుప్రీం విచారణ చేపట్టింది. ప్రస్తుతం సెంథిల్ కేబినెట్‌లోమంత్రి కాబట్టి సాక్షులు ఖచ్చితంగా ప్రభావితంఅవుతారు. అసలు అక్కడ ఏంజరుగుతోందని సుప్రీం ప్రశ్నలువేసింది. బెయిల్ మంజూరులో మేం సరైన నిర్ణయమే తీసుకున్నాం. ఆతడి బెయిల్‌ను రద్దుచేయడం గురించి విచారణ జరపలేం.కానీ సాక్షులు ప్రభావితం అవుతారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని దీనిపై విచారణ జరుపుతామని చెప్పినన్యాయమూర్తులు తదుపరి విచారణను డిసెంబరు 13కు వాయిదావేసారు. ఈ ఏడాది సెప్టెంబరులో బెయిల్‌మంజూరు అయింది. ఆయన బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే డిప్యూటి సిఎంగా ఉదయనిధి స్టాలిన్ ప్రమోట్ అయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగామొత్తం నలుగురుఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తే వారిలో సెంథిల్‌కూడా ఉన్నారు.

3-12Pg6exHMNWJQE.qxd:3-12Pg6exHMNWJQE.qxd 01/01/01 8:35 AM Page 1



## తిరుమల సమాచారం



# ఎంత మహద్భాగ్యమో స్వామీ!

## 3వేలమంది స్థానికులకు గోవిందుని ప్రశాంత దర్శనం

**తిరుమల,డిసెంబరు2ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం స్థానికులకు 2013వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని టిటిడి ధర్మకర్తలమండలి కల్పించిన సౌకర్యాన్ని ప్రస్తుత ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పునరుద్దరించింది. తాజాగా సోమవారం వేకువజామున 3గంటలకు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలోని ప్రత్యేక కౌంటర్లలో 2,500 ఉచిత దర్శన టోకెన్లు స్థానికులకు జారీ చేశారు. తిరుపతి,తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన నివాసస్థులకు ఈ అవకాశం కలిగింది, ప్రతినెలా మొదటి మంగళవారం తిరుమల గోవిందుని దర్శన భాగ్యం 3వేలమందికి కల్పిస్తారు. ఒకసారి ఈ దర్శనం టోకెన్ పొందిన భక్తులు మళ్ళీ 90రోజుల తరువాతే అవకాశం ఉంటుంది. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జారీచేసిన స్థానికుల దర్శన టోకెన్లను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, తిరుపతి ఎంఎల్ఎ శ్రీనివాసులు, చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తినాని, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ప్రారంభించారు. తొలుత ఉచిత టోకెన్లను తిరుపతి రూరల్ మండలం గాంధీపురం, పేరూరు పంచాయతి వాసులకు వరుసగా మొదటి,రెండవ,మూడవ టోకెన్లు అందించారు. 7కౌంటర్లద్వారా ఈ టోకెన్లను గంటసమయంలో జారీచేసేశారు. అందుకున్న భక్తులు మంగళవారం(నేటి)ఉదయం 8గంటలకు దర్శనానికి అనుమతినిస్తున్నారు. అలాగే తిరుమలలో స్థానికులకు 500 ఉచిత దర్శన టోకెన్లు టిటిడి జారీ చేసింది. టిటిడి ఛైర్మన్, ఇఒ, అదనపు ఇఒ పాల్గొని స్థానికులకు ఆధార్‌కార్డు ఆధారంగా టోకెన్లు అందించారు. ఈ విధానం ఇకపై నిరంతరాయంగా ప్రతినెలా మొదటి మంగళవారం అమలవుతుందని ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



# వెంకన్న నుంచి పద్మావతికి లక్ష్మీకాసులహారం

## వేడుకగా ఊరేగింపు

**తిరుమల,డిసెంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** దేవేరి శ్రీవేంకటేశ్వరస్వామి పట్టపురాణి తిరుచానూరులో కొలువైన పద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు అలంకరించేందుకు ఎంతో విశిష్టత ఉన్న లక్ష్మీకాసుల హారాన్ని తిరుమల నుండి తీసుకెళ్ళారు. సోమవారం ఉదయం తిరుమలేశుని ఆలయంలో స్వామివారి పాదాలచెంత ఉంచి ప్రత్యేక పూజలు చేసిన టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు అనంతరం లక్ష్మీకాసులహారాన్ని వెండిపెట్టెలో ఉంచి అత్యంత భక్తితో తలపై పెట్టుకుని ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపుగా తిరుచానూరుకు తీసుకెళ్ళారు. తిరుమలేశునికి జరిగే బ్రహ్మోత్సవాల గరుడసేవ తరహాలోనే తిరుచానూరు పద్మావతి అమ్మవారికి సోమవారం రాత్రి జరిగే గజవాహనసేవలో ఈ లక్ష్మీకాసుల హారం అలంకరిస్తారు. తిరుమల నుండి తిరుపతి మీదుగా తిరుచానూరుకు చేరిన లక్ష్మీకాసులహారాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి దంపతుల నుండి అందుకుని అమ్మవారి ఆలయంలో ఉంచారు. ఎంతో భక్తితో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

# 30నుండి వెంకన్న ఆలయంలో అధ్యయనోత్సవాలు

**తిరుమల,డిసెంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11రోజుల ముందు దివ్యప్రబంధ అధ్యయనంగా పిలిచే అధ్యయనోత్సవాలు ఈనెల 30వతేదీ సోమవారం నుండి మొదలవుతున్నాయి. స్వామివారి ప్రాశస్త్యంపై 12మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు గోష్టిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4వేల పాశురాలను 25రోజుల పాటు తిరుమలేశుని ఆలయంలోపల రంగనాయకుల మండపంలో వైష్ణవులు పారాయణం చేస్తారు. తొలి 11రోజులు పగల్‌పత్తుఅని, మిగిలిన 10రోజులు



రాపత్తుఅని వ్యవహరిస్తారు. 22వరోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వరోజు రామానుజ నూట్రందాది. 24వరోజులు స్వామివారి శాత్తుమొర, 25వరోజు అధ్యయనోత్సవాలు పూర్తవుతాయి.

# తిరుమల ఘాట్‌లో కారు ర్యాష్‌డ్రైవింగ్

## హైదరాబాద్ యువకులపై పోలీసు కేసు

**తిరుమల,డిసెంబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రానికి దేవదేవుడు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన ఐదుమంది యువకులు ప్రయాణిస్తున్న కారులో ఇష్టానుసారంగా కప్‌బోర్డుపైన నిలబడి రచ్చరచ్చచేయడంపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. ఘాట్‌రోడ్డులో జోరువర్షం కురుస్తున్న సమయంలో, ర్యాష్‌డ్రైవింగ్ చేస్తూ కేకలు వేస్తూ సెల్ఫీలు తీసుకుంటూ వాహనాన్ని నడిపారు. దీంతో ఈ ఘటన తోటి ప్రయాణీకులకు,భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఘాట్‌లో ఈ కారులో ప్రయాణించిన ఐదుమంది యువకులు ర్యాష్‌డ్రైవింగ్‌తో ప్రమాదబారిన పడితే పరిస్థితి ఏంటనే అంశంపై పలువురు ప్రయాణీకులు టిటిడి విజిలెన్స్‌కు సెల్‌ఫోన్‌లో వీడియో తీసి పంపారు. సెక్టార్ 4 విఐ నరసింహారావు ఫిర్యాదు మేరకు తిరుమల 2టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసినట్లు తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన యువకులు సుశీల్‌వికాస్, ప్రభంజన్, ఆదర్శ్, రమేశ్, సుమన్ ఓ కారులో ఘాట్‌లో దురుసుగా వేగంగా నడిపి ఇబ్బందికి గురిచేశారని కేసు నమోదు చేశారు.

అంతేగాక దేవుని వద్దకు భక్తితో, దైవనామస్మరణతో రావాలని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.



# సచివాలయాల పునర్ వ్యవస్థీకరణ: సిఎం చంద్రబాబు

## సమర్థవంతమైన సేవలు అందించేలా తీర్చిదిద్దేందుకు కసరత్తు

**విజయవాడ, డిసెంబరు 2, ప్రభాత వార్త ప్రతినిధి:** గ్రామవార్డు సచివాలయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి, మరింత పటిష్టంగా తయారు చేసి ప్రజలకు ఉపయోగకరంగా నిల పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జీఎస డబ్ల్యూఎస్‌పై తన నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. అటు గ్రామాల్లోనూ ఇటు పట్టణ, నగర ప్రాంతాల్లోనూ సచివాలయాలు ప్రజలకు మరింత చేరువై, ఏ విధంగా మెరుగైన సేవలు అందించాలనే దానిపైన ముఖ్యమంత్రి ప్రధానంగా చర్చించారు. సచివాలయ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణ ప్రధాన అజెండాగా జరిగిన మొదటి మీటింగ్‌లో వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. మానవ వనరులను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు ఉద్యోగుల అవసరాలు, సౌకర్యాలపైనా చర్చించారు. సచివాలయ ఉద్యోగుల్లో కొందరికి ఎక్కువ పని, మరికొందరికి తక్కువ పని ఉండటం సరికాదని అందరికీ సమానమైన పని బాధ్యత ఉండేలా చూడాలనే ఆలోచనపై అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దు



బాటు, శిక్షణ వారికి ఇవ్వాలని సమావేశంలో చర్చించారు.ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు 13,291 ఉండగా గ్రామ సచివాలయాలు మాత్రం కేవలం 11,162 మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15,004 గ్రామవార్డు సచివాలయాలు ఉండగా వీటిలో 1,19,803 మంది ఉద్యోగులను నేరుగా నియమించారు. ఇతర విభాగాల వారిని కూడా కలుపుకుంటే 1,27,175 మంది గ్రామవార్డు సచివాలయాల్లో ఉద్యోగులుగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. వీరిలో గ్రామ సచివాలయాల్లో 95,533 మంది, వార్డు సచివాలయాల్లో 31,592 మంది ఉన్నారు. వీరిలో 18 నుంచి 27 సంవత్సరాల వయసున్న ఉద్యోగులు 50,284 (39.54శాతం ) మంది, 28 నుంచి 37 సంవత్సరాల వయసున్న ఉద్యోగులు 54,774 (43.07శాతం ) మంది ఉన్నారు. సచివాలయ ఉద్యోగుల్లో పీజీ, పీహెచ్‌డీ, ఇంజినీరింగ్, వైద్య విద్య చదివిన వాళ్లు ఉన్నారు. పీజీ, ఆపైన చదివిన ఉద్యోగులు 14 శాతం, వృత్తివిద్యా కోర్సులు చదివిన వాళ్లు 31 శాతం ఉన్నారు. యువత అధికంగా ఉండే ఈ వ్యవస్థను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశంపై సమావేశంలో చర్చించారు. మొదటి సమావేశంలో వ్యవస్థ పనితీరుతో పాటు పలు అంశాలపై చర్చించారు. రానున్న రోజుల్లో మరింత కసరత్తు జరిపి ప్రభుత్వం ఈ విభాగంపై ముందడుగు వేయనుందని తెలిపారు.

**ఫెంగల్ తుఫాన్ ప్రభావం, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష:** మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండి పనిచేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం నిర్వహించిన సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. తుఫాన్ ప్రభావంతో గత 5 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 31 ఎంఎం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఇందులో తిరుపతి జిల్లాలో 178 ఎ.ఎం, చిత్తూరు జిల్లాలో 93 ఎం.ఎం, నెల్లూరు జిల్లాల్లో 88 ఎంఎం, అన్నమయ్య జిల్లాలో 65 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మొత్తం 53 మండలాల్లో తుఫాను ప్రభావం ఉందని....భారీ వర్షాలు ఉన్న ప్రాంతాల్లో రిలీఫ్ క్యాంప్ లు ఏర్పాటు చేసి ప్రజలను తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 6,824 హెక్టార్ల మేర వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు వివరించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, వర్షాల ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు.

# రేషన్ బియ్యం అక్రమరవాణా వ్యవస్థీకృత నేరం

## కాకినాడ పోర్టులో ఐదు వేర్ హౌసుల్లో సార్టెక్స్ మిషన్లు ఏర్పాటుపై విచారణకు ఆదేశం

### సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశం



మంత్రివర్గ ఉపసంఘం బేటీ దృశ్యం

**విజయవాడ,డిసెంబరు2,ప్రభాతవార్తప్రతినిధి:** పేదల కోసం ఉద్దేశించిన బియ్యాన్ని అక్రమంగా రవాణా చేయడాన్ని వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గార్లతో కూడిన మంత్రివర్గ ఉప సంఘం సోమవారం సమావేశమైంది. ఈ సమావేశంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డి.జి, శాంతిభద్రతల ఐ.జీ., సివిల్ సప్లైస్ ఎక్స్ అఫిషియో సెక్రెటరీ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎం.డి., మారిటైమ్ బోర్డు సి.ఈ.ఓ., కస్టమ్స్ అధికారి, కాకినాడ పోర్టు అధికారులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టులో వ్యవహారాలపై చర్చించారు. కాకినాడ పోర్టులో భద్రత వ్యవస్థను బలోపేతం చేయాలని, ఇందులో భాగంగా కాకినాడ పోర్టు భద్రత కోసం ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను నియమించాలని ఈ సమా వేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో రవాణా కార్యకలాపాలపై నిఘాను కట్టుదిట్టం చేయ నున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి చేస్తున్న స్టెల్లా నౌకపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కాకినాడ పోర్టులోని అయిదు వేర్ హౌసుల్లో సార్టెక్స్ మిషన్లు ఉన్న అంశంపై చర్చించారు. వేర్ హౌసుల్లో యంత్రాలు ఏ విధంగా ఏర్పాటు చేశారని మారిటైమ్ బోర్డు, కాకినాడ పోర్టు అధికారులను మంత్రులు ప్రశ్నించారు. సార్టెక్స్ యంత్రాలను ఏర్పాటుపై విచారణ చేపట్టాలని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి నుంచి బియ్యం అక్రమ రవా ణాపై దృష్టిపెట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్దేశించింది.



# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను పునఃపరిశీలించండి

## కేంద్రమంత్రికి వినతి పత్రాన్ని అందించిన వైఎస్సార్సీ ఎంపీలు

**విజయవాడ,డిసెంబరు2,ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీలో కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి.కుమారస్వామిని వైఎస్సార్సీపీ ఎంపీల బృందం కలుసుకుంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహారణను పునః పరిశీలించాలని కుమారస్వామికి వినతిపత్రం అందజేసారు. వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభ ఫ్లోర్ లీడర్ పి.వి.మిధున్ రెడ్డి, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, మద్దిల గురుమూర్తి, మేడా రఘునాథ్ రెడ్డి, గుమ్మ తనూజా రాణి కుమార స్వామిని కలుసుకున్న వారిలో ఉన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా భావించే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి క్యాప్టివ్ మైనింగ్ లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది ఎంపీలు తెలిపారు. మరో రెండేళ్ళపాటు కేంద్రం నుంచి చేయూత అందితే ఆర్థిక పరిస్థితి మెరుగువుతుందని వివరించారు. ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడానికి వీలుగా ఆర్ఐఎన్ఎల్ కు క్యాప్టివ్ మైన్‌లను కేటాయించడం ద్వారా వ్యయప్రతికూలతలను అధిగమించేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఆర్థిక పునర్నిర్మాణానికి కేంద్రం సాయపడాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్స్ తమ విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. వచ్చే కేబినెట్ లో ఈ ప్రతిపాదనలు పెడతానని హామీ ఇచ్చారని వైకాంగ్రెస్ ఎంపీలు తెలిపారు.

# రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

## ఫెంగల్ తుఫాను బాధితులతో మాట్లాడిన కలెక్టర్ వెంకటేశ్వరన్

**తడ, డిసెంబరు 2 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలో ఫెంగల్ తుపాను వలన నీట మునిగిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ప్రత్యేకించి తమిళనాడు సరిహద్దుల్లోని తడ, వరదయ్యపాలెం, సూళ్లూరుపేట ప్రాంతాల్లో వర్షం ఎక్కువగా కురిసి పంట నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఇ మదనగోపాల్, ఆర్డీఓలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డిలతో ఆయన మాట్లాడారు. ఇక్కడ జరిగిన పంట నష్టం, వరద ప్రవాహాల గురించి తెలుసుకున్నారు. నీటిపారుదల, వ్యవసాయశాఖలకు జరిగిన నష్టాలను అంచనాలు వేయమన్నారు. ఇప్పటికీ నీటిలోనే నానుతున్న వరి పంటను కలెక్టర్ నేరుగా పరిశీలించారు. సూళ్లూరుపేట సమీపంలో రైల్వేట్రాక్ వద్ద కాళంగి నది వరద తీవ్రత ఎక్కువగా ఉందని ఈ సందర్భంగా



సోమవారం ఫెంగల్ తుపాను బాధిత రైతాంగంతో మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్

పలువురు రైతులు కలెక్టర్‌కు వివరించారు. పాముల కాలువ, కాళంగి నది కలుస్తున్న చోట పంట పొలాలు పూర్తిగా మునిగిపోయాయని చెప్పారు. అప్పటిదాకా గొడుగుల మధ్యన పర్యటించిన కలెక్టర్ రైల్వే ట్రాక్ ఆవలి వైపు కూడా వెళ్లి వరద ప్రవాహాన్ని పరిశీలించాలని ప్రయత్నించగా, స్థానికులు అక్కడ పరిస్థితులు వివరించి ప్రమాదం పొంచి ఉందని చెప్పడంతో అక్కడ నష్టాన్ని మాత్రం ఆయన నేరుగా తెలుసుకున్నారు. కొన్ని చెరువులు, పంట కాలువలు దెబ్బతినడం కలెక్టర్ దృష్టికి వచ్చింది. వర్షపాతం ఎక్కువగా ఉన్న చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయని కూడా రైతులు కలెక్టర్‌కు వివరించారు. స్వర్ణముఖి, కాళంగినది వరద ప్రవాహాలను, ఆనకట్టలను పరిశీలించి అక్కడి రైతులతోను మాట్లాడిన తర్వాత కలెక్టర్ జిల్లా కేంద్రానికి వెళ్లారు.

# అమరావతిలో ఇఎస్ఐ ఆసుపత్రి

## స్థలాలను పరిశీలించిన అధికారులు

**విజయవాడ, డిసెంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ కళాశాల ఏర్పాటుకు 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని మంత్రి పి,నారాయణ నేతృత్వంలోని కేబినెట్ ఉపసంఘం ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో నెక్కల్లు సమీపంలో ఈ -8 రహదారి పక్కన సర్వే నంబరు 20లో ఉన్న స్థలాన్ని ఈఎస్ఐ సీఆర్డీఏ అధికారులు ఆదివారం పరిశీలించారు. నాన్ పొల్యూషన్ ఇండస్ట్రియల్ జోన్ పక్కన 20 ఎకరాలను ఈఎస్ఐకి సీఆర్డీఏ కేటాయించింది. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు రహదారి పక్కన ఈ ప్రాంతం ఉంది. జాతీయ రహదారికి అనుసంధాన మార్గలు, భవిష్యత్తులో అభివృద్ధి చేసే విధానం, దగ్గరలో స్థలాలు కేటాయించిన సంస్థల వివరాలను సీఆర్డీఏ అధికారులు వివరించారు. ఆ ప్రాంతానికి సమీపంలోనే అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతుందని వారు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం రాజధాని సెంట్రల్ పాయింట్‌గా ఉండనుందని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి, వైద్య, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలు నిర్మించాల్సి ఉన్నందున భవిష్యత్ అవసరాల కోసం మరో 20 ఎకరాలు కేటాయిస్తూ బాగుంటుందనే విషయమై వారు చర్చించారు. కార్యక్రమంలో బీమా , వైద్య సేవల డైరెక్టర్ వి.ఆంజనేయ, ఈఎస్ఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ ,జాయింట్ డైరెక్టర్ జి జగదీప్ గాంధీ,తహసీల్దారు రవిబాబు, సీఐఎస్ ప్లానింగ్ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీకి మించి మద్యం అమ్మితే రూ.5లక్షల జరిమానా

**విజయవాడ,డిసెంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మద్యం ధరలను నియంత్రించేందుకు తీవ్ర చర్యలను చేపట్టింది.మద్యం అక్రమాలపై భారీ జరిమానాలు విధిస్తూ ప్రభుత్వం నోటఫికేషన్ జారీ చేసింది. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే రూ.5 లక్షలు జరిమానా విధిస్తామని తెలిపింది. మరోసారి అదే తప్పు చేస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని నోటిఫికేషన్‌లో వివరించింది. అదే విధంగా మద్యం దుకాణం పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించినా ఐదులక్షల జరిమానా విధిస్తామని పేర్కొంది. ఏపీ ఎక్సైజ్ చట్టం 471 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసింది. బార్ లైసెన్సులకు సైతం ఇదే నిబంధన వర్తిస్తుందని తెలిపింది.

# సోషల్ మీడియా యాక్టివిస్టులకు సెక్షన్ 111 వర్తించదు



మాజీ ఎఎజిపి పొన్నవోలు

**విజయవాడ, డిసెంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో వైఎస్సార్‌సీపి శ్రేణులను కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వేధిస్తోందన్నారని మాజీ ఏపీ ఎఎజీపీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పొన్నవోలు సుధాకర్. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పోలీసులు సంబంధంలేని సెక్షన్లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై పెట్టిన 111 సెక్షన్ వర్తించదు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ సోమవారం డిల్లీలో మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా కార్యకర్తలకు ఈరోజు శుభదినం. ప్రతీ కార్యకర్తను కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశించారు. సజ్జల భార్గవ రెడ్డి మీద పిటిషన్ వేశాం. నెల రోజుల నుంచి ఏపీలో ఫ్యాసిస్ట్ ప్రభుత్వ కోరల్లో చిక్కుకుని సోషల్ మీడియా కార్యకర్తలు నలిగిపోతున్నారు. జులై 1, 2024 కు ముందు జరిగిన ఘటనలకు సెక్షన్ 111 వర్తించదు. ఈ సెక్షన్ 111ను టీడీపీ దుర్వినియోగం చేసింది. సెక్షన్ 111 పెట్టాలంటే ముద్దాయిపై రెండు ఛార్జ్‌షీట్లు ఉండాలి. అలా కాకుండా రెండు ఛార్జ్‌షీట్లు లేకుండానే సెక్షన్ 111 పెడుతున్నారు. ఇది టీడీపీ ప్రభుత్వం ఫ్యాసిస్ట్ ప్రభుత్వం చేసిన పని. సోషల్ మీడియా కార్యకర్తలు ఈ చట్టం కిందకి రారు. కొన్ని వేల మందిపై అక్రమంగా కేసులు పెట్టారు. సజ్జల భార్గవకు అరెస్టు నుంచి రెండు వారాల రక్షణ కల్పించారు. ఏపీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసుకునే అవకాశం సుప్రీంకోర్టు ఇచ్చింది. ఘోరమైన నేరాలకు పాల్పడే వారికి ఇది 111 వర్తింపజేయాలని శాసన కర్తల ఉద్దేశం. ఈ ఉద్దేశాలకు వ్యతిరేకంగా అక్రమ కేసులు పెడుతున్నారు. ఒకే ఘటనపై మల్టిపుల్ ఎఫ్ఐఆర్‌లు పెట్టొద్దని గతంలోనే సుప్రీంకోర్టు చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదు. సుప్రీంతీర్పు ఉల్లంఘిస్తే అధికారులు కూడా శిక్షకు అర్హులే అంటూ కామెంట్స్ చేశారు.

# బియ్యం అక్రమరవాణా ఓ జాతీయస్థాయి కుంభకోణం: షర్మిల

**విజయవాడ, డిసెంబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు తరలింపు వెనుక పెద్ద మాఫియా ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఇదో జాతీయస్థాయి కుంభకోణమన్నారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పేద పొట్టకొట్టి రూ.48 వేల కోట్ల ప్రజల డబ్బును పందికొక్కుల్లా తిని దోపిడీకి పాల్పడ్డారు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక ప్రజా ప్రతినిధుల ప్రమేయముంది. ఈ వ్యవహారంలో కింది నుంచి ఉన్నత స్థాయి వరకు కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది. ఎవరికి దక్కాల్సిన వాటా వాళ్లకు చేరుతుండటంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్ళు మూసుకుంది. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలోని పోర్టుల నుంచి 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరిగిందంటే మన చెక్ పోస్టుల పనితీరు ఎలా ఉందో అంచనా వేయొచ్చు ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని అక్రమంగా పోర్టు దాకా ఎలా చేర్చారు? మూడేళ్లలో 2కోట్ల టన్నుల రేషన్ బియ్యాన్ని ఎలా సేకరించారు? దీని వెనకున్న దొంగలెవరు? రూ.48 వేల కోట్లు ఎవరెవరు తిన్నారు? అప్పటి ప్రభుత్వ పెద్దలకు బియ్యం మాఫియాతో సంబంధాలు ఉన్నాయా? తీగ లాగితే వెనకున్న డొంక ఎక్కడ? మిల్లర్ల చేతివాటం ఉందా? రేషన్ డీలర్ల మాయాజాలమా? అనునిత్యం తనిఖీల సంగతేంటి? పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీ




వేయాలి. అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలి. ప్రపంచానికి అన్నం పెట్టే మన రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మార్చారు. ఈ వ్యవహారంలో నిజాలు నిగ్గు తేల్చాలి అని షర్మిల డిమాండ్ చేశారు.

3-12P□g7exHMNWJQE.qxd:3-12P□g7exHMNWJQE.qxd 01/01/01 9:10 AM Page 1



# అప్పు తీర్చమంటే ఎంపి పేరుచెప్పి బెదిరింపు

## 48వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేష్‌కు ప్రజల విన్నపాలు



**మంగళగిరి,డిసెంబరు 2ప్రభాతవార్త :** విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ 48వ రోజు ప్రజా దర్బార్‌కు మంగళగిరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు.ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్ స్వయంగా కలిసి వారి సమస్యలు విన్నవించారు.ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అప్పుతీర్చమంటే ఎంపి వైఎస్ అవినాష్ అను చరులమంటూ బెదిరిస్తున్నారని సత్యసాయి జిల్లా తాడిపత్రికి చెందిన సి.అమ్మాజీ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తనవద్ద తీసుకున్న అప్పు చెల్లించకుండా వైసీపీ ఎంపి అవినాష్‌రెడ్డి,వైఎస్ మధు పేరు చెప్పి బెదిరిస్తున్నారన్నారు. ఏడాది క్రితం పులివెందులకు చెందిన షేక్‌సాయి అనే వ్యక్తికి దశలవారీగా రూ.40లక్షల వరకు అప్పుఇచ్చాం. ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా చెల్లించకపోగా...మాపై వేధింపులకు పాల్పడుతున్నారు.తాము వైసీపీ వ్యక్తులమని,ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి,వైఎస్ మధు అనుచరులమంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రకాశం జిల్లా మారా ౖపురం మండలం, దరిమడుగులో పేద రైతులకు చెందిన 13.70ఎకరాలను ఆక్రమించి మాజీమంత్రి,వైసీపీ నేత ఆదిమూలపు సురేష్,అతని సోదరుడు ఆదిమూలపు సతీష్ ఇంజినీరింగ్ కాలేజీ నిర్మించారని విచారించి తగిన న్యాయం చేయాలని గ్రామానికి చెందిన బట్టగిరి వెంకట రామాంజులరెడ్డి,దర్శికిచెందిన కేసరి రంగమ్మ మంత్రిలోకేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.సౌదీ అరేబియాలో ఆశ్రమ నిర్బంధానికి గురైన తన భర్త షేక్ ఇషాక్ ను విడిపించి స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా తంగెళ్లమూడికి చెందిన షేక్ నగీన మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.నా భర్త ఏడేళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లి రోవాద ఖలీద్ బిన్వాలీద్ లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సదరు కారు ప్రమాదానికి గురైంది.ఆ ప్రమాదంలో ఎలాంటి నష్టం లేదన్నారు.తన భర్త తప్పు లేకపోయినా కారు యజమాని కేసు నమోదు చేయడంతో పాటు తన భర్త పాస్‌పోర్టు స్వాధీనం చేసుకొని రూ.7లక్షలు నగదు డిమాండ్ చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు .పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కొరడా

## రైల్వే ఎన్నికల యంత్రాంగం హెచ్చరిక

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 2ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జరుగుతున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రచారం సోమవారం ఉదయంతో ముగిసింది. ఈ ఏడాది సెప్టెంబరు 9న జాతీయ స్థాయి రైల్వే ఎన్నికల ప్రధానాధికారి జారీ చేసిన నియమావళి సెక్షన్ 16,17,6ప్రకారం పోలింగ్ ప్రారంభానికి 48గంటలలోపు ప్రచారం పూర్తి చేయడంతో పాటు ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి కార్యక్రమాలను చేపట్టరాదనే ఆదేశాలను ఎన్నికల యంత్రాంగం తూచ తప్పకుండ పాటిస్తూ అమలు చేస్తుంది. నియమ, నిబంధనలను ఉల్లంఘించిన/అతిక్రమించిన వారిపై కొరడా ఝుళిపిస్తోంది. ఈ ఎన్నికల పోలింగ్ ఈ నెల 4న బుధవారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభం అవుతున్నందున ఎన్నికల నియమావళి మేరకు సోమవారం ఉదయం 8గంటలకు ఎన్నికల బరిలో ఉన్న కార్మిక సంఘాలు తమ ప్రచారాన్ని ముగించాయి. దీంతో రైల్వే పరిసరాలు, పరిపాలన భవనాలు, రైల్వే స్టేషన్లు, క్యాంటీన్‌లు, ల్యాబీలు,రైల్వే కాలనీలు, రైల్వే రోలింగ్ స్టాక్,ప్రహారీ గోడలపై ఎన్నికలకు సంబంధించిన రాతలను పూర్తిగా నిషేధం విధించింది. ప్రహారీగోడలపై,రైల్వే భవనాలపై ఎన్నికలకు సంబంధించిన వ్రాతలపై గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ఎవరు అతిక్రమించినా, ఉల్లంఘించినా వారిని ఉపేక్షించకుండా రూ.20వేలు భారీ జరిమానాను విధించనున్నట్లు ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీచేశారు.



సోమవారం స్వర్ణముఖి ప్రాజెక్టును పరిస్థితిపై కలెక్టర్ వెంకటేశ్వరన్‌కు వివరిస్తున్న ఇరిగేషన్ ఎస్‌ఇ మదనగోపాల్

# సూర్యనారాయణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

## హైకోర్టు ఆదేశాలపై హర్షం

**విజయవాడ, డిసెంబరు 2, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఐక్యవేదిక సంఘాల ఛైర్మన్, సూర్యనారాయణ సస్పెన్షన్ చట్టవిరుద్ధమని, తక్షణమే విధులులోకి తీసుకోవాని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపట్ల ఉద్యోగసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రతినెలా 1వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులకుహక్కుగా జీతం, పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలని, పిఆర్‌సి సకాలంలో అమలు, డిఏలు సకాలంలో విడుదల, పిఎఫ్‌ను జాప్యం లేకుండా ఇచ్చుట, ఎపిజిఎల్ఐ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే జమచేయాలని, తదితర సమస్యలపై ఉద్యమిస్తున్న సూర్యనారాయణపై సంబంధం లేని కేసులో నిందితునిగా చేర్చి, అక్రమంగా సస్పెండ్ చేసిన వైనాన్ని హైకోర్టు తప్పుపడుతూ తక్షణమే సూర్యనారాయణను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించిందన్నారు. ఈ సందర్భంగా న్యాయస్థానానికి ఏపిసిటిఎస్‌కె ప్రధాన కార్యదర్శి జిఎం రమేష్‌కుమార్, ఏపిజిఐఎ ప్రధాన కార్యదర్శిఎం.రమేష్‌కుమార్, ఐక్యవేదిక సెక్రటరీ జనరల్ బాజీ ఫతాన్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

# తెరుచుకోని కాళంగి రిజర్వాయర్ డ్యామ్ 8 గేట్లు

## 10 గేట్లు ఎత్తి నీటిని సముద్రానికి వదిలిన ఇరిగేషన్ అధికారులు



కాలంగి రిజర్వాయర్‌కు చేరిన నీరు

**కేవీబీ పురం, డిసెంబరు 2 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని కాలంగి రిజర్వాయర్ వరద నీటితో కలకలలాడుతుంది. ఫెంగల్‌తుఫాను ప్రభావంతో వర్షం కురుస్తున్న నేపథ్యంలో కాలంగి రిజర్వాయర్ వరద నీరు ఉధృతంగా రావడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై 4 గేట్లు ఎత్తి నీటిని సముద్రానికి వదిలారు. వర్షం ఎక్కువైన నేపథ్యంలో వరద నీరు వస్తున్న సందర్భంగా మరో ఆరు గేట్లు ఎత్తి నీటిని సముద్రానికి వదిలారు. మొత్తం 18 గేట్లు ఉన్నప్పటికి 8 గేట్లు మరమ్మతులకు గురై మొరాయించడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. 0.4 టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌కి వరద నీరు చేరుతున్న నేపథ్యంలో రైతుల సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కానీ గేట్లు మొరాయించడంతో అధికారులు రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రబావంతో అధికారుల సైతం అప్రమత్తమయ్యారు. దీంతో కాలంగి రిజర్వాయర్‌ని ఇరిగేషన్ డీఈ రత్నాకర్‌రెడ్డి, బాబు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికతో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎలాంటి ప్రాణహానీ అందే విధంగా ఆస్తి నష్టం పశువుల ప్రాణహాని జరగకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. పూడి కల్వర్టు తెగడంతో ప్రజలందరూ సాహిసించి దిగకుండా ఎస్ఐ ఓబయ్య ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎంపీడీవో రాధారాణి, మండల తహసీల్దార్ ముని రత్నం, అన్ని శాఖల అధికారులు తుఫాను ప్రభావంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# నష్టాలు మిగిల్చిన తుఫాను

**శ్రీకాళహస్తి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** తుఫాను ప్రభావంతో తిరుపతి జిల్లాలోని ప్రాజెక్టులు నిండాయి. రెండేళ్ళ తరువాత ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. తిరుపతికి సంబంధించిన గోగర్భం, మల్లిమడుగు, సదాశివకోన రిజర్వాయర్లలో నీరు నిండటంతో లాగ్‌లు ఓపెన్ చేయటంతో స్వర్ణముఖి నదికి జల కళ వచ్చింది. యన్నారు. ఇక అరణియార్ ప్రాజెక్టు నుంచి నాలుగు గేట్లు ఎత్తివేసి 2వేల క్యూసెక్కుల నీటిని విడుదలచేయగా, కాళంగి రిజర్వాయర్ నుంచి 3గేట్లును ఎత్తివేసి 1500 కూ ్యసెక్కులనీటిని విడుదలచేస్తున్నట్లు తెలిపారు.

**ఛిద్రమైన రోడ్లు: రాకపోకలకు అంతరాయం:** సోమవారం ఉదయం నుంచి తెరపలు తెరపలుగా



శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం సమీపంలో చిధ్రమైన రోడ్డు

అయితే గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకొని చెరువులు, రోడ్ల పరిస్తితి అధ్వాన్నంగా మారింది. మల్లిమడుగు, కళ్యాణి నుంచి స్వర్ణముఖి నదిలోకి నీరు వస్తుంది. సోమవారం కూడా 11వేల క్యూసెక్కుల నీరు సముద్రానికి స్వర్ణముఖి నది నుంచి పారుతుంది. కాగా కాళంగి గేట్లు తెరచుకున్నాయి. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో 13చెరువులు దెబ్బతిన్నాయని వీటికి ఇప్పటి వరకు రూ.50లక్షలతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. అంతేకాకుండా శాశ్వత పనులకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఎస్ఇ మదనగోపాల్ వివరించారు. సత్యవేడు సబ్‌డివిజన్ పరిధిలో 8 చెరువులు దెబ్బతిన్నాయని శ్రీకాళహస్తి ఇరిగేషన్ పరిధిలో మొత్తం 911 చెరువులు పూర్తిస్థాయిలో నీటితో నిండా వర్షం కురుస్తూనే ఉంది.ఇప ్పటికే వర్షంతో జన జీవనం స్థంభించింది.ముఖ్యంగా పట్టణ పరిధిలోనూ, పరిసరాల్లో తారు రోడ్లు, కచ్చా రోడ్లు ధ్వంస మయ్యాయి. ముఖ్యంగా పట్టణ పరిధిలోని తేరువీధి చివర ఆలయానికి వచ్చే ప్రారంభంలో దేవస్థానం సమాచార కేంద్రం వద్ద రోడ్డు పరిసి ్థతి దారుణంగా మారింది. ఇక స్వర్ణముఖి వంతెన నుంచి దిగువ సన్నిధివీధి సన్నిధివీధికి వెళ్ళు దారి చిద్రమైంది. ఇక కొత్త రామసేతు వంతెన, జలవినాయక ఆలయం వద్ద సిమెంటు రోడ్డు ఛిన్నాభిన్నమైంది. రివర్‌వ్యూ నుంచి పొన్నాలమ్మ గుడి వరకు సిమెంటు రోడ్డు పరిస్థితి రాళ్ళు తేలి ఏ వాహనం ఎప్పుడు పంక్చర్ అవుతుందో తెలియని స్థితి చోటు చేసుకుంది. దక్షిణ కైలాస్ నగర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు పయనం ప్రశ్నార్థకంగా ఉంది.

# అడవిలోకి చొరబడుతున్న 14మంది అరెస్టు

## రెండు వాహనాలు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం




**తిరుపతి కార్పొరేషన్, డిసెంబరు 2 ప్రభాతవార్త :** ఏర్పేడు సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 14మందిని టాస్క్ ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు వాహనాలు, గొడ్డళ్లు, రంపాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ గారి పర్యవేక్షణలో డీఎస్పీలు జీ బాలిరెడ్డి, వీ. శ్రీనివాసరెడ్డిల మార్గనిర్దేశంలో ఆర్ఐ కే. సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా కృష్ణాపురం ఫారెస్ట్ సెక్షన్‌లో ఎంట్రీ ఎగ్జిట్ పాయిం ట్లు తనిఖీ చేపట్టారు. చింతలపాలెం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఒక ఇన్నోవా, బొలేరో గూడ్స్ వాహనాల్లో కొంత మంది దిగుతూ కనిపించారు. అనుమానించిన టాస్క్ ఫోర్సు సిబ్బంది వారిని చుట్టుముట్టగా, పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే వారిని పట్టుకోగా, వారి వద్ద పిడిలేని ఇనుప బారిసలు, గొడ్డళ్లు,రంపపు చుట్ట, వంట చేసుకోవాడానికి అవసరమైన సామగ్రి కనుగొన్నారు. వాటితో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుని, అడవిలోకి చొరబడేందుకు వచ్చిన 14మందిని అదుపులోకి తీసుకున్నారు.వారిలో 13మంది తమిళనాడుకు చెందిన వారు కాగా, ఒకరు చిత్తూరు జిల్లాకు చెందిన వారు ఉన్నారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించగా, సీఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వేదోక్తంగా సహస్ర లింగార్చన

**ఇంద్రకీలాద్రి, డిసెంబరు 2, ప్రభాతవార్త :** దుర్గమ్మ వారి ఆలయంలో వేంచేసియున్న శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయంలో సహస్ర లింగార్చన సేవలను వేదోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసం ముగింపుసందర్భంగా చివరిరోజైన సోమవారం జరిగిన ఈ పూజలో ఆలయ ఇఓ కెఎస్ రామారావు పాల్గొన్నారు.

**దుర్గమ్మసేవలో విఐపిలు :**దుర్గమ్మ ను సోమవారం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వ ఐఏఎస్ అధికారి సుమిత్ర దావ్రా, తెలంగాణ ఐపిఎస్ అధికారి రవిగుప్తా, ఐఏఎస్ అధికారులు శాంతికుమారి, శేషగిరిలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

సుమిత్ర దావ్రా, తెలంగాణ స్పెషల్‌ఛీఫ్ సెక్రటరి రవిగుప్తా, సినీ దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఎఎం రత్నం, తెలంగాణ ఛీఫ్ సెక్రటరి ఎ శాంతి కుమారి, వి శేషగిరి, ఇతర అధికారులు దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు.

**అలరించిన నృత్యసౌరభం:** దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం నృత్యసౌరభాలు భక్తులను అలరించాయి. గన్నవరంకుచెందిన ప్రతిన్ కూచిపూడి నాట్య అకాడమికి చెందిన నాట్యా చార్యులు కొలచిన కమలనిధి నేతృత్వంలో తాండవ నృత్యకరీ, వినాయకకవుతం, అయిగిరి నందిని, క్షీరాబ్ధి కన్యకకు, మహాగణపతి, ఓం శర్వాణి, జనుత శబ్దం, వీణాపుస్తక ధారిణీం, నాగేంద్ర హారాయ, పలుకే బంగారమాయెనా అంటూ సాగిన కీర్తనలకు దివిజ సాయి, జోస్న, లాస్య, భావన,ఎస్ఎన్‌వి, కీర్తన,కస్తూరి, ఓస్న, చరణ్య, ఖుషి, సుస్మిత,ఐతిహ్య, అశ్వినిలు కూచిపూడి నాట్యరీతులను పలికించి అబ్బురపరిచారు.

# స్విమ్స్‌లో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం




**తిరుపతి హెల్త్, డిసెంబరు 2 ప్రభాతవార్త :** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వారి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉషాకళావత్, మెడికల్ సూపరింటెండెంట్ డా రామ్, ఆర్.యం.ఓ డా.కోటిరెడ్డి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా . నాగరాజ్, డెంటల్ విభాగాధిపతి డా. మధుబాబు, ఫిజియోథెరపి కాలేజ్ ప్రిన్సిపాల్ డా. మాధవి, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాధిపతి డా. కళావత్‌లు పాల్గొని శ్రీ పద్మావతి హాస్పిటల్ నుండి వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ 1 గ్యాలరీలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా రామ్ తెలియజేస్తున్నారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ 1984 డిసంబర్ 2వ తేదీని భారతదేశంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంగా పాటిస్తారని, భోపాల్ గ్యాస్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల జ్ఞాపకార్థం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంగా జరుపుకుంటామని, ఇందులో భాగంగా స్వచ్ఛమైన గాలి, పచ్చని భూమి, సుస్థిర జీవనం వైపు ఒక అడుగుఖి అనే ఈ సంవత్సర థీమ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా కలుషిత నీరు. భూమి మరియు గాలి కారణంగా సంభవించే మరణాల గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకొని, అలాగే పారిశ్రామిక విపత్తులను ఎలా నివారించవచ్చునో తెలుసుకోవాలని మరియు పర్యావరణ కాలుష్యం నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయలని పిలువునిచ్చారు. కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డా నాగరాజ్ మాట్లాడుతూ వాహనాలు, క్రాకర్లు పేల్చడం, బాంబు పేలుళ్ళు పరిశ్రమల ద్వారా గ్యాస్ లీకేజ్‌లు మొదలైన వివిధ కారకాలు కాలుష్యానికి కారణమవుతాయని, ఈరోజుల్లో కాలుష్య సమస్య రోజు రోజుకు పెరుగుతోందని, కాలుష్య స్థాయిని తగ్గించడానికి,నియంత్రించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు జాతీయ కాలుష్య నివారణ దినోత్సవ ఉపన్యాస పోస్టర్, ప్రజంటేషన్లను రూపొందించడం జరిగిందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డా చంద్రశేఖర్, డా. ఐశ్వర్య, డా. అజిత, డా. భవాని, డా. అంజు అదే, డా. రవి శంకర్, డా విశ్వేశ్వర రావు, డా. ప్రత్యూష్య, డా. లలిత్, డా. స్వర్ణ, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు, నర్సింగ్, ఫిజియోథెరపి, ఎ.హెచ్.యస్ విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిండు కుండలా ఎన్టీఆర్ జలాశయం

## భారీగా వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తివేత

## దిగువ ప్రాంతాలకు నీరు విడుదల చేసిన అధికారులు

**చిత్తూరు, డిసెంబరు 2 ప్రభాతవార్త:** చిత్తూరు నగర ప్రజల దాహార్తి తీర్చడానికి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలోని రైతుల పంటల సాగుకు అవసరమైన నీటిని నిల్వ చేయడానికి పెనుమూరు మండలం కలువగుంట వద్ద నిర్మించిన ఎన్టీఆర్ జలాశయం నిండు కుండలా దర్శనమిస్తుంది. గత మూడు రోజులుగా ఫెంగాల్ తుఫాను ప్రభావంతో చిత్తూరు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు కావడంతో ఎన్టీఆర్ జలాశయంలో నీరు పుష్కలంగా వచ్చి చేరింది. ఇది వరకే కురిసిన వర్షాలతో పూర్తి స్థాయిలో నిండిన ఎన్టీఆర్ జలాశయం ప్రస్తుతం కురిసిన వర్షాలతో మరింత నిండటంతో ఇరిగేషన్ శాఖ అధికారులు జలాశయంకు చెందిన రెండు గేట్లను ఎత్తివేసి జలాశయం నుండి నీటిని దిగువ ప్రాంతాలకు సోమవారం విడుదల చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జలాశయంకు ఇన్‌ఫ్లో కింద వంద క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో కింద వంద క్యూసెక్కుల నీటిని జలవనరుల శాఖ అధికారులు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. ఎన్టీఆర్ జలాశయం 294 మీటర్ల లోతు వుండగా ప్రస్తుతం 294 మీటర్ల లోతులో నీరు వున్నాయని అధికారులు తెలిపారు.

# మెట్రోరైల్ తొలిదశ డిపిఆర్‌కు ఆమోదం



**విజయవాడ,డిసెంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుల తొలిదశ డీపీఆర్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ డీపీఆర్‌లను కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖ తొలి దశలో 11 వేల 498 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 46 కిలోమీటర్ల మేర 3 కారిడార్లను నిర్మించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34 కిలోమీటర్లు ఒకటో కారిడార్, గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5 కిలోమీటర్లు 2వ కారిడార్, తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ వరకు 6 కిలోమీటర్లు 3వ కారిడార్ నిర్మించనున్నారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం వరకు 30 కిలోమీటర్లు మరో కారిడార్ నిర్మించనున్నారు. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ మెట్రో రైల్ రెండు దశలుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో రెండు కారిడార్‌లు, రెండో దశలో మరో కారిడార్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మొదటి దశలో కారిడార్ 1ఏగా గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ, కారిడార్ 1 బిగా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ మెట్రోరైల్ ప్రాజెక్టు చేపట్టనున్నారు.

ఇక రెండో దశలో కారిడార్ 3గా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి వరకూ ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశ కారిడార్ 1ఏ, 1బి లను 38.4 కిలోమీటర్ల మేర నిర్మించాలని డీపీఆర్ లో ప్రతిపాదించారు. దీనికి రూ.11,009 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మొదటి దశ కారిడార్ 1ఏ, 1బిల భూసేకరణకు రూ.1152 కోట్ల వ్యయం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని డీపీఆర్ లో స్పష్టం చేశారు. ఇక రెండో దశలో నిర్మించే మూడో కారిడార్ ను 27.5 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించారు.

విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు మొదటి దశలో 46.23 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లను ప్రభుత్వం నిర్మించనుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకూ 34.4 కిలోమీటర్ల మేర ఒకటోకారిడార్‌గా డీపీఆర్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇక గురుద్వారా నుంచి పాతపోస్ట్ ఆఫీసు వరకూ రెండో కారిడార్‌ను 5.08 కిలోమీటర్ల మేర నిర్మించనుంది. మూడో కారిడార్‌గా తాడిచెట్ల పాలెం నుంచి చినవాల్తేర్ వరకూ 6.75 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది మొదటి దశలో మొత్తం రూ. 11,498 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తుంది. అలాగే రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్ర యం వరకూ 30.67 కిలోమీటర్ల మెట్రో రైల్ కారిడార్ నిర్మాణం చేపట్టనుంది. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి కె.కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

# కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు 'స్కోచ్' అవార్డు

## జాతీయ స్థాయిలో పూలు.. కూరగాయల రంగంలో ఉత్తమ ప్రతిభ

**కుప్పం, డిసెంబరు 2 ప్రభాతవార్త :** కుప్పం సిగలో మరో జాతీయస్థాయి ప్రతిష్టాత్మక గుర్తింపు చేరింది. సిఎం చంద్రబాబు నాయుడు గతంలో పడిన కష్టానికి తగిన ఫలితం దొరికింది. కుప్పం మండలం బంగారునత్తం గ్రామం వద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సిఓఇ) కేంద్రానికి 2024సం॥కు గాను ప్రతిష్టాత్మకమైన 'స్కోచ్' అవార్డు లభించింది. ఉద్యానవన రంగ ంలో రాష్ట్ర ఉద్యాన వనశాఖకు ఈ అవార్డు లభిం చింది. కుప్పంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా రైతులకు పూలు, కూరగాయల సాగు, ఉత్పత్తి, విక్రయాలకు సంబంధించి అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. దేశరాజధాని ఢిల్లీ నగరంలో రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి ఈ అవార్డును 'స్కోచ్' ప్రతినిధుల ద్వారా అందు కున్నారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ లెక్స్‌లెన్స్‌లో వేలాది రకాల కూరగాయలు, పూల మొక్కలు, ఉద్యానవన పంటల సాగుకు సంబంధించి నార్లను పెం పొందించి రైతులకు రాయితీతో అందించడం జరుగుతోంది. సిఎం చంద్రబాబు నాయుడు 2019వసం॥లో రైతుల ప్రయోజనాల దృష్ట్యా కుప ్పంలో ఇండో- ఇజ్రాయెల్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ కింద సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించారు.



కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రం

3-12pg10exB.qxd:3-12pg10exB.qxd 01/01/01 7:32 AM Page 1



ఆట



# 'పింక్' టెస్టుకు రెడీ

## తుది జట్టులో కీలక మార్పులు

## బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా ఛేంజింగ్

## ఆస్ట్రేలియాతో 6 నుంచి రెండో టెస్టు

**ఢిల్లీ:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రెండో టెస్టు డిసెంబర్ 6 నుంచి జరగనుంది. తొలి టెస్టులో ఘన విజయం సాధించిన భారత్.. రెండో టెస్టుకు మాత్రం తుది జట్టులో మూడు మార్పులు చేస్తోంది. పెర్త్ టెస్టులో 295 పరుగుల తేడాతో గెలిచి 5 టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ ఘనంగా ఆరంభించింది. ఇదే జోష్‌లో రెండో టెస్టుకు సిద్ధమవుతోంది. ఈ సిరీస్‌లోనే కీలకమైన టెస్టుగా భావిస్తున్న పింక్ బాల్ టెస్టు డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానుంది. ఈ టెస్టే టీమిండియాకు కీలకంగా మారింది. గత పర్యటనలో భారత జట్టు ఇదే వేదికపై జరిగిన పింక్ బాల్ టెస్టులో చిత్తుగా ఓడింది. రెండో ఇన్నింగ్స్‌లో 36 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. అయితే, ఈసారి మాత్రం అలా జరగకూడదనే ఉద్దేశంతో టీమిండియా ఆటగాళ్లు ముమ్మర సాధన చేస్తున్నారు. ఈ నేపద్యంలోనే తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ రోహిత్ శర్మ రెండో టెస్టుకు అందుబాటులోకి వచ్చాడు. జట్టుకు ఇదొక శుభ పరిణామం కాగా, తొలి టెస్టుకు దూరమైన వన్ డౌన్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కూడా కోలుకున్నాడు. దీంతో ఆడిలైడ్ టెస్టు కోసం టీమిండియా తుది జట్టులో పలు మార్పులు చేసే దిశగా సెలక్టర్లు కసరత్తు చేస్తున్నారు. తొలి టెస్టుతో పోలిస్తే.. రెండో టెస్టుకు భారత తుది జట్టులో మూడు మార్పులు చోటు చేసుకుంటాయనే ప్రచారం క్రికెట్ వర్గాల్లో నెలకొంది. కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు, శుభ్‌మన్ గిల్ కూడా తుది జట్టులోకి రానున్నారు. దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్‌ల స్థానాలను రోహిత్, శుభమన్‌లతో భర్తీ చేస్తారనే టాక్ నడుస్తోంది. ఇక ఏకైక స్పిన్నర్‌గా పెర్త్ టెస్టులో ఆడిన వాషింగ్టన్ సుందర్ బెంచ్‌కే పరిమితం కావొచ్చని తెలుస్తోంది. అతడికి బదులు అనుభవం ఉన్న రవీంద్ర జడేజా వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది.

ఈ మూడు మార్పులు చేస్తే.. జట్టు సమతూకంగా మారుతుందని సెలక్టర్లు భావిస్తున్నారు. అంతేకాకుండా టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా మార్పులు చోటు చేసుకుంటాయని తెలుస్తోంది. యశస్వి జైశ్వాల్‌తో పాటు, రోహిత్ శర్మ ఓపెనర్‌గా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానంలో శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీలు ఆడే దశగా మారుపలు చేస్తున్నారు. పెర్త్ టెస్టులో ఓపెనర్‌గా వచ్చిన కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం కన్పిస్తోంది.

కాగా డిసెంబర్ 6 నుంచి అడిలైడ్ వేదికగా రెండో టెస్టు ప్రారంభం కానుంది. పింక్ బాల్‌తో ఈ టెస్టు జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఈ డే/నైట్ టెస్టు ఉదయం 9.30 గంటలకు మొదలవుతుంది.



## కామన్వెల్త్ కరాటేలో పతకాల మోత మోగించిన తెలంగాణ

### భారత్ ఖాతాలో 2 స్వర్ణాలు, రెండు కాంస్య పతకాలు

**ఢిల్లీ:** కరాటే చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు మెరిశారు. దక్షిణాఫ్రికాలోని డర్బన్ వేదికగా గత నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు జరిగిన 11వ కామన్‌వెల్త్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలుముగిశాయి. ఈకరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ కరాటే క్రీడాకారులు పతకాల మోత మోగించారు. ఆడుతున్న తొలి టోర్నీలోనే రాష్ట్రానికి చెందిన రామినేని రోహన్, అమ్రది విశాల్ రెడ్డి, తాళపత్రి ఆరాధ్య పతకాలు గెలిచి చరిత్ర సృష్టించారు. ఈ పోటీల్లో భాగంగా 63 కిలోల విభాగంలో రోహన్ స్వర్ణం గెలవగా, 57కిలోల కేటగిరిలో విశాల్‌కాంస్యం నెగ్గాడు. అలాగే 42కిలోలవిభాగంలో ఆరాధ్య స్వర్ణం గెలిచింది. అంతేగాక ఆమె అండర్-14 విభాగంలోనూ కాంస్యం సొంతం చేసుకుంది.



## ప్రపంచ చెస్ ఛాపియన్‌లో మళ్లీ డ్రా

### రసవత్తరంగా గుకేశ్, లిరెన్ మధ్య టోర్నీ

**ఢిల్లీ:** ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో డ్రా ల పర్వం కొనసాగుతోంది. గుకేశ్, లిరెన్ మధ్య జరుగుతున్న ఈ మెగా టోర్నీ మరో రౌండ్‌ను ఇరువురు ఆటగాళ్లు డ్రాగా ముగించారు. తొలి మ్యాచ్‌లో లిరెన్ నెగ్గగా మూడో మ్యాచ్‌లో గుకేశ్ గెలిచాడు. ఇక 2, 4, 5వ మ్యాచ్‌లు డ్రా కాగా తాజాగా వరుసగా మూడో మ్యాచ్ లోనూ అదే ఫలితం పునరావృతమైంది. 46 ఎత్తుల తర్వాత డ్రాకు ఇరువురూ అంగీకరించారు.

6 గేమ్‌లు గుకేశ్, లిరెన్ తలా 3 పాయింట్లతో (ముందుగా 7.5 పాయింట్లకు చేరినవారు విజేతగా నిలుస్తారు) కొనసాగుతున్నారు. కాగా మరో 8 గేమ్‌లు మిగిలున్న ఈ టోర్నీలో 8 మ్యాచ్‌ల తర్వాత ఇరువురికి సమాన పాయింట్లు ఉంటే అప్పుడు టై బ్రేక్ గేమ్స్‌కు అదనపు రోజును కేటాయించే అవకాశముంది. దాదాపు సగం దశకు చేరుకున్నప్పటికీ గుకేశ్, లిరెన్ ఇద్దరూ డ్రా లకు మొగ్గుచూపుతుండటంతో రాబోయే మ్యాచ్‌లలో పోరు మరింత రసవత్తరంగా ఉండటం ఖాయంగా కన్పిస్తోంది.

# తొలి టి20లో పాక్ గెలుపు

### జింబాబ్వేపై 57 పరుగుల తేడాతో విజయం

**ఢిల్లీ:** జింబాబ్వేతో జరుగుతున్న తొలి టీ20లో పాకిస్థాన్ శుభారంభం చేసింది. బులవాయోలో జరిగిన మ్యాచ్‌లో 57 పరుగుల తేడాడో ఆతిధ్య జింబాబ్వేపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి పాకిస్థాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ ఇన్నింగ్స్‌లో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 165 పరుగులు చేసి స్వల్ప స్కోరుకే ఆగిపోయింది. ఓమైర్ యాసఫ్ 16 పరుగులు, సైమ్ ఆయూబ్ 24





పరుగులు, ఉస్మాన్ ఖాన్ 30 బంతుల్లో 39 పరుగులు, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు, సల్మాన్ అఘా 13 పరుగులు చేసి ఔటయ్యారు. ఆఖర్లో తయ్యబ్ తాహీర్ 25 బంతుల్లో 39 పరుగులు, 4 ఫోర్లు, ఒక సిక్స్, ఇర్ఫాన్ ఖాన్ 15 బంతుల్లో 27 పరుగులు, 3 ఫోర్ల స్కోరును వేగంగా రాబట్ట అజేయంగా నిలిచారు. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ సగరవ సికిందర్ రాజా, వెల్లింగ్టన్ మనకద్జ, ర్యాన్ బర్గ్ తలో వికెట్‌ను దక్కించుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన జింబాబ్వే 15.3 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన సికిందర్ రజా 28 బంతుల్లో 39 పరుగులు, 4 ఫోర్లు, తదివనషీ మరుమని 20 బంతుల్లో 33 పరుగులు, 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో రాణించారు. ఇక మిగిలిన 9 మందిలో ఏ ఒక్కరూ కనీసం 10 పరుగులైనా చేయలేకపోయారు. పాకిస్థాన్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్ 3 వికెట్లు, సుఫియా 3 వికెట్లు దక్కించుకోగా, రవూఫ్ 2 వికెట్లు పదగొట్టాడు. దీంతో మూడు మ్యాచ్ల సిరీస్‌లో పాకిస్థాన్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. కాగా మూడు వన్డేలు, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ల కోసం పాకిస్థాన్ జట్టు జింబాబ్వేలో పర్యటిస్తోంది. తొలి టీ20కు ముందు జరిగిన మూడు మ్యాచ్ వన్డే సిరీస్‌ను పాకిస్థాన్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి వన్డే గెలిచి సంచలనం సృష్టించిన జింబాబ్వే ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్‌ను కోల్పోయింది.

## వరల్డ్ టెన్నిస్ టూర్‌లో..

## తెలంగాణ అమ్మాయి రిషితకు సింగిల్స్ టైటిల్



**ఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్-జే 100 బాలికల సింగిల్స్ టైటిల్‌ను తెలంగాణ అమ్మాయి బసిరెడ్డి రిషితరెడ్డి కైవసం చేసుకుంది. ఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో భాగంగా ముగిసిన గర్ల్స్ సింగిల్స్ ఫైనల్స్‌లో రిషిత 4-6, 6-4, 6-3తో రష్యాకు చెందిన నెల్లి ఇవానోవాను చిత్తుచేసింది. ఈ టోర్నీ తొలి రౌండ్ నుంచి ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తూ ఆమె ఫైనల్‌కు చేరింది. ఇక తదుపరి తుది పోరులో రిషిత తొలి సెట్‌ను కోల్పోయింది. అయినప్పటికీ తర్వాత పుంజుకుని రష్యా అమ్మాయిని ఓడించింది. ఐటీఎఫ్ జూనియర్ ర్యాంకింగ్స్‌లో భాగంగా తెలంగాణలో అగ్రస్థానంలో ఉన్న రిషిత, భారత్‌లో 3వ ర్యాంకును కలిగి ఉంది. కాగా ఈ నెల 16, 19 తేదీలలో జరుగబోయే ఇంటర్నేషనల్ లాన్ టెన్నిస్ క్లబ్ రాడ్ లీవర్ క్లబ్‌లో రిషిత భారత్ తరఫున ప్రాతినిథ్యం వహించనుంది.

# వాణిజ్యం

## అప్పర్ సర్క్యూట్‌లో సుజ్లాన్ షేర్లు

**ముంబై, డిసెంబరు 2:** సుజ్లాన్ ఎనర్జీ స్టాక్ సోమవారం 5 శాతం అప్పర్ సర్క్యూట్ తాకి ఒక్కోటి రూ.66.12 స్థాయి వద్ద ఎన్ఎస్ఈలో ప్రయాణాన్ని ముగించాయి. దీంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.91,140 కోట్లకు చేరుకుంది. అయితే భారత స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ఒడిదొడుకులతో పాటు అమెరికా అధ్యక్షుడిగా ఎంపికైన ట్రంప్ రెన్యూవబుల్ ఎనర్జీకి వ్యతిరేకంగా కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ రంగంలోని అనేక కంపెనీల షేర్లు కొంత కుదుపుకు గురైన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం స్టాక్ ఈ షాక్ నుంచి తిరిగి తేరుకుని వేగంగా దూసుకుపోవటం ప్రారంభించింది. సుజ్లాన్ స్టాక్ రేటింగ్ మార్చిన బ్రోకరేజ్.. కొత్త టార్గెట్ ధర గడచిన గత ఐదు రోజుల్లో సుజ్లాన్ ఎనర్జీ షేరు 2.72 పడిపోయింది. గత నెలలో షేరు 0.30 క్షీణతను చూసింది. సుజ్లాన్ ఎనర్జీ షేర్లు 6 నెలల్లో 32.24 రాబడిని అందించగా.. 2024లో ఇప్పటి వరకు పెట్టుబడిదారులు 72 శాతం మేర రాబడిని అందుకున్నారు. ఇక దీర్ఘకాలం విషయానికి వస్తే ఐదేళ్ల లో ఈ ఎనర్జీ స్టాక్ తన ఇన్వెస్టర్లకు 3173 శాతం భారీ





రాబడిని అందించి మల్టీబ్యాగర్ గెయిన్స్ తెచ్చిపెట్టింది. బ్రోకరేజీల మాట ఇదే.. ఈ తరుణంలో సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ షేర్లపై ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ జేఎం ఫైనాన్షియల్ తన అంచనాలను వెల్లడించింది. ముందుగా రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీ షేర్లకు తీగ్ర్రరేటింగ్ అందిస్తూ ఒక్కో షేరుకు టార్గెట్ ధరను రూ.81గా ఫిక్స్ చేసింది. సుజ్లాన్ ఎనర్జీ కంపెనీ తన వృద్ధి సామర్థ్యంపై మార్కెట్లకు ఇన్వెస్టర్లకు ఆశాజనక సంకేతాలను పంపుతోం దని బ్రోకరేజ్ వెల్లడించింది. వ్యాపార వృద్ధి, భౌగోళిక విస్తరణ కోసం సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్ సానుకూల చర్యలు తీసుకుంటోందని బ్రోకరేజ్ వెల్లడించింది. ప్రస్తుతం రెన్యూవబుల్ ఎనర్జీ కోసం కొనసాగుతున్న బూమ్ రానున్న 34 ఏళ్ల పాటు కొనసాగుతుందని ఇంధన రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, నవంబరు 2:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి నెమ్మ దించడంతో దాని ప్రభావం ఆరంభంలో సూచీలపై పడింది. దీంతో నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు, మధ్యాహ్నం తర్వాత రాణించాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 80 వేల పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 79,743.87 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైన కొద్దిసేపటికే మరింత నష్టాల్లోకి జారుకుని 79,308 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆ తర్వాత కోలుకుని





లాభాల్లోకి వచ్చిన సూచి చివరికి 445.29 పాయింట్ల లాభంతో 80,248.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 144.95 పాయింట్ల లాభంతో 24,276.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి 84.71 వద్ద ముగిసింది. సిమెంట్ ధరలు పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్ (3.93 శాతం) ప్రధానంగా లాభపడింది. ఆపై జేఎస్ డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 72,68 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2659 డాలర్ వద్ద కొనసాగింది.

## 11% పెరిగిన ఇళ్ల ధరలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు వార్షిక ప్రాతిపదికన సగటున 11 శాతం మేర (హౌసింగ్ ధరలు) పెరిగినట్లు ఓ నివేదిక వెల్లడించింది. జులై-సెప్టెంబర్ త్రైమా సికంలో అత్యధికంగా ఢిల్లీరాజధాని ప్రాంతంలో ఈ పెరుగుదల 32శాతంగా నమో దైంది. ఆయా నగరాల్లో వార్షిక ప్రాతిపదికన సగటున గృహాల ధరలు 11 శాతం పెరిగాయని, ఇంత చదరపు అడుగు సగటు రూ.11 వేలకు చేరిందని (కార్పెట్ ఏరియాను పరిశీలిస్తుంది) నివేదిక. 2021 నుంచి వరుసగా 15వ త్రైమాసికం లోనూ ఈ పెరుగుదల నమోదైందని, ఢిల్లీలో అత్యధికంగా ఈ పెరుగుదల 32 శాతం మేర పెరిగి సగటు ధర రూ.11,438కి చేరిందని నివేదిక పేర్కొంది. బెంగళూరులో ఒక్కో ఎస్ఎఫ్‌టి రూ.9,471 నుంచి రూ.11,743కు చేరిందని నివేదిక.



అత్యధికంగా ముంబయి మెట్రో పాలిటన్ రీజియన్ లోనే దాదాపు 40 శాతం ఇళ్లు అమ్ముడవ్వాల్సి ఉందని నివేదిక పేర్కొంది. హైదరాబాద్‌లో ఈ తరహా ఇళ్ల వార్షిక ప్రాతిపదికన 28 శాతం పెరిగినప్పటికీ, త్రైమాసిక ప్రాతిపదికన తగ్గుముఖం పట్టినట్లు నివేదిక. త్రైమాసికంలోనూ ఈ పెరుగుదల నమోదైందని, అమ్మకానికి 10 లక్షల ఇళ్లు దేశంలో 8 ప్రధాన నగరాల్లో 10 లక్షల యూనిట్లు విక్రయం కావాల్సి ఉందని నివేదిక నివేదిస్తుంది. వార్షిక ప్రతిపదికన ఈ సంఖ్య తగ్గుతూ వస్తోందని

## ఒకే రోజు 3,200 ఓలా స్టోర్లు..

**ముంబై, డిసెంబరు 2:** భారతదేశంలో ఇవి రంగంలో పెద్ద మార్పులు జరుగుతున్నాము. ఈ క్రమంలో పోటీ సైతం ఎక్కువగానే ఉన్నందున దీనిని తట్టుకునేందుకు, కస్టమర్లకు మరింతగా చేరువకావాలని ఓలా నిర్ణయించింది. ఈ క్రమంలో కంపెనీ తనస్టోర్ల ఏర్పాటుతో పాటు సర్వీస్ మెరుగుపరచటంపై దూకుడు పెంచింది. దేశంలో అతిపెద్ద ఇవి టూవీలర్ తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ డిసెంబర్ 20, 2024 నాటికి తన స్టోర్ నెట్‌వర్క్‌ను 4,000కి పెంచింది. 3,200కి పైగా కొత్త స్టోర్లు తెరవబోతున్నందున ఓలా దేశంలోని అన్ని పిన్‌కోడ్‌లను కవర్ చేస్తూ అతిపెద్ద ఇవి పంపిణీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది. ఇది దేశంలో యాక్సెస్, వృద్ధి, స్వీకరణను ప్రోత్సహిస్తుంది. దేశవ్యాప్తంగా కంపెనీ సర్వీస్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తూ, కొత్తగా ప్రారంభించిన అన్ని స్టోర్‌లు సర్వీస్ ఫెసిలిటీలతో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో కంపెనీ తన స్టోర్లను ఏకంగా నాలుగు రెట్ల వేగంతో విస్తరించింది. దేశం ప్రస్తుతం ఎలక్ట్రిక్ మొబిలిటీవైపు వేగంగా కదులుతోందని ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ భవిష్ అగర్వాల్ పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా తాము స్టోర్ నెట్ వర్క్ విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో విస్తృత డి2సి నెట్ వర్క్‌తో పాటు నెట్‌వర్క్ పార్టనర్ ప్రోగ్రామ్ కింద టచ్‌పాయింట్‌లు, టైర్-1 నగరాలను దాటి దేశం మొత్తాన్ని కవర్ చేయనున్నట్లు వెల్లడించారు. వీటి ధరలు సాధారణ మధ్య తరగతి వినియోగదారులకు అందుబాటులో రూ.40వేల నుంచి రూ.65 వేల మధ్య ఉంటాయని కంపెనీ వెల్లడించింది. ఇది గ్రామీణ, సెమీ అర్బన్ కస్టమర్లను టార్గెట్ చేసి విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటి డెలివరీలను 2025 ఏప్రిల్-మే మధ్య నుంచి ప్రారంభించాలని చూస్తోంది. కస్టమర్లు కేవలం రూ.499 చెల్లించి తమ ఇవిని బుక్ చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రస్తుతం





అమ్మకాలతో పాటు యూజర్ ఎక్స్ పీరియన్స్ మెరుగుపరచటంపై దృష్టిసారించినట్లు ప్రకటించింది. ఇప్పుడు 'ఇవి' స్వీకరణను వేగవంతం చేయడానికి రోల్‌అవుట్ ప్లాన్‌ను రెట్టింపు చేస్తోంది. భారీస్టోర్ విస్తరణ, సేవా కేంద్రాలతో పాటు, కంపెనీ ఇటీవల ప్రారంభించిన హైపర్‌సర్వీస్ చొరవకు ఊపందుకుంటుంది. అదనంగా ఓలా 2025చివరి నాటికి సేల్స్ అండ్‌సర్వీస్‌లో 10 వేలమంది భాగస్వాములను ఆన్‌బోర్డ్‌చేయడానికి నెట్‌వర్క్ పార్టనర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది.

## రిలయన్స్, ఓఎన్‌జిసిలకు బిగ్ రిలీఫ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న ముడి చమురుపై విధిస్తున్న విండ్ ఫాల్ ట్యాక్స్‌ను రద్దు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంటుంది. ఒప్పందం గత క్రమంగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఎట్టకేలకు తన నిర్ణయాన్ని ప్రకటించింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేంద్రం తాజా నిర్ణయంతో రిలయన్స్, ఓఎన్‌జీసీలకు భారీ ఊరట లభించినట్లయింది. దీంతో ఆయా కంపెనీల రిఫైనింగ్ మార్జిన్లు పెరుగుతున్నాయి. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్), క్రూడ్ ఉత్పత్తులు ఎగుమతులపై 2022 జులై 1 నుంచి కేంద్రం విండో ఫాల్ ట్యాక్స్ విధిస్తోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో ఆయా కంపెనీలకు పెద్దఎత్తున లాభాలు వస్తుండడంపై విధించే పన్నునే విండ్ ఫాల్ ట్యాక్స్‌గా ప్రకటించింది. రెండువారాల సగటు చమురు ధరల ఆధారంగా ప్రతి 15 రోజులకోసారి ప్రభుత్వం ఈ రేట్లను సవరిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు చేయాలని కేంద్రం నిర్ణయానికొచ్చింది. దీనితోపాటు పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ప్రభుత్వం విధిస్తున్న రోడ్డు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్సును కూడా రద్దు చేసింది. విండ్‌ఫాల్ రద్దు వార్తల నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.30 శాతం లాభంతో రూ.1309 వద్ద ట్రేడవుతోంది.



## అదానీ గ్రీన్ ఎనర్జీ ర్యాలీ

**ముంబై, డిసెంబరు 2:** అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ షేర్లు తమ బలమైన ర్యాలీని కొనసాగిస్తున్నాయి. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో అదానీ గ్రీన్ కంపెనీ షేర్లలోని దూకుడు ర్యాలీ కూడా కొనసాగింది. దీంతో ఇంట్రాడేలో కంపెనీ షేర్లు దాదాపు 9 శాతానికి పైగా పెరిగి రూ.1447.70 స్థాయికి చేరుకున్నాయి. దీంతో అదానీ స్టాక్ కేవలం నాలుగు ట్రేడింగ్ సెషన్ల లోనే పెట్టుబడిదారులకు 61 శాతం రాబడిని తెచ్చిపెట్టింది. అయితే దీనికి కారణంగా గ్రూప్ సీఎఫ్ఓ జుగేషిందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలేనని తెలుస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ మరియు జూన్ మధ్య కాలంలో రద్దు చేసిన డాలర్ బాండ్‌ను పునరుద్ధరించడాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇతర గ్రూప్ సంస్థలు కూడా ఏడాదిలోపు పబ్లిక్ బాండ్ విక్రయాలను అన్వేషించవచ్చని సింగ్ స్పష్టం చేశారు. అయితే దీనికి కొద్దిరోజుల ముందు అదానీ గ్రీన్ కంపెనీపై అమెరికాలో లంచాల ఆరోపణలు దర్యాప్తులో రావటంతో కంపెనీ తన 600 మిలియన్ డాలర్ల బాండ్ విక్ర



యాలను ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం గౌతమ్ అదానీ, ఇతర గ్రూప్ ఇతర గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌లపై ఎలాంటి లంచం ఆరోపణలు లేవని భారతీయ కంపెనీ పేర్కొంది. ఇదే క్రమంలో అదానీ గ్రూప్ పోర్ట్‌ఫోలియో కంపెనీలు రాబోయే 12 నెలల వరకు అన్ని రుణ సేవల అవసరాలను కవర్ చేయడానికి తగినంత లిక్విడిటీని కలిగి ఉన్నాయని సీఎఫ్ఓ వెల్లడించారు. దీంతో అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ షేర్లు రికార్డు సమయంలోనే లంచాల ఆరోపణలతో చూసిన నష్టాలను తిరిగి కవర్ చేశాయి. దీంతో ఇన్వెస్టర్లు సైతం హర్షం వ్యక్తంచేస్తున్నారు. కంపెనీ అమెరికా కోర్టు ఆరోపణలను ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్.. ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ఉన్నప్పటికీ అదానీగ్రూప్ లిస్టెడ్ స్టాక్స్ హవా మాత్రం బులిష్‌గానే కొనసాగుతోంది. ఎపిసెజ్ ఇన్వెస్టర్ డే2024 లో పాల్గొన్న బ్రోకరేజ్‌లు బలమైన వృద్ధి అంచనాల మధ్య అదానీ పోర్ట్స్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ షేర్లకు 63 శాతం వరకు పెరగవచ్చని తమ టార్గెట్ ధరలను అందించాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14